

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

నూతన రైలు మార్గాల మంజూరుకు
అనుమతులు ఇవ్వండి
హైస్పీడ్ రైళ్ల మార్గాల పనులు వేగవంతం చేయండి
అనంతారంలో మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయండి
కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వినతి
12

సంపుటి 29, సంచిక: 131 | శనివారం | 31-10-2026 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00

కబ్జా చెరవీడిన ప్రభుత్వ భూములు

ప్రజా ప్రయోజనాల కోసమే వినియోగం



ఇప్పటివరకూ దాదాపు రూ.1.50లక్షల కోట్ల విలువైన భూములు కాపాడాం

- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయస్థానాల్లో సమర్థంగా పోరాడి అన్యాక్రాంతం కాకుండా చూశాం
- మియాపూర్‌లోని 550 ఎకరాలతో పాటు రాష్ట్రంలో మొత్తం ఏడు ప్రధాన ప్రాంతాల్లో విలువైన భూములు సాధించాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయస్థానాల్లో సమర్థవంతంగా పోరాడి రాష్ట్రంలో అన్యాక్రాంతం కాకుండా, ఇప్పటివరకు దాదాపు రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములను కాపాడామని, మియాపూర్‌లోని 550 ఎకరాలతో పాటు రాష్ట్రంలో మొత్తం 7 ప్రధాన ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములను పోరాడి సాధించామని, కబ్జాదారుల ఆక్రమణల నుంచి కాపాడుకున్న ప్రభుత్వ భూములను ప్రజాప్రయోజనాల కోసం వినియోగిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి , మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు స్పష్ట మైన తీర్పు నేపథ్యంలో పార్లమెంట్ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రజల గొప్ప విజయమని పేర్కొన్నారు. మియాపూర్ భూములు కొల్లగొట్టేందుకు నాటి సిఎం కెసిఆర్ ఆయన బంధువు దామోదర్ రావు, గోల్డ్ స్టోన్ ప్రసాద్ ద్వారా ప్రయత్నించారని, కెసిఆర్, ఆయన కుటుంబ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని విలువైన భూములు కబ్జాకు ప్రయత్నించారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. మియాపూర్ భూముల విషయంలో దామోదర్ రావుకు ముందుగానే విలాసవంతమైన కార్లు లంచంగా ఇచ్చారని, కెసిఆర్‌కు నగదు రూపంలో ముడుపులు ఇచ్చారని సిఎం ఆరోపించారు. ఎమ్మెల్యేగా, ఎంపిగా, టిపిసిసి అధ్యక్షునిగా తాను ఈ కబ్జా వ్యవహారాలపై పోరాడడంతోనే కక్ష గట్టి తనను జైలుకు పంపారని తెలిపారు. మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పుపై బిఆర్ఎస్ నేతలు కెసిఆర్, కెటిఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 లోని 550 ఎకరాల భూమిపై సర్వహక్కులూ ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పు చారిత్రాత్మక మైన తీర్పు అని సిఎం

తరువాయి 8లో

బిపిటి బియ్యం కిలోకు
రూ.66 మించొద్దు

అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలతో విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు
ఇప్పటికే 12 కేసులు నమోదు
ధరలు అదుపులోకి వచ్చే వరకు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

బియ్యం అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెటింగ్, అధిక ధరల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. బియ్యం ధరలను నియంత్రించి వినియోగదారులకు ఊరట కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. బేగంపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సాధారణ ప్రజలు ఎక్కువగా వినియోగించే బిపిటి బియ్యం ధర కిలో రూ.66కు మించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆర్ఎన్ఆర్ బియ్యం ధరలపై నాణ్యత, ఉత్పత్తి వ్యయాలను పరిగణనలోకి తీసుకుని సమీక్షించనున్నట్లు చెప్పారు. అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలపై ఇప్పటికే 12 కేసులు నమోదు చేసినట్లు మంత్రి తెలిపారు. పౌరసరఫరాలు, పోలీసు, జిఎస్‌టి, తూనికలుకొలతల శాఖలతో పాటు సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల సమన్వయంతో దాడులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి,

తరువాయి 8లో



నవంబర్ 2, 3 తేదీల్లో

'ఐడిబిఐ' ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె

- బ్యాంకు ప్రైవేటీకరణతో దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం
- ఆ ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలి
- రూ. వేల కోట్ల విలువైన ఆస్తులను విదేశీ సంస్థలకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు
- ఎఐబిఒఎ జాతీయ చైర్మన్ అనిల్ కుమార్ మండిపాటు
- ఇందిరా పార్కు వద్ద రెండురోజులు నిరాహార దీక్ష చేస్తామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ ఐడిబిఐ బ్యాంకును ప్రైవేటీకరించే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎఐబిఒఎ జాతీయ చైర్మన్ వి. అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. బ్యాంకును విదేశీ సంస్థకు అప్పగించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజలకు, ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందని విమర్శించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నవంబర్ 2, 3 తేదీల్లో దేశవ్యాప్తంగా రెండు రోజుల సమ్మె తో పాటు ఇందిరా పార్కు వద్ద నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1964లో దేశ పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో ఐడిబిఐని ఏర్పాటు చేశారని, భారీ పరిశ్రమలు, రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. 2003 04లో బ్యాంకుగా మార్చిన సమయంలో కేంద్ర ప్రభుత్వ వాటా 51 శాతానికి తగ్గకుండా కొనసాగిస్తామని పార్లమెంట్‌లో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ హామీకి విరుద్ధంగా ప్రైవేటీకరణకు

తరువాయి 8లో

కాంగ్రెస్ బ్యాంకులు సృష్టిస్తే బిజెపి విక్రయిస్తోంది!
బ్యాంకులు అమ్ముకోవాల్సిన ఆస్తులుకావు, దేశ నిర్మాణానికి ఉపయోగపడే సాధనాలు : రాహుల్‌గాంధీ
ఐడిబిఐ ఉద్యోగులకు అండగా ఉంటానని హామీ
07





ప్రజాపక్షం/హైదరాబాద్

రియల్ ఎస్టేట్ నిర్మాణ రంగంలోని వారు
సంపద సృష్టికర్తలు

- నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో డిప్యూటీ సిఎం భట్టి
- హైదరాబాద్ నగరాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- నగరం, పరిసర ప్రాంతాల సమగ్రాభివృద్ధికి రూ.84,790 కోట్లతో భారీ కార్యాచరణ

హైదరాబాద్ నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పాత్ర అత్యంత కీలకమని, ఈ రంగంలో ఉన్నవారిని కేవలం వ్యాపారవేత్తలుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గుర్తిస్తోందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం జరిగిన 'నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో' కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కల్పించిన మౌలిక సదుపాయాలను మరింత విస్తరిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, బిహెచ్ఇఎల్, బిడిఎల్, ఇసిఐఎల్, డిఆర్‌డిఒ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఐఐటి,

తరువాయి 8లో

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డిఎ, డిఆర్ పెంపు
19.272 నుంచి 21.815 శాతానికి పెంపు..
జులై 1 నుంచి వర్తింపు
03



- నిబంధనలు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ
- సమగ్ర వివరాలు, అవసరాలు, ప్రాధాన్యతలను పరిగణనలోకి తీసుకొని మూడు విభాగాలుగా విభజన
- తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు

ప్రతి పంచాయతీకీ సమగ్రాభివృద్ధి ప్రణాళిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి నిమ్మితం ప్రతి గ్రామ పంచాయతీకి 'గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జిపిఎస్ ఎపి) 2026' రూపకల్పనను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జిఒ నంబర్ 42ను జారీ చేసింది. ప్రతి గ్రామ సమగ్ర వివరాలు, అవసరాలు,ప్రాధాన్యతలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికను మూడు విభాగాలుగా విభజించారు: గ్రామంలోని జనాభా, కుటుంబాల స్థితిగతులు, ఉపాధి వివరాలు, గృహ వసతి, భూమిలేని నిరుపేదలు, బలహీన వర్గాలు, పశు సంపద వివరాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల స్థితిగతులపై ప్రాథమిక నివేదికను రూపొందిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి మొదలుకుని రాబోయే 3 నుంచి 5 ఏళ్ల కాలానికి అభివృద్ధి ప్రణాళికను కూడా సిద్ధం చేస్తారు. గత ఏడాది నిధులు, ప్రస్తుత ఏడాది అంచనాలలో 125 శాతాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఆర్థిక కేటాయింపులను నిర్ణయిస్తారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనులతో పాటు వార్షిక ప్రణాళికను

తరువాయి 8లో

నవంబర్ 5న సింగరేణి ఉద్యోగులకు దీపావళి బోనస్ చెల్లింపు
10

జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన

కొన్ని రాష్ట్రాలకు మినహాయింపు!

న్యూఢిల్లీ : భారతదేశ వ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన మొదలవుతుందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. అయితే ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్, మణిపుర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో జనగణన ఉండదని స్పష్టం చేసింది. అలాగే మంచు కురిసే జమ్ముకశ్మీర్, లఢాఖ్, హిమాచల్‌ప్రదేశ్‌లోనూ జనగణన ఉందని పేర్కొంది. భారత రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జిఐ), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ జారీ చేసిన ప్రకారం, జనాభా గణనకు రిఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలుగా నిర్ణయించారు. ఆర్‌జిఐ ప్రకారం, జనగణన ప్రక్రియలో భాగంగా 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు 'స్వరణ దశ' (రివిజినల్ రౌండ్) ఉంటుంది. ఇంటింటికీ తిరిగి జనాభాను లెక్కించే ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు, అంటే 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే

తరువాయి 12లో



సిఇసిపై 'ప్రజా అభిశంసన'
నేటికి వాయిదా

వర్షం కారణంగా ఏకగ్రీవ నిర్ణయం

- సంయుక్త మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ వెల్లడి
- ఓట్లు దొంగిలిస్తున్న తీరుపట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు ఉన్నాయని వెల్లడి
- ఖర్గే నివాసంలో సమావేశంలో ర్యాలీ సన్నాహాలపై చర్చించిన ఇండియా కూటమి నేతలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి)పై ఇండియా కూటమి నిర్వహించతలపెట్టిన 'ప్రజా అభిశంసన' ఈనెల 31వ తేదీకి వాయిదా పడింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ నిష్పమణకు సమయం ఆసన్నమవుతోందని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. లోకసభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ మాట్లాడుతూ తాము చేస్తున్నవి బహుళ నిరసనలు కాదని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ కలిసి చేస్తున్న ఒకే నిరసన అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం (10, రాజాజీ మార్గ్) వద్ద 'ఇండియా' కూటమి నాయకులతో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. వర్షం కారణంగా శుక్రవారం నిర్వహించతలపెట్టిన ప్రజా అభిశంసన కార్యక్రమాన్ని శనివారానికి వాయిదా వేయాలని ఏకాభిప్రాయంతో నిర్ణయించామన్నారు. వర్షంలో సీనియర్ నాయకులు కూర్చోవడం ఇబ్బంది కరంగా ఉంటుందని భావించామని, కాబట్టి శనివారం కార్యక్రమాన్ని యథాతథంగా నిర్వహిస్తామని రాహుల్‌గాంధీ చెప్పారు. ఇక ఆదివారం (నవంబర్ 1న) రామ్‌లీలా మైదాన్ వరకు 'చలో ఢిల్లీ' మార్చ్ నిర్వహిస్తున్నామని, రాజకీయ లేదా రాజకీయేతర నేపథ్యం ఉన్న ఎవరైనా ఇందులో పాల్గొనవచ్చని ఆయన ఆహ్వానించారు. 'ఈ రెండు కార్యక్రమాలు కూడా భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఆయన బృందానికి వ్యతిరేకంగా చేపట్టినవి' అని లోకసభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. ప్రజలు

తరువాయి 8లో

ఒమేగా హాస్పిటల్స్‌పై
ఐటి దాడులు

- ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు
- 24 ప్రాంతాల్లో అధికారుల విస్తృత తనిఖీలు
- హైదరాబాద్ ఇన్వెస్టిగేషన్ వింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆపరేషన్
- భారీగా పత్రాలు, హార్డ్‌డిస్క్‌లు, ఆర్థిక లావాదేవీల రికార్డులు స్వాధీనం
- పన్ను ఎగవేత, భారీ నగదు లావాదేవీలపై ఆరా

ప్రజాపక్షం/హైదరాబాద్

ఒమేగా హాస్పిటల్స్‌పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు కొరడా ఝళిపించారు. పన్ను ఎగవేత, భారీ నగదు లావాదేవీలకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ ఇన్వెస్టిగేషన్ వింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో మొత్తం 24 ప్రాంతాల్లో ఐటి బృందాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి.ఈ తనిఖీల్లో భాగంగా ఒమేగా హాస్పిటల్స్‌కు చెందిన వివిధ శాఖలు, కీలక వైద్యుల నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేపట్టారు. ఆసుపత్రి వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ చి. మోహన వంశీ నివాసంతో పాటు ఆసుపత్రికి సంబంధించిన కీలక వ్యక్తుల ఇళ్లలోనూ తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ఈ ఆపరేషన్‌లో ఎనిమిది ప్రత్యేక బృందాలు పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. తనిఖీలు జరుగుతున్న ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.సోదాల్లో భాగంగా భారీ సంఖ్యలో కీలక పత్రాలు, హార్డ్‌డిస్క్‌లు, ఆర్థిక లావాదేవీలకు

తరువాయి 12లో

క్రమశిక్షణకు ప్రాధాన్యం

అవినీతిని అరికట్టాలని చైనా కమ్యూనిస్టు పార్టీ సమావేశ తీర్మానం



బీజింగ్ : చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకుల నాలుగు రోజుల కీలక సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ప్రధాన ప్రాధాన్యతగా భావిస్తున్న పార్టీ అంతర్గత క్రమశిక్షణను మరింత కఠినతరం చేయడం, అవినీతిని అరికట్టడం వంటి అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ నిర్ణయాలు వచ్చే ఏడాది పార్టీలోని కీలక నాయకత్వ విభాగాల్లో మార్పులకు మార్గం సుగమం చేయవచ్చని భావిస్తున్నారు. వచ్చే ఏడాది జిన్‌పింగ్ పార్టీ నాయకుడిగా నాలుగోసారి పదవిని చేపట్టే అవకాశం ఉంది. గురువారం నాటి కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఐదో ప్లీనరీ సమావేశంలో క్రమశిక్షణను బలోపేతం చేయడం, అవినీతిని నిర్మూలించడం గురించిన ఒక తీర్మానాన్ని ఆమోదించారు. అలాగే, 30 మందికి పైగా సీనియర్ అధికారులను పార్టీ నుంచి బహిష్కరించిన నిర్ణయానికి ఆమోదం తెలిపారు. వీరిలో ఈ ఏడాది ప్రారంభం వరకు చైనా సైన్యానికి అత్యున్నత జనరల్‌గా పనిచేసిన అధికారి కూడా ఉన్నారు. చైనా సైన్యాన్ని పర్యవేక్షించే కమిషన్‌లో మిగిలి ఉన్న మరో జనరల్‌కు పార్టీ అత్యున్నత నిర్ణయాధికార సంస్థల్లో ఒక టైన పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించారు. పార్టీ అధికారులు ప్లీనరీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేసే ప్రణాళికలను శుక్రవారం

తరువాయి 8లో

10 రోజుల్లో 4 ఎన్నికలు నిరంకుశత్వానికి ఎదురుదెబ్బ

ప్రపంచ పరిణామాలు అనూహ్యామైన మలుపులు తీసుకుంటున్నాయి. వాటిలో ఎన్నికల్లో ప్రజల తీర్పులు ఒక భాగం. ఎడతెగని యుద్ధాలు మరోభాగం, చివరిగా, ఫ్రాన్స్ తదితర యూరప్ దేశాల్లో విద్యార్థుల వీధిపోరాటాలు మరో ముఖ్యమైన పరిణామం. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచ దేశాల్లో పెచ్చుపెరుగుతున్న పచ్చి మితవాదానికి, నిరంకుశాధికారానికి ఎదురుదెబ్బ ఈ పరిణామాల్లో ఎన్నదగిన లక్షణం.

ప్రజాస్వామ్య ఎన్నికలు తీసుకుందాం. అక్టోబర్ 25 – నవంబర్ 3 మధ్య కేవలం 10రోజుల్లో నాలుగుదేశాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. వాటిలో బ్రెజిల్, సెర్బియాల్లో అక్టోబర్ 25న, ఇజ్రాయెల్‌లో అక్టోబర్ 27న ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడ్డాయి. అమెరికాలో నవంబర్ 3న కాంగ్రెస్‌కు మధ్యంతర ఎన్నికలు జరుగనున్నాయి. తొలి మూడు ఎన్నికల ఫలితాల్లో నిరంకుశాధికారానికి వ్యతిరేకంగా స్పష్టమైన తీర్పు ఉంది. బ్రెజిల్‌లో రన్‌ఆఫ్ ఎన్నికల్లో లాటిన్ అమెరికాలోని అతిపెద్ద ఆర్థికవ్యవస్థను అమెరికా వలసగా మార్చటానికి ప్రయత్నించిన పచ్చి మితవాదుల అభ్యర్థి ఫ్లావియో బోల్సనారోకు వ్యతిరేకంగా బ్రెజిలియన్‌లు తమ దేశ సార్వభౌమత్వాన్ని రక్షించుకున్న సూచన ఉంది. అతని పన్నాగాన్ని భగ్నం చేసిన ఓటర్లు వామపక్ష కూటమి అభ్యర్థి లులాకు అనుకూలంగా మెజారిటీ ఇచ్చి ఆయన్ను నాల్గవసారి అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టారు. భార్యబిడ్డలతో ఫ్లావియో అమెరికా పారిపోవటం బ్రెజిలియన్ పచ్చిమితవాదులను ఆశ్చర్యపరిచింది. 2022 అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయిన ఆయన తండ్రి జైర్ బోల్సనారో, తిరుగుబాటు కుట్రకుగాను సుప్రీంకోర్టు విధించిన 27 సంవత్సరాల శిక్షను అనుభవిస్తున్నాడు. తొలి విడత ఎన్నికల్లో ఫ్లావియోకన్నా 20 లక్షల ఓట్లు వెనుకబడిన లులా, రన్ ఆఫ్‌లో 40లక్షలపై చిలుకు మెజారిటీ సాధించటం – అంటే 60లక్షలకుపైగా అదనపు ఓట్లు సంపాదించటం ఒక అద్భుతం. లాటిన్ అమెరికాలో వామపక్ష ప్రభావాన్ని నిర్మూలించేదుకై అధ్యక్షుడు ట్రంప్ గత సంవత్సరకాలంగా అనుసరిస్తున్న బెదిరింపు విధానాలకు బ్రెజిలియన్‌లు అడ్డుకట్టవేశారు. బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల ఫలితాలు అర్జెంటీనా, చిలీ, కొలంబియా, ఈక్వెడార్ తదితర దేశాల్లో ట్రంప్ అనుకూల నిరంకుశ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేసేందుకు ఆ దేశాల్లోని వామపక్షాలను ఉత్తేజితం చేస్తున్నాయి. అయితే లులా అధ్యక్షునిగా తిరిగి ఎన్నికైనప్పటికీ ఆయన ఎజండా అమలు జరపటం సులభం కాదు. ఎందుకంటే చాంబర్‌లోని 513సీట్లలో 303, సెనేట్‌లో మూడింట రెండు వంతులు మితవాదులు గెలుచుకున్నారు. మొత్తం ఎన్నికల క్రమం సక్రమంగా జరిగిందని కోర్టు ప్రెసిడెంట్ కాస్సియో నునెస్ మార్క్యూస్ సర్టిఫై చేశారు. ఆయన జైర్ బోల్సనారో నియమించిన జడ్జీ.

సెర్బియా – యుగోస్లావియా విభజనతో ఏర్పడిన చిన్న దేశం. అలెక్సాందర్ ఉసిక్ 14 సంవత్సరాలుగా సాగిస్తున్న నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువత 'స్టూడెంట్ స్ట్రీట్ పార్టీ' బ్యానర్ కింద ఏకమై జాతీయ ఎన్నికల్లో పోటీ చేశారు. పార్లమెంటులోని 250లో 140 సీట్లను ఓటర్లను అనూహ్యంగా ఆ పార్టీకి కట్టబెట్టారు. ఇప్పుడు ఆ యువత ముఖ్యనాయకత్వ బృందాన్ని, నాయకుణ్ణి ఎంచుకునే పనిలో ఉంది. సెర్బియా నిరసనలకు నేపాల్, బంగ్లాదేశ్‌లోని పరిణామాలతో పోలికలున్నాయి. అయితే తేడా ఏమంటే సెర్బియన్ ఆందోళనకారులు ఉసిక్ ప్రభుత్వాన్ని కూల్చివేయలేదు, జాతీయ ఎన్నికల కోసం వేచి చూచారు.

సెర్బియా ఎన్నికల్లో విద్యార్థి ఉద్యమ విజయం ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్ తదితర దేశాల్లో నిరసన ఉద్యమాలపై ప్రభావం చూపుతున్నది. ఫ్రాన్స్‌లో ఆరు వారాలకుపైగా విద్యార్థుల నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. మాక్రాన్ ప్రభుత్వం ఆందోళనకారులతో చర్చలు జరపకపోగా, భద్రతాదళాలను ప్రయోగిస్తున్నది. ఫ్రాన్స్‌లో ఎన్నికలు 2027 మేలో జరుగుతాయి. విద్యార్థుల నిరసనను తమకు అనుకూలంగా ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని మితవాది మారీ లీపెన్ పార్టీ, వామపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. ఎవరు లబ్ధిపొందుతారో ఇప్పుడే స్పష్టంగా చెప్పటం కష్టం.

ఇజ్రాయెల్ ఎన్నికల్లో ప్రధాని ఇమ్మాన్యుల్ నెతన్యాహు లుకిడ్ పార్టీ కూటమి కనీస మెజారిటీ సీట్లు గెలుచుకోలేకపోవటం పచ్చిమితవాదులకు ఎదురుదెబ్బ. అయితే ప్రతిపక్ష పార్టీ అంతకన్నా మితవాది. ప్రభుత్వం ఏర్పాటుకు మ్యాజిక్ ఫిగర్ 61కాగా నెతన్యాహుకు 53, అతని ప్రత్యర్థి ఐసెన్‌కోట్‌కు 48 సీట్లు వచ్చాయి. అరబ్ పార్టీలు ఎన్నడూ లేనంతగా 19సీట్లు గెలవటం విశేషం. వారి తోడ్పాటు లేకుండా ఏ ప్రభుత్వమూ ఏర్పడదు. వారి తోడ్పాటు కోరే కూటమి పాలస్తీనియన్‌ల విషయంలో తమ దుందుడుకు విధానాలను సడలించుకోవల్సి ఉంటుంది. రెండు వారాల్లో ఎవరూ మెజారిటీ కూడగట్టుకోలేకపోతే మళ్లీ ఎన్నికలకు వెళ్లాల్సి వస్తుంది. ఈ లోపు నెతన్యాహు ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగుతారు. అరబ్ ప్రజల ఓటుహక్కు రద్దు చేస్తానని అతను తాజాగా ప్రకటించాడు. రెండు యూదు జాత్యహంకార పార్టీలు ఎత్తుగడలను వేచిచూడాల్సి ఉంది.

నవంబర్ 3న అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీనుంచి ప్రమాదం ఎదురవుతున్న రాష్ట్రాల్లో అధ్యక్షుడు ట్రంప్ తమ రిపబ్లికన్‌లకోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ట్రంప్ పాపులారిటీ రేట్ 30 శాతానికి తగ్గింది. దానికీ, అంతిమంగా ఓటింగ్‌కు సంబంధం ఉండదు. ప్రతినిధుల సభలో డెమొక్రాట్‌లు మెజారిటీ సాధిస్తారని ఒపీనియన్ పోల్స్ చెబుతున్నాయి. ఇప్పటికే 4కోట్లమంది ముందుగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సెనేట్‌లో మెజారిటీకి డెమొక్రాట్లకు మరో నాలుగు సీట్లు చాలు. ఈ ఫలితాల వల్ల ట్రంప్ అధ్యక్ష పదవికి ప్రమాదం లేకపోయినా అవి పాలనపై నైతికంగా అభిశంసన అవుతాయి. ఆయన అంతర్జాతీయ వ్యవహారాల్లో దూకుడు తగ్గించి దేశీయ సమస్యలపై కేంద్రీకరించాల్సి ఉంటుంది. లేకపోతే 2028 అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పరిస్థితి ఇబ్బందిలో పడుతుంది.



జాదవ్‌పూర్ వర్సిటీపై దాడి ఘోరం

జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంపై జరిగిన దాడి ఘోరమైనది. ఘటన విని దిగ్భ్రాంతికి గురయ్యాను. రాజకీయ హింస నుంచి ప్రజలను రక్షించాల్సిన అవసరం ఉంది. నా దేశంలోని అందరితో పాటు, వివిధ ప్రాంగణాల్లో విద్యనభ్యసిస్తున్న వారికి కూడా మద్దతు అవసరం. 70 ఏళ్ల క్రితం నేను నా బోధనా జీవితాన్ని జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలోనే ప్రారంభించాను. ఈ గొప్ప విశ్వవిద్యాలయంతో నా సంఘీభావం చాలా లోతైనది. హింస నుండి స్వేచ్ఛ అనేది మనమందరం పంచుకునే హక్కు. చెలరేగిన హింస వెనుక ఉన్న మతతత్వ భావాలను నిస్సందేహంగా ఖండించాలి.

– నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్



ఏమీ కొనేటట్టులేదు – ఏమీ తినేటట్టులేదు

ఎల్ నినో ప్రభావం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. నిత్యావసరాలైన బియ్యం, పప్పుదినుసులు, మంచి నూనె, ఉల్లి గడ్డలు, ఎల్లి గడ్డలు, పసుపు, కారం, ఆకు కూరలు, కూరగాయలు, మేక మాంసం, కోడి మాంసం ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. రెక్కాడితే గాని డొక్కనిండని దినసరి కూలీ పనులు చేసుకునేవారు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల కలిగే ఇబ్బందులు, నీటి కొరత, విద్యుత్ కోతల ప్రభావంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కలిగించడం లేదు. ఎల్ నినో ప్రభావం వల్ల బాసరలోని ట్రిపుల్ ఐ.టి కి దసరా సెలవులు పొడిగించడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్ నినో ప్రభావం డిసెంబర్‌లో ప్రారంభం అవుతుందనుకుంటే అక్టోబర్‌లోనే ట్రిపుల్ ఐ.టికి దసరా సెలవులు ఇవ్వడంతో వేసవిలో ఇంకా దాని ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదివే పిల్లలు, ఇంటర్మీడియట్, డిగ్రీ చేసే విద్యార్థులు, విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలలో 2026–27 విద్యా సంవత్సరంలో చదివే విద్యార్థుల చదువులపై ఎల్ నినో ప్రభావం ఏ విధంగా ఉంటుందోనని అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో ముఖ్యంగా మన తెలంగాణ రాష్ట్రంలోని సంబంధిత మంత్రులు, అధికారులు ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులకు ఎల్ నినో ప్రభావం తగ్గించేందుకు ముందు జాగ్రత్త చర్యలు గురించి అవగాహన కలిగించాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల ప్రజలను, దినసరి కూలీలను దృష్టిలో పెట్టుకొని నిత్యావసర ధరలు అందరికీ అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలి. కొన్ని ముఖ్యమైన బియ్యం, మంచి నూనె, ఉల్లి గడ్డలు, పప్పు దినుసులు ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా సరఫరా చేయాలి.

డాక్టర్.ఎస్. విజయ భాస్కర్, 9290826988


ఎఐటియుసి పుట్టుక... కార్మిక ఐక్యతకు పునాది



ఆళవందార్ వేణు మాధవ్
8686051752

భారత కార్మికోద్యమ చరిత్రలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి)కు ప్రత్యేక స్థానం ఉంది. కార్మికుల హక్కుల పరిరక్షణ, మెరుగైన వేతనాలు, పని గంటల నియంత్రణ, ఉద్యోగ భద్రత, సామాజిక న్యాయం వంటి లక్ష్యాలతో ఆవిర్భవించిన ఈ సంస్థ శతాబ్దానికి పైగా కార్మిక ఉద్యమాలకు వేదికగా నిలిచింది. దేశ పారిశ్రామిక అభివృద్ధిలో కార్మికుల శ్రమ కు గుర్తింపు లభించాలంటే వారి సమస్యలపై సంఘటిత పోరాటం అవసరమనే భావనకు ఎఐటియుసి చరిత్ర నిదర్శనం.1920 అక్టోబర్ 31న బొంబాయిలో ఎఐటియుసి ఏర్పడింది. బ్రిటిష్ పాలనలో పరిశ్రమలు విస్తరిస్తున్నప్పటికీ కార్మికులు తక్కువ వేతనాలు, సుదీర్ఘ పని గంటలు, ప్రమాదకరమైన పని పరిస్థితులు, కనీస సౌకర్యాల లేమితో సతమత మయ్యేవారు. వివిధ ప్రాంతాల్లో విడివిడిగా సాగుతున్న కార్మిక పోరాటాలను జాతీయ స్థాయిలో సమన్వయం చేయాలనే లక్ష్యంతో ఈ సంస్థ ఆవిర్భవించింది. స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపత్ రాయ్ ఎఐటియుసి తొలి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. జోసెఫ్ బాప్టిస్టా, ఎన్.ఎం.జోషి, దివాన్ చమన్‌లాల్ వంటి నాయకులు సంస్థ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు.

కార్మిక సమస్యలను జాతీయ రాజకీయ చర్చల్లోకి తీసుకురావడం, కార్మికులకు సంఘటిత శక్తి అవసరాన్ని చాటడం ఈ సంస్థ ప్రారంభ దశలో ప్రధాన లక్ష్యాలుగా నిలిచా యి. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో కార్మిక హక్కు లు, జాతీయ స్వాతంత్ర్యం, సామాజిక సమానత్వం వంటి అంశాలు పరస్పరం ముడిపడ్డాయి. అనంత రం వేతనాలు, పని పరిస్థితులు, కార్మిక చట్టా లు, సామాజిక భద్రత, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ వంటి అంశాలపై ఎఐటియుసి తన కార్యకలాపాలను కొనసాగించింది. కార్మిక సంఘాల మధ్య విధానపరమైన భేదాలు, చీలికలు ఉన్నప్పటికీ భారత కార్మికోద్యమ చరిత్రలో ఈ సంస్థ పాత్ర ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.



నేడు ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవం

తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో సింగరేణి బొగ్గు గనులకు విశిష్ట స్థానం ఉంది. విద్యుత్ ఉత్పత్తి, ఉక్కు పరిశ్రమ, ఇతర పారిశ్రామిక రంగాలకు అవసరమైన బొగ్గును వెలికితీసే కార్మికులు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. భూగర్భంలో ప్రాణాలను పణంగా పెట్టి దేశ ఆర్థిక వ్యవస్థకు ఇంధనాన్ని అందించే వారి శ్రమకు తగిన ప్రతిఫలం, భద్రత, గౌరవం లభించాలి. ఈ లక్ష్యాల సాధనలో కార్మిక సంఘాల పాత్ర కీలకం. సింగరేణిలో ఎఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కార్మికుల సమస్యలపై సంఘటితంగా పనిచేస్తోంది. హైదరాబాద్ స్టేట్ కాలంలో కార్మిక సంఘాల నిర్మాణం, ఉద్యమాల విస్తరణకు మఖ్దూం మొహియుద్దీన్, రాజ్ బహదూర్ గౌర్ వంటి నాయకులు కృషి చేశారు. ఆ కాలపు కార్మికోద్యమ వారసత్వం తెలంగాణ కార్మిక చరిత్రలో భాగమైంది. సింగరేణిలో దేవూరి శేషగిరి రావు, కె.ఎల్.మహేంద్ర, మనుబోతుల కొమురయ్య లాంటి నాయకులు 1942లో ఎఐటియుసి స్థాపనకు కృషి చేశారు.

సింగరేణిలో వేతన ఒప్పందాలు, బోనస్, అలవెన్సులు, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, వైద్య సదుపాయాలు, గని ప్రమాదాల నివారణ వంటి అంశాలు కార్మిక సంఘాల కార్యాచరణలో ముఖ్యమైనవి. యాజమాన్యంతో చర్చలు, కార్మికుల సమస్యలపై ప్రాతినిధ్యం, అవసరమైన సందర్భాల్లో నిరసనలు, సమ్మెల ద్వారా డిమాండ్లను సాధిస్తూ ఉంది.

1992లో నష్టాలు వస్తున్నాయని సింగరేణి సంస్థను సిక్ ఇండస్ట్రీగా ముద్ర పడకుండా కార్మికులను చైతన్య పరిచి అధిక ఉత్పత్తి సాధించి సంస్థను కాపాడుకోవటానికి ఎఐటియుసి గణనీయంగా కృషి చేసింది. కార్మికులకు దేశ చరిత్రలో లేని విధంగా సంస్థ లాభాలలో వాటా సాధించిన ఘనత ఎఐటియుసిదే. సింగరేణి పరిరక్షణ కోసం ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘం ఎన్నో సార్లు పోరాట యాత్ర నిర్వహించడం ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణపై ఆ సంఘం కొనసాగిస్తున్న కార్యాచరణకు ఒక ఉదాహరణ.1998 నుంచి ఇప్పటి వరకు ఏడు సార్లు జరిగిన గుర్తింపు ఎన్నికలలో నాలుగు సార్లు ఎఐటియుసికి కార్మికులు పట్టం కట్టారు. ఈనెల ఆర్టీసీ ఎన్నికల్లో కూడా ఎఐటియుసి కూటమి విజయం వెనుక కార్మికుల ఆదరణ ఉంది.

ప్రస్తుతం కార్మిక రంగం ప్రైవేటీకరణ, కాంట్రాక్టు విధానం విస్తరణ, సాంకేతిక మార్పు లు, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు వంటి సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో కార్మిక సంఘాలు మారుతున్న పరిస్థితులను అధ్యయనం చేసి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే కార్యాచరణను రూపొందించాలి.ఎఐటియుసి శతాబ్దపు ప్రస్థానం కార్మికుల ఐక్యత ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తోంది. సింగరేణిలో ఆ వారసత్వం మరింత అర్థవంతం కావాలంటే కార్మికుల హక్కుల పరిరక్షణతోపాటు వారి కుటుంబాల సంక్షేమం, పదవీ విరమణ అనంతర జీవన భద్రతకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలి.

సర్దార్ వల్లభాయ్ పటేల్ : జాతీయ సమైక్యత

భారతదేశ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, మొదటి హోమ్ మంత్రి, ఉప ప్రధాని, ప్రముఖ న్యాయవాది, స్వరాజ్య ఏకీకరణ కు కృషి చేసిన గొప్ప జాతీయవాది, భారతదేశ ఉక్కుమనిషిగా పేరొందిన ధైర్యశాలి, సర్దార్ వల్లభాయ్ పటేల్.గుజరాత్ రాష్ట్రంలోని నాడియార్‌లో జువేరీబాయ్, లాడ్ బాయ్ దంపతులకు 1875 అక్టోబర్ 31న జన్మించారు. స్వాతంత్ర్యానంతరం హైదరాబాద్, జునాగఢ్, కాశ్మీర్ వంటి 565 స్వదేశీ సంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి గట్టి కృషిచేసి దేశంలో ప్రముఖుడిగా పేరుగాంచాడు. రాచరిక రాష్ట్రాల ఏకీకరణ అనేది ప్రపంచ చరిత్రలో ఒక అద్భుతంగా చెప్పవచ్చు, ఎందుకంటే ఇది మన దేశం యొక్క రక్తరహిత విప్లవంగా చెప్పుకోవచ్చును. ఏకీకరణ కోసం అతనికి లోహపురుష్ , బిస్మార్క్ ఆఫ్ ఇండియాగా బిరుదు ఇవ్వబడింది. వివిధ మతాలు, భాషలు, ప్రాంతాలు, కులాలు, వర్గాలు ఉన్న మన దేశంలో మన సామరస్య జీవన విధానమే దేశ ఐక్యతను ప్రతిబింబిస్తుంది. ఇంగ్లాండ్‌లో బారిష్టరు పట్టా పుచ్చుకొని భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ మహాత్మాగాంధీ నేతృత్వం లో కొనసాగుతున్న జాతీయోద్యమంలో పాల్గొన్నాడు. బార్డోలీలో జరిగిన సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించి, విజయవంతం చేసి దేశ ప్రజల దృష్టిని ఆకర్షించాడు. 1931లో భారత జాతీయ కాంగ్రెస్ సభకు అధ్యక్షత వహించిన అతడు భారత రాజ్యాంగ రచనలో అతి ముఖ్యమైన ప్రాథమిక హక్కుల కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించాడు. బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో ప్రభుత్వం విధించిన పన్నులకు వ్యతిరేకంగా కిసాన్ ఉద్యమం చేపట్టి విజయవంతం చేసినందుకు 'సర్దార్'అనే పేరు వచ్చింది. గాంధీజీ చేపట్టిన సహాయ నిరాకరణోద్యమంలో దాదాపు 30 వేలమందితో పాల్గొని 15 లక్షల రూపాయ ల విరాళాలు సేకరించడం, గుజరాత్‌లో మద్యపాన నిషేధం, అస్పృశ్యత, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడినాడు. 1947 నుండి 1950 వరకు అనేక పదవులు నిర్వహించిన ఆయన కొన్ని సందర్భాల్లో నెహ్రూ ప్రవచించిన సోషలిజాన్ని సైతం వ్యతిరేకించాడు. రాష్ట్రపతి ఎన్నికలలో నెహ్రూ, రాజగోపాల్ చారి వైపు మొగ్గు చూపగా, వల్లభాయ్ పటేల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను ప్రతిపాదించి సఫలం కావడం జరిగింది. దేశ స్వాతంత్ర్యానంతరం 565 స్వదేశీ సంస్థానాలు భారతదేశంలో విలీనం చేస్తు న్న క్రమంలో జమ్మూ కాశ్మీర్, జునాగఢ్, హైదరాబాద్ ఈ మూడు రాచరిక సంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి నిరాకరించిన సందర్భంలో పటేల్ చాకచక్యంతో వ్యవహరించాడు. ఆ తర్వాత జునాగఢ్ రాజ్యంలో భారీ వ్యతిరేకత రావడంతో హిందుస్థాన్ నుండి నవాబు పారిపోవడం జరిగింది. కాశ్మీర్ రాజు హరి సింగ్ తన రాజ్యం బాధ్యతను సమీక్షించుకొని కాశ్మీర్‌ను భారతదేశంలో విలీనం చేశాడు. కానీ చివరగా హైదరాబాద్ నిజాం ప్రభువు భారత్‌లో కలపడానికి నిరాకరించినపుడు, అక్కడ జరుగుతున్న రైతాంగ సాయుధ పోరాట నేపథ్యంలో, వల్లభాయ్ పటేల్ వెంటనే సైన్యాన్ని పంపించి నిజాంను లొంగిపోవాలని హెచ్చరించాడు.. ఆ తర్వాత భారత్‌లో విలీనం జరిగింది.



(అక్టోబర్ 31సర్దార్ వల్లభాయ్ పటేల్ 151 జయంతి మరియు 'రాష్ట్రీయ ఏక్తా దివస్' సందర్భంగా)

కామిడి సతీష్ రెడ్డి, 9848445134.

సాహస మహిళ ఇందిరా గాంధీ!



బండి సుధాకర్ గౌడ్
టిపిసిసి అధికార ప్రతినిధి

ఒక దేశం గర్వించదగిన నాయకత్వం అంటే కేవలం పదవిని నిర్వహించ దం కాదు.. చరిత్రను తిరగరాయడం! ఆ కోవ కే చెందిన ఆధునిక భారతదేశ శిల్పి, ధైర్యసాహసాలకు మారుపేరు అయిన మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ వర్ధంతి అక్టోబర్ 31 సందర్భంగా దేశం ఆమెను స్మరించుకుంటోంది. భారత ఉక్కు మహిళగా ప్రపంచ వేదికపై భారత్ కీర్తి ప్రతిష్టలను సమున్నతంగా నిలబెట్టిన ఆమె ప్రస్థానం చిరస్మరణీయమైనది. దేశ సమైక్యత కోసం ఆమె తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు, ఎదుర్కొన్న సవాళ్లు ఆమె అచంచల దీక్ష.. స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. జాతి సేవలో ప్రాణాలర్పించిన ఆ మహానాయకురాలి చెరగని వారసత్వానికి నివాళులు! 1917 నవంబర్ 19న అలహాబాద్‌లో జన్మించిన ఇందిరా గాంధీ, భారత స్వాతంత్ర్య ఉద్యమ వాతావరణంలో పెరిగారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కుమార్తెగా, చిన్నతనం నుంచే జాతీయోద్యమ పోరాటాలను, త్యాగాలను ప్రత్యక్షంగా చూశారు. బాల్యం నుంచే ప్రజాజీవితంపై ఆసక్తి పెంచుకున్న ఆమె, క్రమంగా తనదైన రాజకీయ నాయకత్వాన్ని నిర్మించుకున్నారు. 1966 జనవరిలో భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆమె, 1977 మార్చి వరకు పదవిలో కొనసాగారు. అనంతరం 1980 జనవరిలో తిరిగి ప్రధానమంత్రి అయ్యారు. భారత రాజకీయాలు, పాలన, విదేశాంగ విధానంపై ఆమె నాయకత్వం చెరగని ముద్ర వేసింది.

1971 యుద్ధం – బంగ్లాదేశ్ ఆవిర్భావం : ఇందిరా గాంధీ నాయకత్వంలో అత్యంత కీలకమైన ఘట్టాల్లో 1971 భారత్–పాకిస్థాన్ యుద్ధం ఒకటి. ఈ యుద్ధం ఫలితంగా బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. 1971 డిసెంబర్‌లో యుద్ధం ప్రారంభమైన తరువాత, ఆమె ప్రభుత్వం దేశాన్ని కీలకమైన సైనిక పోరాటంలో ముందుండి నడిపించింది. 1971 డిసెంబర్ 16న ఢాకాలో పాకిస్థాన్ సైన్యం లొంగిపోవడంతో బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా అవతరించడానికి మార్గం సుగమమైంది. ఈ సంక్షోభాన్ని ఆమె ఎదుర్కొన్న తీరు భారత దౌత్య, సైనిక చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. యుద్ధ సమయంలో అంతర్జాతీయ ఒత్తిళ్లను ఎదుర్కొం టూ భారతదేశ వ్యూహాత్మక స్వతంత్రతను నిలబెట్టే ప్రయత్నం చేశారు. దేశ నాయకత్వానికి ఆమె అందించిన సేవలకు గుర్తింపుగా 1972లో భారత అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రదానం చేయబడింది.

బ్యాంకుల జాతీయీకరణ : 1969 జూలై 19న ఇందిరా గాంధీ ప్రభుత్వం 14 ప్రధాన వాణిజ్య బ్యాంకులను జాతీయీకరించింది. తదనంతరం బ్యాంకు శాఖల విస్తరణతో దేశంలోని విస్తృత ప్రజానీకానికి అధికారిక బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. బ్యాంకుల జాతీయీకరణ ఆమె పాలనలో అత్యంత ముఖ్యమైన ఆర్థి క నిర్ణయాల్లో ఒకటిగా నిలిచింది.

హరిత విప్లవం : 1960వ దశకంలో భారతదేశం తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంది. ఆహార ధాన్యాల కోసం విదేశాల నుంచి దిగుమతులపై గణనీయంగా ఆధారపడాల్సి వచ్చింది. ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలం లో అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, సాగునీటి సదుపాయాలు, ఎరువులు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల అభివృద్ధికి ప్రభుత్వం మద్దతు కొనసాగించింది. హరిత విప్లవం ముఖ్యంగా పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో గోధుమ ఉత్పత్తిని గణనీయంగా పెంచడంలో కీలక పాత్ర పోషించింది. ఈ మార్పులు దేశీయ ఆహార ధాన్యాల లభ్యతను పెంచడంతో పాటు దీర్ఘకాలిక ఆహార భద్రతకు బలమైన పునాదులు వేశాయి. ఈ విజయానికి శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ సంస్థలు, గత ప్రభుత్వాల విధానాలు కూడా దోహదపడ్డాయి. అయినప్పటికీ, భారతదేశం ఆహార ధాన్యాల విషయంలో స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగినదశగా ఈ కాలం గుర్తింపు పొందింది.

తొలి అణుపరీక్ష : ఇందిరా గాంధీ పాలనా కాలంలో భారతదేశ శాస్త్ర, సాంకేతిక, వ్యూహాత్మక కార్యక్రమాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 1974 మేలో రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో భారతదేశం తొలి అణు పరీక్షను నిర్వహించింది. దీనికి స్మైలింగ్ బుద్ధా అనే పేరు ప్రసిద్ధి చెందింది. ప్రభుత్వం దీనిని శాంతియుత అణు విస్ఫోటనంగా అభివర్ణించింది. ఈ పరీక్ష భారత అణు చరిత్రలో కీలక మలుపుగా నిలిచి అంతర్జాతీయంగా విస్తృత చర్చకు దారితీసింది. అలాగే, అంతరిక్ష పరిశోధనలు, శాస్త్రీయ సంస్థల అభివృద్ధికి ఆమె ప్రభుత్వం మద్దతు ఇచ్చింది. సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించ డం, విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడం వంటి విస్తృత జాతీయ లక్ష్యాల్లో ఈ ప్రయత్నాలు భాగమయ్యాయి.

ఎమర్జెన్సీ – కఠిన అధ్యాయం :

ఇందిరా గాంధీ రాజకీయ వారసత్వాన్ని సమగ్రం గా అర్థం చేసుకోవాలంటే 1975 జూన్ 25న విధించిన అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)ని విస్మరించలేం. ఇది 1977 మార్చి 21 వరకు కొనసాగింది. ఈ కాలంలో పౌర హక్కులపై ఆంక్షలు విధించబడ్డాయి. పత్రికలపై సెన్సార్ అమలైంది. ప్రతిపక్ష నాయకులను నిర్బంధించారు. బలవంతపు కుటుంబ నియంత్ర ణ కార్యక్రమాలతో సహా అధికార దుర్వినియోగానికి సంబంధించిన తీవ్రమైన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ చర్యలు ప్రజలకు విస్తృతమైన బాధను కలిగించాయి. స్వతంత్ర భారత చరిత్రలో అత్యంత వివాదాస్పద అధ్యాయాల్లో ఎమర్జెన్సీ ఒకటిగా మిగిలింది.రాజకీయ అధికారాన్ని కేంద్రీకరించడం, ప్రజాస్వామ్య రక్షణ వ్యవస్థలను బలహీనపరచడం వల్ల కలిగే ప్రమాదాలను ఎమర్జెన్సీ స్పష్టంగా తెలియజేసింది. 1977 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇందిరా గాంధీ ప్రభుత్వాన్ని తిరస్కరించారు. ఆమె రాయ్‌బరేలీ లోక్ సభ స్థానంలో కూడా ఓటమి పాలయ్యారు. అయితే, ఆమె రాజకీయ ప్రస్థానం అక్కడితో ముగియలేదు. 1980 సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వాలను మార్చే, తదనంతరం నాయకులను తిరిగి ఎన్నుకునే అధికారం భారత ఓటర్లదేనని ఈ పరిణామాలు చాటిచెప్పాయి. ప్రజల విశ్వాసం, ప్రజాస్వామ్య జవాబుదారీతనం భారత రాజకీయ వ్యవస్థలో ఎంత కీలకమో ఈ ఘట్టం తెలియజేసింది.



నేడు ఇందిరాగాంధీ 42వ వర్ధంతి

ఆపరేషన్ బ్లూ స్టార్ – చివరి రోజులు : రెండోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఇందిరా గాంధీ పంజాబ్‌లో పెరుగుతున్న ఉద్రిక్తతలను ఎదుర్కొన్నా రు. 1984 జూన్‌లో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయ సముదాయంలో ఉన్న సాయుధ మిలిటెంట్లను తొలగించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆపరేషన్ బ్లూ స్టార్ పేరుతో సైనిక చర్యకు ఆదేశించింది. ఈ చర్యలో గణనీయమైన ప్రాణనష్టం సంభవించింది. పవిత్రమైన స్వర్ణ దేవాలయ సముదాయానికి నష్టం వాటిల్లింది. ఈ పరిణామాలు సిక్కు సమాజంలోని అనేక మందిని తీవ్రంగా కలచివేశాయి. దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. 1984 అక్టోబర్ 31న న్యూఢిల్లీలో తన ఇద్దరు భద్రతా సిబ్బంది చేతిలో ఇందిరా గాంధీ హత్యకు గురయ్యారు. ఆమె మరణం దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆమె హత్య అనంతరం జరిగిన భయానక సిక్కు వ్యతిరేక హింసలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ హింస భారత దేశ చరిత్రలో ఒక విషాదకరమైన అధ్యాయంగా మిగిలింది. మతం, కులం, సమాజంతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడి ప్రాణాలకు, హక్కులకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని ఈ ఘటనలు గుర్తు చేస్తున్నాయి.

నేటికీ భారతదేశాన్ని ప్రభావితం చేస్తున్న వారసత్వం

ఇందిరా గాంధీ వారసత్వం సంక్లిష్టమైనదే అయినప్పటికీ, భారత చరిత్రలో అత్యంత ప్రాధాన్యత కలిగినది. 1971 యుద్ధంలో ఆమె నాయకత్వం, బ్యాంకుల జాతీయీకరణ, వ్యవసాయ ఆధునికీకరణకు మద్దతు, రాజభరణాల రద్దు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత సామర్థ్యాలను పెంపొందించే ప్రయత్నాలు ఆమె పాలనలోని ముఖ్యమైన అంశాలుగా నిలిచాయి.అదే సమయంలో ఎమర్జెన్సీ, పౌర స్వేచ్ఛలపై ఆంక్ష లు, ఆపరేషన్ బ్లూ స్టార్ పరిణామాలు కూడా ఆమె పాలనను సమగ్రంగా విశ్లేషించేటప్పుడు తప్పనిసరిగా ప్రస్తావించాల్సిన అంశాలు. ఆమె జీవితం కార్యనిర్వాహక అధికారానికి ఉన్న ప్రభావాన్ని మాత్రమే కాకుండా, రాజ్యాంగ సంస్థలు, ప్రజాస్వామ్య స్వేచ్ఛలు, ప్రభుత్వ జవాబుదారీతనం ఎంత ముఖ్యమైనవో కూడా తెలియజేస్తుంది. దృఢ సంకల్పం, కీలక నిర్ణయాలు తీసుకునే ధైర్యం, దేశ రాజకీయాలు, భవిష్యత్తుపై గణనీయమైన ప్రభావం చూపిన నాయకురాలిగా ఇందిర దేశ రాజకీయ చరిత్రలో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉన్నారు.

(ఇందిరాగాంధీ హత్యకు గురైన అక్టోబర్ 31ని 'రాష్ట్రీయ సంకల్పదివస్'గా పాటించబడుతున్నది)

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/భూపాలపల్లి/చిట్యాల : రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం ఎన్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వడితల గ్రామంలో 2.2.కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా, సాగునీటి సదుపాయాల కల్పనతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత రెండున్నరేళ్లలో ఉప ముఖ్యమంత్రి చొరవతో జిల్లాలో 12 కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయానికి విద్యుత్ పరంగా రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. భూగర్భ జలాల ఆధారంగా వ్యవసాయం చేసే రైతులకు బోర్లు, మోటార్ల ద్వారా సాగు చేసుకునేందుకు విద్యుత్ సదుపాయాలను మెరుగుపరుస్తూ అండగా నిలుస్తున్నామని వివరించారు. గోదావరి నది జలాలను, అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను రైతులకు చేరువ చేసేందుకు డిబిఎం 38 ద్వారా నీటిని అందించే కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడుతున్న వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలను దృష్టిలో ఉంచుకొని రైతులకు నీటి వసతి కల్పించడంతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగానికి ప్రాధాన్యతనిస్తూ ఉత్పత్తి సామర్థ్యాన్ని సుమారు 14 వేల మెగావాట్ల నుంచి 21 వేల మెగావాట్లకు పెంచిందని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గాంధీనగర్ గుట్ట ప్రాంతంలో కూడా 33/11 కెవి సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. గోదావరి జలాలను వినియోగించుకుంటూ డీబీఎం 38 ద్వారా 44,770 ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు, ఎస్సారెస్పీ పరిధిలోని మరో 70 వేల ఎకరాలను అనుసంధానం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ నూతన విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభంతో ఐదు గ్రామాల ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు విద్యుత్ వృథాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, ఎంపిడిసిఎల్ డైరెక్టర్ మోహన్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సదానందం, సర్పంచ్ భగవాన్, ఏఎంసి చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దబ్బెట అనిల్, మాజీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, బుర్ర లక్ష్మణ్, గంగాధర్ రవి, రాయ కొమురు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



సేవాభావమే అసలైన నాయకత్వ లక్షణం

● పాఠశాల అభివృద్ధికి సింగరేణి రూ.2.5 కోట్ల సాయం : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్ : నాయకత్వమంటే పదవులు, అధికారాలు కాదని, ఎంతమందికి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నదే అసలైన నాయకత్వ లక్షణమని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులు వ్యక్తిగత విజయాలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, సేవాభావం, నైతిక విలువలను పెంపొందించడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. దోమలగూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మోడల్ హైస్కూల్ నవీకరణ పనులకు శుక్రవారం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లతో కలిసి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండండి' అనే స్కౌట్స్ నినాదం వెనుక గొప్ప జీవిత తత్వం ఉందన్నారు. కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. తెలంగాణలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యుల సంఖ్య ఏడాది కాలంలో దాదాపు 70 వేలకు చేరిందని, 1.3 లక్షల మంది విద్యార్థులకు చేరువ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధి, ఆధునికీకరణ పనుల కోసం సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.2.5 కోట్లు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గవర్నర్ కార్యదర్శి దాన కిశోర్, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డిఎ, డిఆర్ పెంపు

● ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యుత్తు సంస్థల సిఎండిలకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త అందించింది. వారికి చెల్లించే కరువు భత్యం (డిఎ), కరువు ఉపశమనం (డిఆర్) పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల సిఎండిలను ఆదేశించారు. ప్రస్తుతం 19.272 శాతంగా ఉన్న డిఎ, డిఆర్‌ను 2.543 శాతం పాయింట్లు పెంచి 21.815 శాతానికి సవరించనున్నారు. ఈ పెంపు 2026 జూలై 1వ తేదీ నుంచి వర్తించనుంది. కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో ప్రకటించే అఖిల భారత ధరల సూచీ ఆధారంగా డిఎ, డిఆర్‌ను సవరిస్తారు. ధరల సూచీలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి జనవరి, జూలై నెలల్లో ఈ సవరణ చేపడుతున్నారు. తాజాగా చేపట్టిన ప్రతిపాదిత పెంపునకు ఆమోదం లభించి అమల్లోకి వస్తే రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల పరిధిలో 71,360 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం విద్యుత్ సంస్థలపై నెలకు సుమారు రూ.14.63 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది.

సంస్థల వారీగా లబ్ధిదారులు ఇలా

టీజీ ట్రాన్స్‌కో పరిధిలో 3,081 మంది ఉద్యోగులు, 3,644 మంది ఆర్టిజన్లు, 2,469 మంది పెన్షనర్లు కలిపి మొత్తం 9,194 మందికి ప్రయోజనం కలగనుంది. టిజి జెన్‌కోలో 7,197 మంది ఉద్యోగులు, 3,544 మంది ఆర్టిజన్లు, 3,426 మంది పెన్షనర్లు కలిపి 14,167 మంది లబ్ధి పొందనున్నారు. టీజీ ఎస్‌పిడిసిఎల్‌లో 11,719 మంది ఉద్యోగులు, 8,493 మంది ఆర్టిజన్లు, 8,269 మంది పెన్షనర్లు కలిపి 28,481 మందికి, టిజి ఎన్‌పిడిసిఎల్‌లో 9,936 మంది ఉద్యోగులు, 3,435 మంది ఆర్టిజన్లు, 6,147 మంది పెన్షనర్లు కలిపి 19,518 మందికి ప్రయోజనం చేకూరనుంది. ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, విద్యుత్ సంస్థల సిబ్బంది ప్రయోజనాలను పరిరక్షించడంలో భాగంగానే డిఎ, డిఆర్ పెంచాలని ఆదేశాలు ఇచ్చినట్టు డిప్యూటీ సిఎం తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీలేని పోరాటం :మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రభుత్వ భూముల పరిరక్షణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాజీలేని వైఖరితో ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఒకవైపు కఠిన చర్యలు తీసుకుంటూనే, మరోవైపు దశాబ్దాలుగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను పరిష్కరించేందుకు సమర్థవంతమైన న్యాయపోరాటం చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విలువైన ప్రభుత్వ భూముల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. భూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, రెవెన్యూ అధికారులు, న్యాయశాఖ, ప్రభుత్వ న్యాయవాదుల మధ్య సమన్వయాన్ని పెంచి సుప్రీంకోర్టు సహా వివిధ న్యాయస్థానాల్లో ప్రభుత్వ వాదనలను బలంగా వినిపించేలా చర్యలు చేపట్టారన్నారు. గతంలో సరైన పర్యవేక్షణ, సమన్వయం కొరవడటంతో అనేక విలువైన భూములకు సంబంధించి దశాబ్దాల తరబడి వివాదాలు కొనసాగాయని, ఆ పరిస్థితిని మారుస్తూ పాత రికార్డులు, రెవెన్యూ ఆధారాలను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వ హక్కులను కాపాడుతున్నామని తెలిపారు. ఈ క్రమంలో కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల విలువైన భూమితో పాటు, తాజాగా మియాపూర్ భూములకు సంబంధించి కూడా సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడం ప్రజా ప్రభుత్వం చేపట్టిన న్యాయపోరాటానికి బలమైన నిదర్శనమన్నారు. నేటితరంతో పాటు భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ భూములను కాపాడటంలో కీలకపాత్ర పోషించిన రెవెన్యూ అధికారులు, న్యాయ నిపుణులు, ప్రభుత్వ న్యాయవాదులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఆక్రమణలకు పాల్పడినా, అక్రమంగా హక్కులు పొందేందుకు ప్రయత్నించినా ఉపేక్షించేది లేదని, సంపదను కాపాడే విషయంలో రాజీ పడబోమని మంత్రి తేల్చి చెప్పారు.

మియాపూర్ భూములు ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలి

● సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుపై ప్రత్యేక చొరవ చూపించి, విజయం సాధించిన సిఎంకు అభినందనలు

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పుతో కబ్జాదారుల నుండి విముక్తి పొందిన మియాపూర్ భూములను అమ్మకుండా భవిష్యత్ తరాల అవరాల కోసం, ప్రజా ప్రయోజనార్థం ఉపయోగించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సుప్రీంకోర్టులో ఉన్న మియాపూర్ భూముల కేసుపై ప్రత్యేక చొరవ చూపించి వాదనలు వినిపించి విజయం సాధించడం, కోర్టు తీర్పుతో కబ్జాదారుల నుండి భూమి విముక్తి పొందడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఆయన అభినందనలు తెలిపారు. కొంతమంది కబ్జాదారులు అత్యంత విలువ చేసే మియాపూర్‌లో గల 550 ఎకరాలను అక్రమంగా కాజేయడానికి కొంతమంది వ్యక్తులు, సంస్థలు అనేక పద్ధతిలో ప్రయత్నాలు చేశాయని, హైకోర్టును తప్పుదోవ పట్టించాయని చాడ వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆనాటి ప్రభుత్వం వ్యవహారం నాన్చుడు ధోరణితో వ్యవహరించిందని ఆయన అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా తాను ఉన్నప్పుడు మియాపూర్ భూములను స్వయంగా పరిశీలించి, అన్యాక్రాంతం కావడానికి వీల్లేదని ముఖ్యమంత్రికి లేఖ రాశామని తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని భూములను ప్రజలకు ఉపయోగించాలని కోరామని, ఆ భూములపై పెద్ద ఉద్యమం చేపట్టామని ఆయన గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఉన్న కేసు గురించి ప్రత్యేక చొరవ చూపి వాదన వినిపించి దాదాపు 60 వేల కోట్లు విలువచేసే భూములను కాపాడారన్నారు.

సిపిఐ నేత మేకల రవి మృతి


మేకల రవి (ఫైల్‌ఫొటో)


రవి మృతదేహంపై ఎర్రజెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు

ప్రజాపక్షం/వరంగల్/హైదరాబాద్: సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, మాజీ వరంగల్ అర్బన్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మేకల రవి(57) శుక్రవారం అనారోగ్యంతో మరణించారు. రవి అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్)లో వరంగల్ నగర కార్యదర్శిగా పని చేశారు. అనంతరం, సిపిఐ వరంగల్ నగర కార్యదర్శిగా మూడు పర్యాయాలు, మాజీ వరంగల్ అర్బన్ జిల్లా కార్యదర్శిగా పని చేసి పార్టీ రాష్ట్ర సమితి సభ్యులుగా కొనసాగుతూ కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి కోసం అవిశ్రాంత కృషి సాగిస్తున్నారు. వరంగల్ నగరానికి చెందిన రవి మరణ వార్త తెలిసిన వెంటనే సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హుటాహుటిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సిపిఐ తరపున సంతాపం తెలియజేసి, వారికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం, తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కామ్రేడ్ రవి భౌతికకాయంపై సిపిఐ జెండా కప్పి, పూలమాల వేసి నివాళులర్పించారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకూ నిలబడ్డ గొప్ప కమ్యూనిస్టు నాయకుడు, అజరామరుడు మేకల రవి అని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని శ్రీనివాసరావు శ్లాఘించారు. అనారోగ్యం బారినపడ్డ రవి అమరత్వం పొందాడని, కష్టనష్టాల్ని ఎదుర్కొని మంచితనంతో, కలుపుగోలుతనంతో ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. రవి మరణం కుటుంబానికే కాకుండా, సమాజానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అన్నారు. సమసమాజ నిర్మాణం కోసం అహరహం తపించిన రవి ఆశయబాటలో ప్రతీ కమ్యూనిస్టు పయనించాలని తక్కళ్లపల్లి పిలుపునిచ్చారు. కాగా వరంగల్ శివనగర్‌లో శనివారం రవి అంత్యక్రియలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, హనుమకొండ జిల్లా కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు తోట భిక్షపతి, వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, నాయకులు మద్దెల ఎల్లేష్, గన్నారపు రమేష్, ఎన్.ఏ. స్టాలిన్, గుండె బద్రి, సంగీ ఎలెందర్, శంకరయ్య, అక్కెపల్లి రమేష్, జన్ను రవి, సంద్ర కుమార్, మునిగాల భిక్షపతి, సాంబమూర్తి, పరికరాల రమేష్, యాకంబ్రచారి, మాలోత్ శంకర్ నాయక్, ల్యాదల్ల శరత్, మస్కా సుధీర్ తదితరులు పాల్గొని రవి మృతికి నివాళులు అర్పించారు.

పలువురు సిపిఐ నాయకుల సంతాపం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మేకల రవి మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని వారు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు వేర్వేరు సంతాప సందేశాలను విడుదల చేశారు. మేకల రవి మృతి బాధాకరమని, పార్టీ ఒక మంచి కమ్యూనిస్టు నాయకుడిని కోల్పోయిందని కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజా ఉద్యమాలలో రవి ముందుండేవారని ఆయన కొనియాడారు. మేకల రవి నిబద్ధత గల కమ్యూనిస్టు నాయకులని పల్లా వెంకట రెడ్డి కొనియాడారు. మేకల రవి సిపిఐలో అంకితభావంతో పనిచేశారని, పేదల ఇండ్ల సమస్యలపై సిపిఐ చేస్తున్న పోరాటంలో, ఇతర పోరాటాలలో చురుకైన పాత్ర పోషించారని, ఆదర్శవంతంగా పనిచేశారని డాక్టర్ నారాయణ కొనియాడారు. మేకల రవి ఇళ్ల స్థలాల పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారని, ప్రజల పక్షాన నిలబడిన వ్యక్తి అని చాడ వెంకటరెడ్డి కొనియాడారు.

ఆర్‌టిసి కండక్టర్ ప్రవళికకు కూనంనేని పరామర్శ

● మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన.. అండగా ఉంటామని భరోసా



ప్రజాపక్షం/హైదరాబాద్: ఇటీవల ప్రయాణికుడి దాడిలో గాయపడిన టిజిఎస్ఆర్‌టిసి మణుగూరు డిపో కండక్టర్ గుడిమెట్ల ప్రవళికను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హైదరాబాద్‌లోని సాయిసంజీవని ఆసుపత్రిలో పరామర్శించారు. ప్రవళిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, సంబంధిత వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. అనంతరం ప్రవళిక తల్లిని కలిసి ధైర్యం చెప్పారు. ప్రవళికకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ, ఎఐటియుసి, ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రవళిక కుటుంబానికి పూర్తి సహకారం అందిస్తాయని తెలిపారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు, యూనియన్ ప్రతినిధులు ఉన్నారు.

రాగల ఏడు రోజులు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో వచ్చే ఏడు రోజుల పాటు విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. శుక్రవారం, శనివారం నుంచి వచ్చే శుక్రవారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందన్నారు. శుక్ర, శనివారాల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా చాలా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండగా, మంగళ, బుధవారాల్లో వర్షాల తీవ్రత మరింత పెరిగే సూచనలు ఉన్నాయని చెప్పారు. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. గురు, శుక్రవారాల్లో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కొనసాగుతాయన్నారు.

సిఎంకు అధికారంలో ఉండే అర్హత లేదు

● టిఆర్‌పి చీఫ్ కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం/ఆదిలాబాద్ : పంటలు వేయవద్దని రైతులకు చెప్పిన చరిత్రలో మొదటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, వ్యవసాయం తప్ప వేరే పని తెలియని రైతులను పంటలు వేయవద్దని చెప్పే ముఖ్యమంత్రి అధికారంలో ఉండే అర్హత లేదని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఆదిలాబాద్ జిల్లా పాంచజన్య సంకల్ప సభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సభకు ముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం కవిత మాట్లాడుతూ ఆదివాసీ యోధులు రామ్‌జీ గోండ్, కొమురం భీమ్, వన్నెల ఎల్లన్న, వెద్మ రాములను స్మరించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఆదివాసీలను పిట్టలను కాల్చినట్లు కాల్చారని, నాడు ఆ బాధకు గుర్తుగానే ఈ స్థూపం ఏర్పడిందన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి కేవలం రూ.5లక్షలతో చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రెండేళ్లకు ఒకసారి వస్తానని చెప్పి ఈ మూడేళ్లలో రెండే సార్లు వచ్చి హామీలను మరిచారని విమర్శించారు. అలాగే బిఆర్‌ఎస్ నాయకులపై విరుచుకుపడుతూ, చనాఖా కొరటా ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.368 కోట్ల నుంచి రూ.2100 కోట్లకు పెంచి భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ అవినీతి సొమ్ములు మాజీ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న ఇళ్లకు పోయాయా లేక బిఆర్‌ఎస్ ఖాతాలోకి వెళ్లాయా చెప్పాలని ప్రశ్నించారు. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవన్నారు. సామాజిక న్యాయంలో భాగంగా ఎలాంటి పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ లేని బిసి యువకులు శ్రీకాంత్‌గౌడ్, ఆకాష్‌లకు ఎమ్మెల్సీ అభ్యర్థులుగ అవకాశం కల్పించామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌పి నాయకురాలు పడిగల శ్రావణి ముదిరాజ్, జిల్లా నాయకులు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి నర్సింగ్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

● బిఎస్‌సి నర్సింగ్‌లో మేనేజ్‌మెంట్ కోటాలో 40 సీట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తార్నాకలోని టిజిఎస్‌ఆర్‌టిసి నర్సింగ్ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి బిఎస్సి నర్సింగ్ కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. మేనేజ్‌మెంట్ కోటా కింద 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. కళాశాల కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం అనుబంధంతో నిర్వహించబడుతోంది. మొత్తం 100 సీట్లలో 60 కన్వీనర్ కోటాకు, 40 మేనేజ్‌మెంట్ కోటాకు కేటాయించారు. ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులతో కనీసం 45 శాతం మార్కులు సాధించి, ఇంగ్లీష్‌ను తప్పనిసరి సబ్జెక్టుగా చదివిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ప్రవేశ నిబంధనల ప్రకారం నీట్, టిజి ఇసెట్‌కు హాజరై ఉండాలి. కళాశాలకు అనుబంధంగా ఉన్న 200 పడకల టిజిఎస్‌ఆర్‌టిసి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో విద్యార్థులకు ప్రాక్టికల్, క్లినికల్ శిక్షణ అందించనున్నట్లు తెలిపింది. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక ల్యాబొరేటరీలు, వైద్య సదుపాయాలతో నాణ్యమైన శిక్షణ కల్పించనున్నట్లు పేర్కొంది. ప్రవేశాలు, ఇతర వివరాల కోసం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను 7075009463 నంబర్‌లో లేదా tsrtc.con@ gmail.com ద్వారా సంప్రదించాలని సూచించింది. కళాశాల చిరునామా: టిజిఎస్‌ఆర్‌టిసి హాస్పిటల్ క్యాంపస్, తార్నాక, హైదరాబాద్500007.



ప్రజాస్వామ్య పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం

● మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని, దాని వైఖరికి వ్యతిరేకంగా పోరాటం తప్పదని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నినాదంతో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ దేశవ్యాప్త ఉద్యమం చేపడుతోందన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనకు ముందు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు, అమరవీరుల త్యాగాలపై గతంలో పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలకు ప్రధాని మోదీ, అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. మణిపూర్ అల్లర్లు, చైనా సరిహద్దు సమస్యలను పట్టించుకోకుండా తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసం పర్యటిస్తున్నారని విమర్శించారు. జాతీయ జనగణనలో వెంటనే బిసి కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు. బిసిలకు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు అవసరమన్నారు. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని పేర్కొన్నారు. మరోవైపు, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన న్యాయపోరాటంతో వేలాది కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడటం చారిత్రాత్మక విజయమని, ఇందుకు ముఖ్యమంత్రి, న్యాయవ్యవస్థకు రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II కార్యాలయం
ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్.

No.11/EE-II/Circle-38/Khairatabad Zone/GHMC/2026-27 తేది: 29.10.2026

NIT No.	పని పేరు	అంచనా విలువ / ఇసివి	ప్రారంభ తేది / డౌన్‌లోడ్ ఆఖరి తేది & సమయం	అధికారి పేరు & చిరునామా
11/EE-II/ CIRCLE-38/ KZ/GHMC/ 2026-27	సివిల్ పనులు (04 నెం.లు)	రూ. 4.50 లక్షలు	క్ర.నం.01 నుండి 04 వరకు పనుల కొరకు 31.10.2026 మ.12.00గం.ల నుండి 02.11.2026 మ.2.00గం.ల వరకు	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, కెజెడ్, జిహెచ్‌ఎంసి.

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
ఇ-మెయిల్ అడ్రస్: eec38.yousufguda@gmail.com, మొబైల్ నెం. 7331189501.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 12792-PP/CL/ADVT/2026-27, Date: 30-10-2026

శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానము
గ్రా|| చెరువుగట్టు, మం|| నార్కట్‌పల్లి, జి|| నల్లగొండ - 508 254, తెలంగాణ.
e-mail: aceochervugattu@yahoo.in, Phone: 9100023701, 702
ఇ-టెండరు కమ్ సీల్డు టెండరు కమ్ బహిరంగ వేలము ప్రకటన

లేఖ నెం: 87/ఎస్.పి. జె.ఆర్.ఎస్.డి./2026 తేది: 29-10-2026

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియపరుచునది ఏమనగా! శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానము, చెరువుగట్టు నందు 2027-2028 వరకు ఒక సంవత్సర కాలపరిమితికి వివిధ హెచ్-1 మరియు ఎల్-1 వేలము హక్కులను తేది. 14-11-2026, శనివారము రోజున ఉ.11.00 గంటల నుండి శ్రీయుత కార్యనిర్వహణాధికారి గారి కార్యాలయము ముందు, వేలముల పర్యవేక్షణాధికారి పర్యవేక్షణలో నిర్వహించుటకు నిర్ణయించడమైనది. ఇట్టి వేలము హక్కును మొదటగా బహిరంగ వేలము తదుపరి సీల్డు టెండర్లు నిర్వహించుట, తదుపరి ఇ-టెండరు (తలనీలాలకు మాత్రమే) తెరువబడును. ఇట్టి టెండరు హక్కునకు టెండరు షెడ్యూలు పొందిన వారు తేది. 14-11-2026 రోజున ఉ.11.00 గంటలకుపైన తెలిపిన ప్రదేశములో ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అట్టి సీల్డు టెండర్లు మరియు ఇ-టెండర్లు అదే రోజు మ.12.00 గంటలకు తెరువబడును.

క్ర.నం.	వేలము వివరములు	డిపాజిటు (రూ)
	హెచ్-1 వేలములు	
1.	తలనీలాలు సేకరించుకొను హక్కు	20,00,000.00
2.	పూలు అమ్ముకొనే హక్కు	1,00,000.00
3.	అమ్మవారి ఆలయము వద్ద వాహనములకు బొట్టుపెట్టుకొను హక్కు	1,00,000.00
4.	చెప్పుల స్టాండు నిర్వహించుకొను హక్కు	20,000.00
	ఎల్ - 1 వేలములు	
5.	ప్రచార రథములు ఏర్పాటు చేయు హక్కు	20,000.00
6.	మహా మండపము యొక్క పూల అలంకరణ	20,000.00
7.	ప్రింటింగ్ చేయు హక్కు	20,000.00

ఇట్టి సీల్డు టెండరులలో పాల్గొనుటకు ఆసక్తి కలవారు తేది: 12-11-2026 మరియు 13-11-2026 రోజులలో కార్యాలయ పనివేళలు ఉ.10.00 గంటల నుండి సా.5.00 గంటల వరకు రూ.3000/- తలనీలాల టెండర్ షెడ్యూల్‌కు మరియు మిగతా వాటికి రూ.500/- చెల్లించి రశీదు పొందగలరు. ఇట్టి టెండర్లకు సంబంధించిన పూర్తి వివరములు దేవస్థాన కార్యాలయ పని వేళలలో అడిగి తెలుసుకొనగలరు. ఇ-టెండరు కొరకు https://tender.telangana.gov.in లేదా దేవస్థాన ఫోన్ నెం. 9491000701 లను సంప్రదించగలరు.
సం/- ఎస్. మోహన్‌బాబు
కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 12781-PP/CL/ADVT/2026-27, Date: 30-10-2026



ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఎంతో విలువైంది : ఎమ్మెల్యే శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఎంతో విలువైందని, అలాంటి ఓటుకు తీసివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. శుక్రవారం ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు, ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ నిరసన సభకు 40మంది కాంగ్రెస్ కార్యకర్తలు తరలివెళ్ళారు. ఢిల్లీకి వెళ్తున్న బస్సును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణా రెడ్డి, వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, కేశంపేట మండల అధ్యక్షుడు రమేష్, సర్పంచ్‌లు భాస్కర్‌గౌడ్, నాగేశ్వర్, పురుషోత్తం రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నేతలు కత్తి చంద్రశేఖర్ అప్ప, షర్పోద్దీన్, ముబారక్, సత్తయ్య, బీరప్ప, మట్ట వెంకటేష్, మంగ మధు, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలలహక్కుల రక్షణకు సమష్టి కృషి



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: బాలల హక్కుల రక్షణ కోసం సమష్టిగా కృషి చేయాలని స్థానిక కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అనిత మాట్లాడుతూ బాలల హక్కులకు భంగం కలగకుండా కాపాడటం, వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి సకాలంలో స్పందించడంతోపాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ రేవతి, ఐసిడిఎస్ సిబ్బంది శ్రీలత, అశ్విత, స్వచ్ఛంద సంస్థ సిబ్బంది గీత, పెంజర్ల సర్పంచ్ ఎర్రోళ్ల జగన్, ఉప సర్పంచ్ చంతన్‌రెడ్డి, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు రఘుపతిరెడ్డి, శ్రీదేవి, అంగన్‌వాడి టీచర్ బుజమ్మ, జ్యోతి, ఆశా వర్కర్ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతా



ప్రజాపక్షం/కేశంపేట: అధికారం ఉన్నా..లేకున్నా..ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతానని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కె.అనుషకు(60)వేలు, వినయ్‌కు(60వేలు) చెక్కులను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చొరవతో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వచ్చిన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్, ఉపసర్పంచ్ కార్నెకోట నరేష్, నాయకులు కంది రాఘవేందర్ గౌడ్, దశరథ్, తేజ యాదవ్, హరిష్ యాదవ్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి




ప్రజాపక్షం/షాబాద్: గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని నాగర్‌కుంట గ్రామ సర్పంచ్ పాలమాకుల మల్లయ్య అన్నారు. శుక్రవారం నాగర్‌కుంట గ్రామంలో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుగ్గరాములు, కార్యదర్శి రభీయాసుల్తానా, మాజీసర్పంచ్ పాలమాకుల మాసయ్య, నర్సింలు గౌడ్, వెంకటయ్య, అశోక్, లక్ష్మయ్య, మహేష్, రాజు, శ్రీకాంత్, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్లు నిర్మించండి

ప్రజాపక్షం/యాచారం : యాచారం మండల పరిధిలోని ధర్మన్‌నగూడ గ్రామంలో పశువుల దాహర్తి తీర్చడానికి నీటి తొట్లు నిర్మించాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు ఎంపిడిఒ రాధారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా బిజెపి రాష్ట్ర యువమోర్చ కార్యవర్గ సభ్యులు శాంతి కుమార్ మాట్లాడుతూ ధర్మన్నగూడ గ్రామంలో దాదాపు 500 నుండి 800 వరకు పశువులు ఉన్నాయన్నాయన్నారు. తాటినీటి సౌకర్యం లేక మూగ జీవాలు నానా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కరువు వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయి చెరువు కుంటల్లో నీరు లేని పరిస్థితి ఉందని, మూగ జీవాలను బాధను అర్థం చేసుకోని నీటి తొట్లు నిర్మించాలని కోరారు కార్యక్రమంలో నాయకులు నర్సింహ్మా, యాదయ్య పాల్గొన్నారు.

తక్కువ నీటితో..ఎక్కువ దిగుబడులు



ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో శుక్రవారం తెలంగాణ ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంపై అవగాహణ సదస్సు జరిగింది. పిఎం కిసాన్ 24వ విడుత కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌లో ఐసిఎఆర్ సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టి ట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైటింస్ట్ డాక్టర్ రమణ మాట్లాడుతూ సుస్థిర వ్యసాయం నేల ఆరోగ్య నిర్వహణ సమతల్య ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించారు. కరువు నేపధ్యంలో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు ఇచ్చే పంటలను రైతులు సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్తవేత్త డాక్టర్ ప్రియా, మండల వ్యవసాయ అధికారి అర్.రవినాథ్, విస్తరణ అధికారి గురుప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మియాపూర్ భూమి ప్రజలదే..

రూ.50 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల విలువ
రికార్డుల తారుమారులో పాత్ర ఉన్న అధికారులపైనా చర్యలు తీసుకుంటాం
రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి/మియాపూర్: దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరిగిన మియాపూర్ భూ వివాదంలో ప్రభుత్వ యాజమాన్యానికి సుప్రీంకోర్టు తీర్పుతో బలం చేకూరింది. సర్వే నంబర్లు 100,101 పరిధిలోని 550 ఎకరాల 39 గుంటల భూమి ప్రభుత్వానిదేనని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. దాదాపు రూ.50వేల కోట్ల నుంచి రూ.60వేల కోట్ల విలువ ఉంటుందని అంచనా వేస్తున్న ఈ భూమి ప్రజా సంపద అని, దాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో అధికారులతో కలిసి భూములను పరిశీలించిన ఆయన.. ఖాళీ స్థలాల రక్షణకు చర్యలు చేపట్టాలని అధికారులని ఆదేశించారు. మియాపూర్ భూములపై ప్రైవేటు వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను సుప్రీంకోర్టు అక్టోబర్ 29న కొట్టివేసింది. ఈ భూముల యాజమాన్యం ప్రభుత్వానికే చెందుతుందన్న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. మొత్తం భూమిలో ప్రస్తుతం సుమారు 400 ఎకరాలు ఖాళీగా ఉన్నాయని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. హెచ్‌ఎండిఏ పర్యవేక్షణలో ఉన్న ఈ భూమికి గతంలోనే సుప్రీంకోర్టు అనుమతితో రక్షణ కంచె ఏర్పాటు చేసినట్లు వివరించారు. కంచె లేని మిగిలిన ఖాళీ ప్రాంతాల్లోనూ హద్దులు స్పష్టంగా గుర్తించి, పూర్తిస్థాయి ఫన్సింగ్ ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. తీర్పు అనంతరం ఖాళీ భూమిని స్వాధీనంలోకి తీసుకునే చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిగా తేలడంతో ఇప్పటికే అక్కడ ఇళ్లు నిర్మించుకున్న కుటుంబాల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నకు కలెక్టర్ సి.నారాయణ రెడ్డి భరోసా ఇచ్చారు. సామాన్యులు నిర్మించుకున్న ఇళ్లు, ఇతర నిర్మాణాలను ప్రస్తుతానికి తొలగించబోమని స్పష్టం చేశారు. నివాసితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న భూమికి రక్షణ కల్పించే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ భూముల చరిత్రను వివరిస్తూ.. నిజాం కాలంలో సైన్యం నిర్వహణకు సంబంధించిన జాగీర్ వ్యవస్థలో ఇవి ఉన్నాయని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. 1912 నాటి సర్వే రికార్డుల్లోనే భూములను 'సర్కారీ పోరంబోకు'గా నమోదు చేశారని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పులోనూ ఈ రికార్డులను ప్రస్తావించింది. జాగీర్ ద్వారా లభించిన హక్కులు భూమిపై సంపూర్ణ యాజమాన్యాన్ని ఇవ్వవని, 1949లో జాగీర్దారీ వ్యవస్థ రద్దుతో సంబంధిత హక్కులు అంతరించాయని న్యాయస్థానం వివరించింది. ప్రభుత్వ భూమిపై ప్రైవేటు హక్కులు సృష్టించేందుకు కొందరు బోగస్ పత్రాలను ఆధారంగా చూపారని కలెక్టర్ పేర్కొన్నారు. నకిలీ ఎంట్రీలు సృష్టించి, రికార్డులను తారుమారు చేయడంలో పాత్ర ఉన్న అప్పటి అధికారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. విలువైన ప్రజా సంపదను కాపాడటంతోపాటు రికార్డుల అక్రమాలకు బాధ్యులైన వారిపైనా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

సున్నం చెరువుకు జీవకళ



ప్రజాపక్షం/హైదరాబాద్ : భారీ వర్షంతో అల్లపూర్ పరిధిలోని సున్నం చెరువుకు తిరిగి జీవకళ వచ్చింది. గతంలో 10 నుంచి 15 అడుగుల మేర పేరుకుపోయిన పూడికను తొలగించి, దుర్గంధాన్ని పారదోలుతూ హైడ్రా ఈ చెరువును సర్వాంగ సుందరంగా పునరుద్ధరించిన సంగతి తెలిసిందే. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, చిన్నారుల ప్లే ఏరియా, సేదదీరేందుకు గజబోలను సైతం ఏర్పాటు చేశారు. అయితే ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు లేక చెరువు ఎండిపోవడంతో స్థానికులు ఆందోళన చెందారు. శుక్రవారం నగరంలో దాదాపు 7 సెంటీమీటర్ల మేర కురిసిన వర్షంతో, సరిగ్గా రూపొందించిన ఇన్‌లెట్‌ల ద్వారా వర్షపు నీరు పెద్దఎత్తున చెరువులోకి చేరింది. చెరువు నిండుగా నీరు చేరుతుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వర్షంలోనే బయటకు వచ్చి నీరు వస్తున్న దృశ్యాలను వీడియోలు తీసి హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌తో పాటు ఇతర అధికారులకు పంపి తమ ఆనందాన్ని పంచుకున్నారు. చెరువులో పూడిక తొలగించడం, చుట్టుపక్కల అక్రమ బోరుబావులను హైడ్రా తొలగించడంతో ఈ నీరు భూగర్భంలోకి ఇంకి రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తమ్మిడికుంటకు వర్షం నీరు...మాదాపూర్‌లోని తమ్మిడికుంటకు వర్షం నీరు వచ్చి చేరుతోంది. చెరువుకు ఇన్‌లెట్‌లు చాలా అభివృద్ధి చేయడంతో రహదారులపై నిలిచే నీరు నేరుగా చెరువుకు చేరుతోంది. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా తమ్మిడికుంట, సున్నం ప్రారంభం కానున్న సమయంలో వర్షపు నీరు చేరడం శుభపరిణామమని వారు ఆనందం వ్యక్తం చేశారు.

మినీ ట్యాంక్‌బండ్‌గా ఫాక్స్ సాగర్

ఏడాదిలో పనులు పూర్తి చేస్తాం
హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : లేక్ సిటీగా పేరుగాంచిన హైదరాబాద్‌లో మరో చారిత్రక చెరువును పూర్తి స్థాయిలో పునరుద్ధరించేందుకు హైడ్రా చర్యలు చేపట్టింది. జీడిమెట్లలోని 129 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఫాక్స్ సాగర్ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు వేగవంతం చేసింది. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఈ పునరుద్ధరణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో, హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ శుక్రవారం క్షేత్రస్థాయిలో చెరువును పరిశీలించారు. ఆయనతో పాటు అదనపు కమిషనర్ డి. ఆనంద్ కుమార్, ఏసిపి పి.తిరుమల్ ఈ పరిశీలనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ హయాంలో 1897లో నిర్మించిన ఈ చెరువు ఒకప్పుడు సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలకు ప్రధాన తాగునీటి, వ్యవసాయ ఆధారంగా ఉండేదన్నారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ల కంటే ముందే నగర అవసరాలు తీర్చిన చరిత్ర దీనిదని, పురాతన రాతి పంపింగ్ హౌస్ దీనికి సజీవ సాక్ష్యమని తెలిపారు. మొత్తం 490 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువులో దాదాపు 150 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు అంచనా వేస్తున్నామని, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సహకారంతో కబ్జాలను తొలగిస్తామని స్పష్టం చేశారు. ఒకవేళ పట్టా భూములుంటే చట్టప్రకారం టిడిఆర్ కేటాయిస్తామన్నారు. తొలిదశలో రూ.75 కోట్లతో పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు. చెరువులో చేరిన 10 అడుగుల మేర పూడిక, పారిశ్రామిక వ్యర్థాలను తొలగించి, ఇన్‌లెట్, ఔట్‌లెట్‌లను పునరుద్ధరిస్తామని చెప్పారు. పక్షుల ఆవాసంగా, మత్స్యకారుల జీవనోపాధిగా ఉన్న ఈ చారిత్రక జలాశయానికి మళ్లీ పూర్వవైభవం తీసుకొచ్చి, భావితరాలకు అందిస్తామని రంగనాథ్ అన్నారు.



గుట్టల బేగంపేటలో 500 మీటర్ల ఫెన్సింగ్

శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేట గ్రామం సర్వే నెంబరు 63లోని విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు రక్షించారు. మొత్తం 78 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ సర్వే నెంబరులోని భూమిపై వివాదం హైకోర్టుకు చేరింది. ఈ క్రమంలో కోర్టు 'స్టేటస్ కో' కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఉత్తర్వుల ఉల్లంఘన జరుగుతుండటంతో స్పందించిన రెవెన్యూ అధికారులు, ఆ భూమిని ఆక్రమణల నుండి కాపాడాలని హైడ్రాను ఆశ్రయించారు. శుక్రవారం రంగంలోకి దిగిన హైడ్రా బృందం, స్థానిక అధికారుల సమక్షంలో కోర్టు ఉత్తర్వులను అమలు చేస్తూ, సర్వే నెంబరు 63లో దాదాపు 500 మీటర్లకు పైగా రక్షణ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసింది.

అర్హులైన రైతులందరికీ నష్టపరిహారం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ప్రజాపక్షం/యాచారం : అర్హులైన రైతులందరికీ నష్టరిహారం ఇప్పించడానికి కృషి చేస్తానని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం యాచారం మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన సర్వేనంబర్ 127,19,68 లో మొదటి విడుతగా 22 మంది రైతులకు దాదాపు 8 కోట్ల రూపాయలకుపైగా చెక్కులను మల్‌రెడ్డి రంగారెడ్డి అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్కులు ఇవ్వలేదని ఎవ్వరు రైతులు నిరాశ చెందవద్దని తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతుకు నష్టపరిహారం అందిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. భూముల విషయంలో ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అధికారులు ఎవరైన అవినీతి అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో ఇబ్రహింపట్నం ఆర్డిఒ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దారు అయ్యప్ప, మొండిగౌరేల్లి గ్రామ సర్పంచ్ కొలన్ రమాదేవి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ బడే కుమార్, మాజీ సర్పంచ్ బండిమీది కృష్ణ, నాయకులు తాండ్ర రవీందర్, మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు,





కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం, పాశం జయప్రకాశ్, మొండిగౌరేల్లి గ్రామానికి చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు విద్యా వెలుగులు చేరాలి

తుర్కయంజాల్ : అన్నివర్గాలకు విద్యావెలుగులు చేరినప్పుడే సమాజ మార్పు సాధ్యమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. తన సోదరి వంగేటి భూదేవమ్మ జ్ఞాపకార్థం ఆమె కుటుంబసభ్యులు పాఠశాలలో నిర్మించిన సభా వేదికను రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. మిట్ట ఫ్యామిలీ ఫౌండేషన్ సౌజన్యంతో పాఠశాలలో ఏర్పాటుచేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా విద్యాబుద్ధులు నేర్చుకొని పుట్టిన గడ్డకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుండ్ల ధనరాజ్ గౌడ్, వేముల అమరేందర్ రెడ్డి, నక్క శివలింగం గౌడ్, కొషికే ఐలయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

ఓటుతోనే ప్రజాస్వామ్యానికి పరిరక్షణ

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రజాపక్షం/కడ్తాల్: ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని, ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఓట్ బచావో.. దేశ్ బచావో' ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న చలో ఢిల్లీ' సభను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో టిపిసిసి సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, డిసిసి ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగంతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ప్రక్రియలో అర్హులైన ఒక్క ఓటరు కూడా తమ హక్కును కోల్పోకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఓటరు నమోదు కేంద్రాల ఇన్‌చార్జులు ఎంగిలి ప్రసాద్, నాగిళ్ల వెంకటేష్, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం,కౌన్సిలర్ అనిత శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ ప్రశాంతి రవికుమార్, నాయకులు అనిత విజయ్, కృష్ణ నాయక్, ఎంఎ ఖలీల్, పూసల సత్యం, కొండల్‌రెడ్డి, అబ్దుల్ అలీమ్, వస్పుల శ్రీకాంత్, ఎండి ఫరీద్, ఫిరోజ్, శ్రీనాయక్, మల్లేష్ నాయక్ పాల్గొన్నారు.



సురక్షితమైన, పర్యావరణహిత రవాణా వ్యవస్థ లక్ష్యం

నగర రవాణా భవిష్యత్తుపై ప్రత్యేక ప్రదర్శన
సైబరాబాద్ మూవ్స్-2026'..
నవంబర్ 26 నుంచి 28 వరకు
టీ-హబ్‌లో మూడు రోజుల కార్యక్రమం..పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/రంగారెడ్డి: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి),సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సిఎస్‌సి), షిఫ్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఇనిషియేటివ్ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 26,27,28 తేదీల్లో సైబరాబాద్‌లోని టీహబ్‌లో మూడు రోజుల పాటు ఈ ప్రత్యేక ప్రదర్శన, చర్చా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సిఎంసి కమిషనర్ జి.సృజన, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం రమేశ్, జాయింట్ పోలీస్ కమిషనర్(ట్రాఫిక్) సంయుక్తంగా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

రవాణా వ్యవస్థలో ప్రజల భద్రతకు ప్రాధాన్యం : సైబరాబాద్ సిపి రమేశ్

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేశ్ మాట్లాడుతూ నగరం విస్తరిస్తున్న కొద్దీ రవాణా వ్యవస్థ కేవలం ట్రాఫిక్ నియంత్రణకే పరిమితం కాకుండా, ప్రతి ఒక్కరూ సురక్షితంగా, సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా ఉండాలని పేర్కొన్నారు. ఇందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం, బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తనను అలవర్చుకోవడం, ప్రభుత్వ శాఖలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయడం అవసరమన్నారు. సైబరాబాద్ మూవ్స్' కార్యక్రమం వివిధవర్గాల అభిప్రాయాలను ఒకే వేదిక పైకి తీసుకువచ్చే వినూత్న ప్రయత్నమని, సురక్షితమైన రహదారులు, అందరికీ అందుబాటులో ఉండే మెరుగైన రవాణా వ్యవస్థ నిర్మాణం కోసం ప్రజల్లో సమిష్టి బాధ్యతను పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని మెరుగైన సైబరాబాద్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.



మెరుగైన రవాణా వ్యవస్థ కోసం సమష్టి కృషి అవసరం: సిఎంసి కమిషనర్ సృజన

సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.సృజన మాట్లాడుతూ సైబరాబాద్ అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో నగరంలో ప్రజల రాకపోకల విధానాన్ని పునరాలోచించడానికి మంచి అవకాశం ఏర్పడిందన్నారు. నగరాభివృద్ధికి అనుగుణంగా సురక్షితమైన, అందుబాటు ధరల్లో లభించే, అందరికీ అనుకూలమైన, పర్యావరణ హిత రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కోసం సైబరాబాద్ కన్వర్జెన్స్ వేదికగా పనిచేస్తోందని, నగరంలోని ట్రాఫిక్ జంక్షన్లను మెరుగుపరచడం, రహదారులను అభివృద్ధి చేయడం, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించడం వంటి అనేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ వినూత్న వేదిక ద్వారా ప్రజలందరూ పరిష్కారాల రూపకల్పనలో భాగస్వాములు కావాలని, ముఖ్యంగా విద్యార్థులు మొబిలిటీ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో పాల్గొని తమ ఆలోచనలను పంచుకోవాలని కోరారు.

74 కీలక జంక్షన్ల అభివృద్ధికి ప్రణాళిక

ప్రధానంగా సురక్షిత జంక్షన్లు, పాదచారులకు అనుకూలమైన రహదారులు, ప్రజా రవాణా అనుసంధానం, కార్పొరేట్ ఉద్యోగుల రాకపోకల విధానాలు, సుస్థిర పట్టణ రవాణా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. సిఎంసి ఆధ్వర్యంలో ప్రస్తుతం ఆరు ప్రధాన జంక్షన్ల అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, ట్రాఫిక్ పోలీస్ విభాగం, నిపుణుల సహకారంతో మొత్తం 74 కీలక జంక్షన్లను అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా చర్యలు చేపడుతున్నారు. భారీమ్యాపులు, డేటా విజువలైజేషన్లు, ఇంటరాక్టివ్ ఎగ్జిబిషన్ల ద్వారా నగర రవాణా వ్యవస్థకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా అందించనున్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు, సిఎంసి అధికారులు, పోలీస్, ట్రాఫిక్ విభాగాల అధికారులు, టిజిఎస్ఆర్‌టిసి, హెచ్‌ఎండిఏ, రవాణాశాఖ, ఓపెన్ డేటా తెలంగాణ ప్రతినిధులు, పౌర సమాజ, పారిశ్రామిక రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.




విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలి

సబ్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేసిన

సిపిఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఉమామహేష్

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ బస్తీల్లో విద్యుత్ మీటర్లు లేకుండా నేరుగా వైర్ల ద్వారా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ శుక్రవారం విద్యుత్ అధికారులను కోరారు. ఈ మేరకు సిపిఐ కుత్బుల్లాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో గాజులరామారం సబ్ ఇంజనీర్ సునైనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ గాజులరామారం పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించుకున్న పలు బస్తీల్లో వందలాది ఇళ్లు ఉన్నాయని, వాటిలో కొన్ని ఇళ్లకు అధికారిక విద్యుత్ మీటర్లు లేకుండానే నేరుగా వైర్ల ద్వారా విద్యుత్ వినియోగిస్తున్నారని తెలిపారు. దీనివల్ల విద్యుత్ చౌర్యం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని కోరుతున్న నేపథ్యంలో అక్రమ విద్యుత్ కనెక్షన్లను గుర్తించి తొలగించాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులపై ఉందన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి విద్యుత్ చౌర్యానికి అడ్డుకట్ట వేయాలని, అక్రమ కనెక్షన్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, కోశాధికారి సదానంద, యువజన సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, సిపిఐ నాయకులు నర్సింహులు, శ్రీనివాస్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



ఈటల రాజేందర్‌ను సన్మానించిన రజక సంఘం నాయకులు

ప్రజాపక్షం/చర్లపల్లి: దంపింగ్‌యార్డును తరలించాలని గత నాలుగు రోజులుగా పాదయాత్ర చేస్తున్న మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్‌ను ఘట్‌కేసర్ సర్కిల్ నాగారంకు చేరుకున్న సందర్భంగా ఆయనకు రజక సంఘం సభ్యులు జూపల్లి నరేష్ ఆధ్వర్యంలో మద్దతు తెలుపుతూ ఆయనకు సన్మానం చేశారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తొలగించి ప్రజల ప్రాణాలు కాపాడాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మిషన్ కాటన్‌తో పత్తి సాగులో అధిక దిగుబడికి దిశానిర్దేశం..!

లింగంపల్లిలో రైతులకు ప్రత్యేక శిక్షణ తరగతులు

ప్రజాపక్షం/నవాబుపేట : తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా నవాబుపేట మండలం లింగంపల్లి గ్రామంలో మిషన్ కాటన్ కార్యక్రమం కింద రైతులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పత్తి సాగులో ఆధునిక పద్ధతులు, తెగుళ్ల నివారణ, అధిక దిగుబడికి పాటించాల్సిన మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి లింగంపల్లి గ్రామ సర్పంచ్ శోభ పరమేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పత్తి సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఏఒ జ్యోతి, ఎఇఒ లోకేశ్వరి రైతులకు పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటను సంరక్షించుకోవడం, విత్తనాల ఎంపిక, తెగుళ్ల నివారణ, పురుగుమందుల వినియోగం వంటి అంశాలపై సాంకేతిక సూచనలు అందించారు. పంట దిగుబడిని పెంచుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రవీణ కుమార్, వార్డు సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు, నాయకులు మాజీ ఎంపిటిసి పరమేశ్వర్, కుమార్, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కలెక్టర్ ఆకస్మిక పర్యటన

ప్రజాపక్షం /కుల్కచర్ల : పరిగి నియోజకవర్గంలోని కుల్కచర్ల మండలంలోని జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన చేశారు. వాతావరణ పరిస్థితుల్లో రానున్న వ్యవసాయంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ కుల్కచర్ల మండల పరిధిలోని పిరంపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వరి పొలాలను పరిశీలించి, రైతులతోమట్లాడి సాగు చేస్తున్న పంటల, నీటి లభ్యత,వ్యవసాయ పరిస్థితులపై ఆరా తీశారు. రానున్న రోజుల్లో ఎల్‌నిన్ ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యత భూసార పరిస్థితులు ,వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అందుబాటులోఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో నీటి కోరతను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నా రు. అనంతరం స్థానిక పాఠశాల మధ్యాహ్నం భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టిసారించాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు.

అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ
వేగవంతం చేయాలి

సిఎంసి కమిషనర్
డాక్టర్ జి. సృజన



ప్రజాపక్షం/హైదరాబాద్ : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. పటాన్ చెరు సర్కిల్‌లో శుక్రవారం నిర్వహించిన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ పర్యటనలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో పాటు సంబంధిత సర్కిల్ అధికారులు పాల్గొన్నారు. కమిషనర్ చైతన్య నగర్ కమ్యూనిటీ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో సమీక్షించారు. అనంతరం పటాన్ చెరులోని కృషి డిఫెన్స్ కాలనీలో కొనసాగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. తెల్లాపూర్‌లో సెంట్రల్ లైటింగ్ పనుల పురోగతిని, హుడా కాలనీలో మోడల్ రోడ్డు అభివృద్ధి పనులను, హుడా కాలనీ పార్కు లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పట్టణ సౌకర్యాలు అందించడంతో పాటు కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధి, బహిరంగ ప్రదేశాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు.

జిపివి క్లియరెన్స్‌లో నిర్లక్ష్యం సహించేది లేదు ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కార్యాలయంలో రాంకీ సంస్థ అధికారులతో సమీక్ష అనంతరం ఆదర్శ్ నగర్ లో ఆకస్మికంగా పర్యటించిన కమిషనర్, డ్యాష్ బోర్డ్‌లో నమోదైన వివరాలను వాస్తవ పరిస్థితులతో పరిశీలించారు. చెత్త సేకరణ వాహనాల జిపిఎస్ వివరాలు, వాహనాల రాకపోకలు, రోజువారీ ట్రిప్పులు, జిపివి క్లియరెన్స్ నివేదికలు పరిశీలించిన కమిషనర్, ఆన్‌లైన్ నివేదికలు, క్షేత్రస్థాయి పనుల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఫొటోలు అప్‌లోడ్ చేసి పనులు పూర్తయినట్లు చూపడం సరికాదని, ప్రతి జిపివి, చెత్తను పూర్తిగా శుభ్రపరిచిన తర్వాతే క్లియరెన్స్ నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి చెత్త హాట్‌స్పాట్‌ను గుర్తించి జిపిఎస్ కోఆర్డినేట్‌లతో మ్యాపింగ్ చేయాలని, ప్రత్యేక నెంబర్లు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. చెత్త తొలగించిన ప్రతి ప్రాంతం లో తప్పనిసరిగా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. వాహనాల కొరత కారణంగా పారిశుద్ధ్య పనుల్లో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఇకపై ప్రతిరోజూ ఉదయం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, డ్యాష్‌బోర్డ్‌లో నమోదైన వివరాలను స్వయంగా పరిశీలిస్తానని కమిషనర్ తెలిపారు. తనిఖీల్లో ఎంఎంసి అదనపు కమిషనర్(ఆరోగ్యంపారిశుద్ధ్యం) సి.ఎన్. రఘు ప్రసాద్, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆనంద్, రాంకీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



వ్యర్థ, జల నిర్వహణపై.. ఎంఎంసి ఇంజనీర్లకు శిక్షణ

ప్రజాపక్షం/హైదరాబాద్: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) ఇంజనీరింగ్ అధికారులకు సుస్థిర వ్యర్థ, జల నిర్వహణపై క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) ఆధ్వర్యంలో నిర్వహించిన సామర్థ్య పెంపు కార్యక్రమంలో భాగంగా రెండు పారిశ్రామిక, సాంకేతిక అధ్యయన సందర్శనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆస్కీ డీన్ డాక్టర్ బి.జనార్ధన్ రెడ్డి, మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌తో పాటు ఎంఎంసి అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసికి చెందిన 56మంది ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. వివిఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రోజుకు ఒక టన్ను సామర్థ్యం కలిగిన ఆహార వ్యర్థాల ఆధారిత బయోగ్యాస్ ప్లాంట్‌ను, గ్రేవాటర్ నిర్వహణ వ్యవస్థను అధికారులు పరిశీలించారు. ఆహార వ్యర్థాలను బయోగ్యాస్‌గా మార్చే విధానం, వ్యర్థ జలాలను శుద్ధిచేసి తిరిగి వినియోగించే సాంకేతిక పద్ధతులపై అవగాహన పొందారు. అనంతరం దుండిగల్‌లోని రోజుకు 800 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన వ్యర్థాల నుంచి ఇంధన ఉత్పత్తి ప్లాంట్‌ను సందర్శించారు. వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, వనరుల పునరుద్ధరణ విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంఎంసి పరిధిలో అమలు చేయడం, పర్యావరణహిత వ్యర్థ, జల నిర్వహణ వ్యవస్థలను అభివృద్ధి చేయడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.



దళితుల సమస్యలపై చర్చ..అధికారులకు వినతులు

ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ : సివిల్ రైట్స్ డే సందర్భంగా శుక్రవారం జగద్గిరిగుట్టలోని గిరి ప్రసాద్ విజ్ఞాన కేంద్రంలో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఖలీల్, పోలీస్ శాఖ తరపున ఎస్సై శేఖర్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోజెస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దళితులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై అధికారులు, దళిత సంఘాల నాయకులు చర్చించారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు రుణాలు, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల అమలు, కుల ధ్రువీకరణ పత్రాల జారీ వంటి అంశాలపై సభ్యులు అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. అర్హులైన ఎస్సీలకు కుల ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన అందించాలని కోరారు. అలాగే పేద దళిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, వృద్ధులకు పింఛన్లు అందించాలని, దళితవాడల్లో మంచినీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి ప్రస్తుతం ఎలాంటి కేసులు లేవని పోలీస్ శాఖ అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోజెస్ మాట్లాడుతూ ఎస్సీ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టామ్‌కామ్ ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారికి నైపుణ్య శిక్షణతో పాటు జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా నిరుద్యోగ యువతకు సబ్సిడీపై ఎలక్ట్రిక్ వాహనాలు, ఈ రిక్షాలు అందించే పథకాలు అమల్లో ఉన్నాయని వివరించారు. విద్యావంతులైన యువతకు ఉపాధి అవకాశాలపై తగిన సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం, దివిఎంసి సభ్యుడు బూదాల బాబురావు, డీహెచ్‌పీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి బోనాల ప్రవీణ్ కుమార్, మండల కార్యదర్శి కె.వెంకటేష్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, దళిత నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెంచుకునేందుకు కృషి చేయాలి

ప్రజాపక్షం/ధారూర్: భూగర్భ జలాలు పెంచుకునేందుకు అందరు కృషి చేయాలని జిల్లా పరిషత్ ఉప ముఖ్యకార్యనిర్వహణధికారి హిరణ్మ యి అన్నారు. శుక్రవారం ధారూర్ మండల కేంద్రంతో పాటు రుద్రారం, నాగసముందర్ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..విబీజీ రాంజీ పథకం కింద మండలంలోని ఫారెస్టు, రుద్రారం, నాగసముందర్ గ్రామాలలో పాంఫండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. రానున్న వాతావరణ పరిస్థితులను అనుసరించి గ్రామాలలో భూగర్భ జలాలను పెంపొందించుకొవాల ని అన్నారు. అందుకు ప్రత్యేకంగా ఇంకుడు గుంతలు నిర్మించుకొనేలా ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. విబిజి రాంజీ పథకం కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బి నర్సిములు, ఎపిఒ రాములు, ఇసి రమేశ్, టిఏలు, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్య దర్శిలు తదితరులు పాల్గొన్నారు.



జన సంకల్ప యాత్రకు మద్దతు తెలిపిన వారికి సెల్యూట్

ప్రజాపక్షం/జవహర్ నగర్ : జవహర్ నగర్ డంప్ యార్డు సమస్య పరిష్కారం దాని తరలింపును డిమాండ్ చేస్తూ నాలుగు రోజుల పాటు నిర్వహించిన జవహర్ నగర్ జన సంకల్ప యాత్ర విజయవంతంగా ముగిసింది. ఈ పాదయాత్రను విజయవంతం చేసిన డంప్ యార్డు బాధితులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలకు నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పాదయాత్ర ముగింపు సభలో అనూహ్యంగా వర్షం కురిసినప్పటికీ, ప్రజలు మరియు కార్యకర్తలు ఏమాత్రం వెనకడుగు వేయకుండా నిలబడటం విశేషం. వరుణుడి తీవ్రత పెరిగినప్పటికీ, సభకు హాజరైన వారు కూర్చున్న కుర్చీలనే నెత్తిన పెట్టుకుని మరీ ఎంపిలు ఈటల రాజేందర్, రఘునందన్ రావుల ప్రసంగాలను చివరి వరకు శ్రద్ధగా విన్నారు. వర్షంలో సైతం ఇంచు కూడా కదలకుండా నిలబడి పోరాటానికి మద్దతు తెలిపిన ప్రజల స్ఫూర్తి తమ బాధ్యతను మరింత పెంచిందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిజెపి కార్యకర్తల అంకితభావానికి, కట్టుబాటుకు ప్రజాప్రతినిధులు సెల్యూట్ చేశారు. జవహర్ నగర్ బాధితుల పక్షాన, పర్యావరణ పరిరక్షణ కోసం బిజెపి చేపడుతున్న ఈ సుదీర్ఘ పోరాటానికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభించిందని, డంప్ యార్డు సమస్యపై ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ పోరాటం ఆగదని ఎంపి ఈటల రాజేందర్, నాయకులు స్పష్టం చేశారు.



ఎల్ నినోపై అప్రమత్తత అవసరం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ప్రజాపక్షం /కుల్కచర్ల : ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే పరిస్థితులు, కరువుపు ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎల్‌నినో ప్రభావం వ్యవసాయ రంగంపై దాని ప్రభావం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థాయిలోప్రజలకు రైతులకు అవగాహన కల్పించాలనిఅదేశించారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటిస్తు అందుబాటులో ఉన్న నీటి వనరులను పోదుపుగా వినియోగించుకోవాని సూచించారు. ప్రజల సమన్వయంతో పని చేస్తు ఎల్‌నినో ప్రభావం ,వ్యవసాయంతో పనిచేస్తు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. 8 కోట్లతో నిర్మించబోయే నూతన మున్సిపల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ హరిప్రియ, పరిగి తహసీల్దార్ వెంకటేశ్వరి, డిఇ మధవరెడ్డి, ఎంపిడిఓ కరీం, పార్థసారథి, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్,వైస్ చైర్మన్ హనుమంతు,కమల్,తదితరులు పాల్గొన్నారు.



తప్పడు ధృవపత్రాలు సమర్పిస్తే చట్టరీత్యా కఠినచర్యలు

పట్టభద్రుల ఓటర్ల నమోదు సమీక్షలో సిఇఒ సుదర్శన్‌రెడ్డి

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : పట్టభద్రుల ఓటర్ల నమోదులో తప్పుడు ధృవపత్రాలు సమర్పిస్తే వారిపై చట్టరీత్యా కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శనరెడ్డి ఆదేశించారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎంఎంసి ఆల్వాల్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలతో కల్సి పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా సజావుగా నిర్వహించి పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకొనేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో బిఎల్‌ఒలకు ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని అడిగి తెల్సుకొని పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చూడాలన్నారు. దరఖాస్తుదారులు సమర్పించిన ఫారం 18, డిగ్రీ సర్టిఫికెట్‌లతో పాటు నిర్దేశించిన పత్రాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.



రూ.50 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు

ప్రజాపక్షం/బోడుప్పల్ : చెంగిచెర్ల డివిజన్ సూరజ్‌నగర్‌కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించటంతో పాటు కాలనీలో రాకపోకలకు అనుకూలంగా ఉండే విధంగా రహదారుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పొగుల నరసింహారెడ్డి, కొత్త కిషోర్ గౌడ్, బొమ్మక్ కళ్యాణ్, మాజీ కార్పొరేటర్ దుర్గమ్మ, కాలనీ అధ్యక్షులు రవిచందర్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



మట్టిని తీసిన దళారులపై కేసులు నమోదు చేయాలి

ప్రజాపక్షం/శామీర్‌పేట : ప్రభుత్వ భూమిలో ఏలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతామని మైనింగ్ ఏడి సైదులు, మూడుచింతలపల్లి మండల తహశీల్దార్ మహ్మద్ గులాం ఇద్రిస్‌లు అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని కేశ్వాపూర్, యాకత్‌పుర గ్రామాల్లోని ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్విన స్థలాన్ని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడానికి పరిశీలించారు. ఈ సందర్భంగా మైనింగ్ ఏడి సైదులు, తహసీల్దార్ మహ్మద్ గులాం ఇద్రిస్‌లు మాట్లాడుతూ కేశ్వాపూర్ రెవెన్యూ పరిధిలోని యాకత్‌పుర సర్వే నెంబర్ 72, 74 లలో కొందరు వ్యక్తులు అక్రమంగా పెద్ద ఎత్తున మట్టిని తరలించినట్లు గుర్తించామని చెప్పారు. స్థానిక కౌన్సిలర్ మెరుపాటి గోవర్ధన్‌రెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ప్రజావాణిలో ఇచ్చిన పిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కేశ్వాపూర్ గ్రామాన్ని సందర్శించి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకునేందుకు శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామని చెప్పారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు చేపడుతామని తహసీల్దార్ మహ్మద్ గులాం ఇద్రిస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సరస్వతి, ఎస్ఐ సాయికృష్ణ, స్థానిక కౌన్సిలర్ మెరుపాటి గోవర్ధన్‌రెడ్డి, జిపిఒ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అణుశక్తి రంగంలో పలు నూతన ఆవిష్కరణలు చేసిన డాక్టర్ హోమీజె బాబా

ప్రజాపక్షం/చర్లపల్లి: తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో పద్మభూషణ్ డాక్టర్ హోమీజె బాబా 117వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం డాక్టర్ ఏఎస్‌రావు నగర్ ఫంక్షన్ హాలులో ఆయన విగ్రహం వద్ద సంస్మరణ సభ నిర్వహించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎన్ఎఫ్‌సి సీనియర్ నాయకులు ఉదయభాస్కర్ హోమీజె బాబా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ హోమీజె బాబా భారతదేశం అణురంగంలో శాంతియుత ప్రయోజనాల కొరకు ఎంతో కృషి చేసారని తెలిపారు. అణుశక్తి రంగంలోనే కాకుండా ఎలక్ట్రానిక్స్ రంగంలోను, భౌతిక శాస్త్రంలోనూ ఎన్నో ప్రయోగాలు చేసి నూతన ఆవిష్కరణలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు శివరామకృష్ణ, మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో బోధనా సిబ్బంది ఖాళీల భర్తీ

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : కుషాయిగూడలో కొనసాగుతున్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో బోధనా సిబ్బంది ఖాళీలను కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకాలు చేపడుతున్నామని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వైస్ ప్రిన్సిప ల్ నవ కళ్యాణి కోరారు. 9 ప్రొఫెసర్లు, 17 అసోసియేట్ ప్రొఫెసర్లు, 29 అసిస్టెంట్ ప్రొఫెసర్, 9 సీనియర్ రెసిడెంట్లు, 5 ట్యూటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటికోసం https://gmcquthbullapur.org వెబ్‌సైట్ ద్వారా తీసుకొన్న ధరఖాస్తు ఫారాలను పూరించి నవంబర్ 5న కుషాయిగూడ సువిధా హాస్పిటల్ పక్కన ఉన్న కళాశాలలో ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల లోపు హాజరు కావాలని కోరారు.

ఇవి తాగే నీళ్లేనా?



ప్రజాపక్షం/వెంగళరావునగర్: అడుగంటుతున్న భూగర్భజలాలతో ఆందోళన చెందుతున్న ప్రజలకు జలమండలి సరఫరా చేస్తున్న మంచినీటిలో మురుగునీరు కలుస్తుండటంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఈ క్రమంలోనే మధురానగర్ వాసులు కలుషిత నీటితో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ 'ఈ' బ్లాక్‌లో కొంతకాలంగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. సమస్యపై బాధితులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారులు వచ్చి అక్కడక్కడా నామమాత్రపు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి వెళ్లిపోతున్నారే తప్ప పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇకనైనా జలమండలి అధికారులు స్పందించి కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

టిపిసిసికి చీఫ్‌కు దీపావళి ఆహ్వానం



ప్రజాపక్షం/చార్మినార్: దీపావళి పురస్కరించుకుని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని కోరుతూ టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఆలయ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం చైర్మన్ శశికళ మహేష్ గౌడ్‌ను కలిసి ఆహ్వానం పత్రం అందించారు.

కేఫ్‌లకు ఆదరణ



ప్రజాపక్షం/ఖైరతాబాద్: దక్కన్ సాంప్రదాయానికి ప్రతిరూపంగా ఏర్పాటైన కేఫేలకు ఆదరణ ఎప్పుడూ ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డోస్ స్పెషాలిటీ కాఫీ షాప్‌ను ముఖ్యఅతిథిగా విచ్చేసిన హరీష్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, విప్లవ్‌కుమార్, రామచందర్, నరసింహ ముదిరాజ్, రావుల విజయ్, మూర్తుజ, యూసుఫ్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవం



ప్రజాపక్షం/బంజారాహిల్స్: ఎస్‌సి, ఎస్‌టి పౌరహక్కుల దినోత్సవాన్ని సత్యానగర్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో సత్యానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు స్థానిక మౌలిక సదుపాయాలు, సమస్యలపై చర్చించడం జరిగింది. కార్యక్రమంలో సత్యానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, అడ్వకేట్ మహేందర్, ఉపాధ్యక్షుడు జి.రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెవిన్.క్రాంతికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి డి.శశిధర్, కోశాధికారి టి.రవిరాజ్, సంయుక్త కార్యదర్శి సి.రఘు, కాలనీ సభ్యులు కె.రాజ్‌కుమార్, కె. బాలమోహన్, మహిళా ప్రతినిధులు డి.ప్రతిభ, పి.ప్రేమవతి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి గ్రీన్ వాటర్ సరఫరా

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: నవంబర్ 1 నుంచి గ్రీన్ వాటర్ ట్యాంకర్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మూడు రీజియన్ల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, డైరెక్టర్లు, సిజిఎంలు, జిఎంలు, ఇతర ఉన్నతాధికారులతో జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ట్యాంకర్ల నమోదు, ఎస్‌టిపిల వద్ద ఫిల్లింగ్ పాయింట్ల ఏర్పాటు, వినియోగదారుల గుర్తింపు, ప్రభుత్వ శాఖలతో సమన్వయంపై దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎల్‌నినో పరిస్థితులు, భూగర్భ జలాలపై పెరుగుతున్న ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన వివరించారు. శుద్ధి చేసిన మురుగునీటిని తాగునీటి యేతర పనులకు వినియోగించడం ద్వారా భూగర్భ జలాలను సంరక్షించవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి జలమండలి నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.

'ఘనం పివి వనం' పుస్తకావిష్కరణ

ప్రజాపక్షం/బేగంపేట్: ఔషధ మొక్కల ప్రాముఖ్యత, ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను వివరించే విధంగా ఘనం పివి వనం పుస్తకం రూపొందించారు. ఎమ్మెల్సీ సురభి వాణీదేవి రచించిన ఘనం పివి వనం పుస్తకాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుక్రవారం బేగంపేట్‌లోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ, స్వామి రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ సంయుక్తంగా నిర్వహించాయి. శాసనమండలి ఉపసభాపతి డాక్టర్ బండ ప్రకాశ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఫెర్టిలిటీ సెంటర్‌పై దాడులు

ప్రజాపక్షం/బేగంపేట్: అక్రమంగా కొనసాగుతున్న ఫెర్టిలిటీ సెంటర్‌పై పోలీసులు దాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. బేగంపేట్ పిఎస్ పరిధిలో వెలుగుచూసిన అక్రమ ఫెర్టిలిటీ దందా కలకలం రేపింది. ప్రకాష్‌నగర్ ప్రాంతంలో అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ వ్యవహారంపై బేగంపేట్ పోలీసులు, స్పెషల్ ఆపరేషన్ టీమ్ సిబ్బంది సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. నివాస గృహాల మధ్య నడుస్తున్న ఈ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా మహిళల అండాలను, పురుషుల వీర్యకణాలను సేకరించి, నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఓ హాస్టల్‌లో ఈ చీకటి కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దాదాపు 10 మంది యువతులను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఈ దందాలో ఒక మహిళ ప్రధాన సూత్రధారిగా వ్యవహరిస్తూ నెట్‌వర్క్ కొనసాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

నిమజ్జనంతో హుస్సేన్‌సాగర్

నీటి నాణ్యతకు దెబ్బ

- ఆరు ప్రాంతాల్లో నీటి నాణ్యత తగ్గినట్లు పిసిబి పరీక్షల్లో వెల్లడి • నెక్లెస్ రోడ్ వద్ద అత్యధికంగా 200 ఎన్‌టియు టర్బిడిటీ నమోదు





ప్రజాపక్షం/ హైదరాబాద్: వినాయక విగ్రహాల నిమజ్జనం హుస్సేన్‌సాగర్ నీటి నాణ్యతపై ప్రభావం చూపింది. నిమజ్జనం సమయంలో సరస్సులోని నీరు మనకబారడంతో పాటు, తేలియాడే ఘన పదార్థాలు, రసాయనిక ఆక్సిజన్ డిమాండ్, జీవరసాయనిక ఆక్సిజన్ డిమాండ్ స్థాయిలు పెరిగినట్లు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) నిర్వహించిన పరీక్షల్లో వెల్లడైంది. నిమజ్జనం ముగిసిన తర్వాత కొన్ని ప్రమాణాల్లో తగ్గుదల కనిపించినప్పటికీ, అనేక ప్రాంతాల్లో నీటి నాణ్యత నిమజ్జనానికి ముందు స్థాయికి చేరుకోలేదు. ముఖ్యంగా నెక్లెస్ రోడ్ వద్ద అత్యధికంగా 200 ఎన్‌టీయూ టర్బిడిటీ, 164 మి.గ్రా./లీ. సిఒడి నమోదుకావడం గమనార్హం.కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశించిన పర్యవేక్షణ షెడ్యూల్ ప్రకారం టిజిపిసిబి హుస్సేన్‌సాగర్‌లోని ఆరు ప్రాంతాల్లో నిమజ్జనానికి ముందు, నిమజ్జనం సమయంలో, అనంతరం నీటి నమూనాలను సేకరించి విశ్లేషించింది. సెప్టెంబర్ 14న వినాయక చవితి నిర్వహించగా, సెప్టెంబర్ 11న నిమజ్జనానికి ముందు, 17, 19, 21, 23 తేదీల్లో నిమజ్జనం సమయంలో, సెప్టెంబర్ 28న నిమజ్జనం అనంతరం నమూనాలను సేకరించింది.ఎన్టీఆర్ పార్క్ ఎదురుగా ఉన్న రెండు ప్లాట్‌ఫాంలు, లుంబినీ పార్క్, నెక్లెస్ రోడ్, లేపాక్షి హస్తకళల కేంద్రం సమీపం, బుద్ధ విగ్రహం వద్ద ఉన్న కంట్రోల్ పాయింట్‌లో నీటి నాణ్యతను పరిశీలించింది. నిమజ్జనం సమయంలో ఆరు ప్రాంతాల్లోనూ టర్బిడిటీ, టీఎస్ఎస్ విలువలు పెరిగాయి. నిమజ్జనం అనంతరం తగ్గినప్పటికీ, పూర్వపు స్థాయికి చేరుకోలేదు. ఎన్టీఆర్ పార్క్ ఎదురుగా ప్లాట్‌ఫాం నంబర్1 వద్ద అత్యధికంగా 99 మి.గ్రా./లీ. టీఎస్ఎస్ నమోదైంది.రసాయనిక ఆక్సిజన్ డిమాండ్ (సిఒడి) విలువలు అన్ని ప్రాంతాల్లో గణనీయంగా పెరిగాయి. నెక్లెస్ రోడ్ వద్ద అత్యధికంగా 164 మి.గ్రా./లీ. నమోదైంది. నిమజ్జనం తర్వాత కూడా ఈ విలువలు సాధారణ స్థాయికి చేరుకోలేదు. జీవరసాయనిక ఆక్సిజన్ డిమాండ్ అనంతరం పెరిగినట్లు పరీక్షల్లో తేలింది.

మహావీర్ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదు

ప్రజాపక్షం/కార్వాన్: నాలా భూముల ఆక్రమణకు పాల్పడుతూ మహావీర్ ఎస్టేట్ ప్రాజెక్ట్స్ నిర్మాణాలు చేపడుతోందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగరం వేణుగౌడ్ హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గుడిమల్కాపూర్ గ్రామ పరిధిలోని ఆసిఫ్‌నగర్ మండలం, టౌన్ సర్వే నెం 16, బ్లాక్, వార్డు 19, టౌన్ సర్వే నెం 27 ప్రాంతాల్లో నాలా భూముల ఆక్రమణకు పాల్పడుతూ మహావీర్ ఎస్టేట్ ప్రాజెక్ట్స్ నిర్మాణాలు చేపడుతోందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగరం వేణుగౌడ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాగారం వేణు గౌడ్ మాట్లాడుతూ.. నాలా భూముల విషయంలో వాస్తవ పరిస్థితులను పరిశీలించకుండా, ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహావీర్ ఎస్టేట్ ప్రాజెక్ట్స్‌కు బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యమా, లేక ఉద్దేశపూర్వక వ్యవహారమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఫిర్యాదు నేపథ్యంలో హైడ్రా ఇరిగేషన్ విభాగం డిఇ రాజశేఖర్ సంబంధిత అధికారులతో కలిసి వివాదాస్పద ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాలా భూములను ప్రైవేటు నిర్మాణాలకు అనుకూలంగా మార్చే ప్రయత్నాలను సహించేది లేదని తేల్చిచెప్పారు.

పరిశ్రమలకు టిజిపిసిబి హెచ్చరిక

- రసాయన వాసనలతో జనం ఉక్కిరిబిక్కిరి.. • జీడిమెట్ల, బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాలపై కాలుష్య నియంత్రణ మండలి దృష్టి • నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



ప్రజాపక్షం/హైదరాబాద్: పారిశ్రామిక కాలుష్యం పరిసర ప్రాంతాల ప్రజలకు శాపంగా మారుతోంది. జీడిమెట్ల, బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాల్లోని రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న వాసనలు స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పరిశ్రమల నుంచి వ్యాపిస్తున్న రసాయన దుర్వాసనలపై ప్రజల నుంచి తరచూ ఫిర్యాదులు అందుతుండటంతో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) హైదరాబాద్ జోన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి కాలుష్య నియంత్రణ చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా నివాస ప్రాంతాల్లోకి రసాయన వాసనలు వ్యాపిస్తున్న అంశాన్ని అధికారులు పరిశ్రమల ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి ఇబ్బందులు కలగకుండా పరిశ్రమలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పరిశ్రమల్లో ఏర్పాటు చేసిన స్క్రబ్బర్లను నిరంతరాయంగా, సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. వాటి పనితీరుకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు.అంతేకాకుండా ప్రతి 15 రోజులకు ఒకసారి వాయు ఉద్గారాల పర్యవేక్షణ చేపట్టి, అందుకు సంబంధించిన నివేదికలు, రికార్డులను కాలుష్య నియంత్రణ మండలికి సమర్పించాలని నిర్దేశించారు. పరిశ్రమల యాజమాన్యాలు స్వీయ పర్యవేక్షణలో భాగంగా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, రసాయన దుర్వాసనలకు కారణమవుతున్న మూలాలను గుర్తించి వాటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటించకుండా ప్రజల ఇబ్బందులకు కారణమయ్యే పరిశ్రమల పట్ల ఎలాంటి ఉపేక్ష ఉండబోదని హైదరాబాద్ జోన్ అధికారులు హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే సంబంధిత పరిశ్రమలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల నేపథ్యంలో పరిశ్రమల పనితీరుపై పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని ఈ సమావేశం స్పష్టం చేసింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల

వివరాలు వెబ్‌సైట్‌లో పెట్టక పోవడం వల్ల ఇబ్బందులు

బిసి వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జి.ఆశన్న

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ జిల్లాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 2026–27 విద్యాసంవత్సరానికి సంబంధించి ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసినట్లు బిసి వెల్ఫేర్ డిప్యూటి డైరెక్టర్ జి.ఆశన్న ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఇప్పటికి పోస్ట్ మెట్రిక్ ఉపకారవేతనాలకు సంబంధించి వంద శాతం నమోదైన విద్యార్థిని, విద్యార్థులు, ఈబిసిలు వంటి వాటిని పరిశీలించి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి కార్యాలయం ఈపాస్ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో పెట్టడం లేదని ఆయన పేర్కొన్నారు. దీని వల్ల నిధులను ఖర్చు చేయలేకపోతున్నామన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు దరఖాస్తులను పరిశీలించి (రెన్యువల్‌కు సంబంధించినవి మినహాయించి) తాజా ఉపకారవేతనాలకు సంబంధించి విద్యార్థిని, విద్యార్థుల సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని ఆయన కోరారు. చలామణిలో ఉన్న బ్యాంక్ ఖాతాలను మాత్రమే పరిశీలించి ప్రిన్సిపాళ్ల లాగిన్ నుంచి పంపాలని ఆయన తెలిపారు. అలాగాచాలా మంది విద్యార్థిని విద్యార్థులు వారి మూతపడిన బ్యాంక్ ఖాతాలు ఉన్నవి చూడకుండా కొత్త బ్యాంక్ ఖాతాలను పెట్టి దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆ ఎక్కౌంట్స్‌కు ఆధార్ సీడింగ్ చేసుకోలేదని, వీటిని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు ఒకసారి పూర్తి స్థాయిలో పరిశీలించి వారి కొత్త బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ చేయించిన తర్వాత ఈ పాస్ లాగిన్ నుంచి డిబిసి డిఓ లాగిన్‌కు పంపించాలని ఆయన తెలిపారు.

కనువిందుగా 'కళా స్పందన ఆర్ట్ ఫెయిర్'

నవంబరు 1 వరకు ఉచిత ప్రవేశం.. వెయ్యికి పైగా కళాకృతుల ప్రదర్శన





ప్రజాపక్షం/హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో శుక్రవారం 'కళా స్పందన ఆర్ట్ ఫెయిర్' ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనను ప్రముఖ సీనియర్ శిల్పి, పద్మశ్రీ పురస్కార గ్రహీత యాదగిరిరావు, సీనియర్ శిల్పి జి.యాదగిరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ యాదగిరిరావు మాట్లాడుతూ కళల్లో మౌలికత, సొంత ఆలోచనలు ఎంతో ముఖ్యమని, యువ కళాకారులు ఇతరుల శైలిని అనుకరించకుండా సృజనాత్మకతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. జి.యాదగిరి మాట్లాడుతూ అధికారిక శిక్షణ, నైపుణ్యంతో రూపొందించిన ఒరిజినల్ చిత్రాలకు అధిక విలువ ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా 100 మందికి పైగా కళాకారులు, ప్రముఖ ఆర్ట్ గ్యాలరీలు పాల్గొని సుమారు వెయ్యి కళాకృతులను ప్రదర్శిస్తున్నారు. ఆయిల్, వాటర్, యాక్రిలిక్ చిత్రాలతో పాటు రెసిన్ ఆర్ట్, కేరళ కుడ్యచిత్రాలు, మధుబని, తంజావూరు చిత్రకళ, శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలంకరణ వస్తువులు, డిజైనర్ చీరలు, దుస్తులను కూడా ప్రదర్శనలో ఉంచారు. క్యురేటర్ సుదీప్ చక్రవర్తి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రదర్శన నవంబరు 1 వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుంది. సందర్శకులకు ప్రవేశం ఉచితం. మరిన్ని వివరాలకు www.indianartfair.net.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

కాంట్రాక్ట్ వర్సిటీ టీచర్లను క్రమబద్ధీకరించాలి



అఖిలపక్ష సమావేశం డిమాండ్

ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ : రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ టీచర్లను క్రమబద్ధీకరించాలని, ఏడో పిఆర్‌సి, యుజిసి పే స్కేల్‌ను అమలు చేయాలని అఖిలపక్ష పక్ష సమావేశం డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్ట్ తెలంగాణ రాష్ట్ర (యుటిఏసిటిఏస్) అధ్యక్షులు డాక్టర్ పరశురామ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావు, టిపిసిసి అధికార ప్రతినిధి శోభన్, సిపిఎం నేత వి.భూపాల్ హాజరయ్యారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ అనేక రాష్ట్రాలు కాంట్రాక్ట్ టీచర్లను క్రమబద్ధీకరించాయని గుర్తు చేశారు. కోదండరామ్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ టీచర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రాంచందర్‌రావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ టీచర్ల సమస్యలను అవసరమైతే కేంద్రప్రభుత్వం వద్ద లేవనెత్తుతానన్నారు. కాంట్రాక్ట్ టీచర్ల పోరాటానికి తమ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. వి. భూపాల్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచర్ల డిమాండ్లు న్యాయమైనవన్నారు. పే స్కేల్, ఉద్యోగ భద్రత కల్పనకు పోరాడాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సమావేశంలో యుటిఏసిటిఏస్ అధ్యక్షులు డా.ఎ.పరశురామ్, కార్యనిర్వాహక అధ్యక్షులు డా.కరుణాకర్, డా.ధర్మతేజ, ప్రధానకార్యదర్శి డా.బి.నిరంజన్, డా.వినీత పాండే, డా.విజయేందర్ పాల్గొన్నారు.

నిజాయితీతో విధులు నిర్వర్తించాలి

ఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: ఉద్యోగులందరూ అవినీతికి దూరంగా ఉంటూ నిజాయితీ, నిబద్ధత, నైతిక విలువలతో విధులు నిర్వర్తించాలని టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ సూచించారు. శుక్రవారం టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సిఎండి జితేష్ పాటిల్ అధ్యక్షతన జరిగిన విజిలెన్స్ కమిటీ సమావేశంలో ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడితే ఉద్యోగులు విజిలెన్స్ విచారణ, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు, సస్పెన్షన్, ఉద్యోగం నుంచి తొలగింపు వంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి రావచ్చని, అవినీతి నిరోధక చట్టం కింద కేసులు నమోదైతే క్రిమినల్ విచారణ, న్యాయస్థానంలో శిక్షలు, జరిమానాలు వంటి తీవ్ర పరిణామాలు కూడా ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్.నరసింహులు, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, కమర్షియల్ అండ్ ఐటీ) వి.శివాజీ, డైరెక్టర్ (హెచ్ఆర్ అండ్ ఫైనాన్స్) కృష్ణారెడ్డి, డైరెక్టర్ (కమర్షియల్) సీహెచ్.చక్రపాణి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.నారాయణ, విజిలెన్స్ కమిటీ సభ్యుడు రిటైర్డ్ ఐఏఎస్ ఎంజి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు గాలికొదిలేసిన కాంగ్రెస్

ప్రజాపక్షం/ముషీరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముందస్తు ప్రణాళికలు, కనీస పాలనా స్పృహ లేకపోవడం వల్లే హైదరాబాద్ మహానగరంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి, అధిక ధరలు, కరెంట్ కోతలు తలెత్తుతున్నాయని సికింద్రాబాద్ పార్లమెంటు కన్వీనర్ నల్లెల్ల కిషోర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు నగర పార్టీ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమస్యలు తీవ్రరూపం దాల్చిన తర్వాత సమీక్షల పేరుతో హడావుడి చేస్తూ, ప్రజలపై భారీ జరిమానాల పేరుతో వేధింపులకు దిగడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు.

ఎంప్లాయిస్ యూనియన్ కృషితోనే జలమండలిలో పదోన్నతులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు: మొగుళ్ల రాజిరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: జలమండలిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 36 మంది పి&ఎ ఉద్యోగులకు అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ నిరంతర కృషితోనే ప్రమోషన్లు సాధ్యమయ్యాయని యూనియన్ అధ్యక్షుడు, ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి తెలిపారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో యూనియన్ గౌరవ సలహాదారు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌తో కలిసి 36 మంది ఉద్యోగులకు ప్రమోషన్ పత్రాలను అందజేశారు. జలమండలి చరిత్రలో ఒకేసారి 36 మందికి పదోన్నతులు కల్పించడం ఇదే తొలిసారని రాజిరెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో సంప్రదింపులు జరిపేందుకు తొమ్మిది మందితో వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు రాజిరెడ్డి వెల్లడించారు. ఈ కమిటీ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్ పర్సనల్ ఖాదర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.పి. రాఘవేంద్రరాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైతి మృతిపై విచారణ జరపాలి

నిర్బంధంలో ఉన్న మావోయిస్టులను విడుదల చేయాలి: పౌరహక్కుల సంఘం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మావోయిస్టు నరసుబొడ్డు అలియాస్ నైతి ఆత్మహత్యకు జిల్లా ఎస్‌పి డాక్టర్ జితేందర్ కుమార్ యాదవ్ బాధ్యత వహించాలని పౌరహక్కుల సంఘం (సిఎల్‌సి) తెలంగాణ డిమాండ్ చేసింది. ఈ నెల 21న జరిగిన నైతి మరణంపై తక్షణమే న్యాయ విచారణ జరిపించి, బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చి, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నెలల తరబడి నిర్బంధించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21కు విరుద్ధమని సంఘం పేర్కొంది. సుక్మా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లో వందలాది మందిని నిర్బంధంలో ఉంచినట్లు తెలిపింది. వారికి కనీస సౌకర్యాలు కల్పించకుండా వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తున్నారని విమర్శించింది. నైతి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, వివిధ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్బంధంలో ఉన్నవారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు పౌరహక్కుల సంఘం సీనియర్ నాయకులు ప్రొఫెసర్ జి. హరగోపాల్, రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణరావు తదితరులు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

కూలిన హెలికాప్టర్

బద్రీనాథ్ నుంచి దేహ్రాడూన్‌కు వెళ్తుండగా ఘటన

పైలట్ సహా ఆరుగురు వ్యక్తులు మృతి




చమోలి: ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఓ హెలికాప్టర్ కూలిపోయింది. బద్రీనాథ్ నుండి బయలుదేరిన హెలికాప్టర్ డెహ్రాడూన్‌కు వెళ్తుండగా అయిన సుమారు గంట తర్వాత జోషిమఠ్‌లోని ఒక కొండ ఢీకొట్టి కుప్పకూలిపోయింది. ప్రమాద సమయంలో పైలట్ సహా హెలికాప్టర్‌లో ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరంతా మృతి చెందారని, వారి మృతదేహాలు లభించాయన్నారు. ట్రాన్స్ భారత్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఆరుగురిని కెప్టెన్ హిమాన్షు, ప్రతాప, అరుణ్, శంకర్ గౌడ, సుధీర్ కె, హెచ్ ఎస్ నటరాజ అనే ఐదుగురు పురుష ప్రయాణికులుగా గుర్తించారు. శుక్రవారం మధ్యాహ్నం 2.20 గంటల ప్రాంతంలో మార్వారీ వంతెన సమీపంలోని జెపి పవర్ హౌస్ వద్ద హెలికాప్టర్ ఒక కొండను ఢీకొట్టిందని వారు తెలిపారు. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ బద్రీనాథ్ ఆలయ దర్శనం ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందా? అనేది ఇంకా నిర్ధరణ కావాల్సి ఉందన్నారు. సహాయక, రెస్క్యూ ఆపరేషన్ల కోసం చమోలీ పరిపాలన, పోలీసులు, ఎస్‌డిఆర్ఎఫ్, ఆర్మీ, ఐటిబిపి బృందాలను సంఘటనా స్థలానికి పంపినట్లు వారు తెలిపారు. తాను పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నానని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. బద్రీనాథ్ నుండి డెహ్రాడూన్‌లోని సహస్రధారకు వెళ్తున్న ట్రాన్స్ భారత్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన విటిబెచ్‌సిఎక్స్ కాల్ సైన్ గల హెలికాప్టర్, శుక్రవారం మధ్యాహ్నం సుమారు 1:15 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 2:20 గంటల ప్రాంతంలో అదృశ్యమైందని ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యుసిఎడిఎ) తెలిపింది. 'జోషిమఠ్ లోయ మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు హెలికాప్టర్ కమ్యూనికేషన్ కోల్పోయిందని, అదే సమయంలో, ట్రాకింగ్ సిస్టమ్ కూడా హెలికాప్టర్‌ను గుర్తించలేకపోయిందని యుసిఎడిఎ జారీ చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రయాణికులు బెంగళూరుకు చెందినవారని ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయని యుసిఎడిఎ సిఇఒ ప్రతీక్ జైన్ పిటిఐకి తెలిపారు.

కాంగ్రెస్ బ్యాంకులు సృష్టిస్తే...

బిజెపి విక్రయిస్తోంది!

బ్యాంకులు అమ్ముకోవాల్సిన ఆస్తులుకావు, దేశ నిర్మాణానికి ఉపయోగపడే సాధనాలు: రాహుల్‌గాంధీ

ఐడిబిఐ ఉద్యోగులకు అండగా ఉంటానని హామీ



న్యూఢిల్లీ : ప్రభుత్వ బ్యాంకులు అమ్ముకోవాల్సిన ఆస్తులు కావు, అవి దేశ నిర్మాణానికి ఉపయోగపడే సాధనాలు అని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. 'మోదీ హయాంలో మొదట బిడ్డింగ్ చూశారు, ఆ తర్వాత ధర నిర్ణయించారు. కాంగ్రెస్ హయాంలో బ్యాంకులు సృష్టించబడ్డాయి. మోదీ హయాంలో, వాటిని అమ్ముతున్నారు. నేను ఐడిబిఐ బ్యాంక్ ఉద్యోగులతో నిలబడతాను' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఐడిబిఐ బ్యాంక్ పెట్టుబడుల ఉపసంహరణ వివాదం నేపథ్యంలో, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బ్యాంక్ ఉద్యోగులకు తన మద్దతును ప్రకటించారు. లాభాల్లో ఉన్న ఈ ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకును కెనడాకు చెందిన ఒక సంస్థకు విక్రయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన ప్రశ్నించారు. ఐడిబిఐ బ్యాంక్ కుటుంబ సభ్యులకు రాసిన లేఖలో, గత ఏడాది మార్చిలో ఐడిబిఐ బ్యాంక్ ఉద్యోగుల బృందం పార్లమెంటు భవనంలో తనను కలిసి, తాము లాభాల్లోకి తెచ్చిన బ్యాంకును ప్రభుత్వం ఎందుకు విక్రయిస్తోందని ఒక సరళమైన ప్రశ్న అడిగారని ఆయన పేర్కొన్నారు. 'నేను ఆ ప్రశ్నను లోక్‌సభలో లేవనెత్తాను. లాభాల్లో ఉన్న ఒక ప్రభుత్వ బ్యాంకును ఎందుకు విక్రయిస్తున్నారని, అలాగే అందులో పనిచేసే ఉద్యోగులు, డిపాజిటర్ల ప్రయోజనాలను ఎలా కాపాడతారని ప్రభుత్వాన్ని అడిగాను. ప్రభుత్వం దీనికి ఎటువంటి కారణం చెప్పలేదు. ఇప్పుడు, ఐడిబిఐ బ్యాంకును కెనడాకు చెందిన 'ఫెయిర్‌ఫాక్స్' సంస్థకు విక్రయించాలని నిర్ణయించుకుంది' అని రాహుల్ గాంధీ అన్నారు. ఐడిబిఐ ఒక అగ్రగామి అభివృద్ధి బ్యాంకుగా ప్రారంభమైందని పేర్కొన్న ఆయన, వాణిజ్య బ్యాంకుగా మారే ప్రయాణం కష్టతరమైనప్పటికీ, ఉద్యోగులు ఆ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొన్నారని కొనియాడారు. 'ఏళ్ల క్రితం ఐడిబిఐ నష్టాల్లో ఉండేది. కానీ గత ఏడాది, ఇది తొమ్మిది వేల కోట్ల రూపాయలకు పైగా లాభాన్ని ఆర్జించింది. ఈ మార్పు మీ కృషి ఫలితమే' అని బ్యాంక్ ఉద్యోగులకు రాసిన బహిరంగ లేఖలో ఆయన పేర్కొన్నారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన సంస్థ ప్రజలకే చెందుతుందని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. ప్రస్తుతం ఈ బ్యాంకులో ప్రభుత్వం, ఎల్ఐసిలకు కలిపి 95 శాతం వాటా ఉందని, విక్రయం తర్వాత అది 34 శాతానికి పడిపోతుందని అక్టోబర్ 29 నాటి తన లేఖలో ఆయన గుర్తు చేశారు. 2003లో, ఐడిబిఐలో కనీసం 50 శాతం వాటాను ఎల్లప్పుడూ తమ వద్దే ఉంచుకుంటామని ప్రభుత్వం పార్లమెంటుకు హామీ ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ హామీ చట్టపరంగా లిఖితపూర్వకంగా లేకపోవచ్చు, కానీ పార్లమెంటుకు ఇచ్చిన హామీ అంటే అది భారత ప్రజలకు ఇచ్చిన హామీతో సమానం ని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఐడిబిఐ ప్రైవేట్ యాజమాన్యంలోకి వెళ్తే, దానితో పాటు ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి అభ్యర్థులకు కల్పించే రిజర్వేషన్లు కూడా రద్దవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే బలహీనపడిన మీ సేవా నిబంధనలు, వాటికి ఉన్న చివరి రక్షణను కూడా కోల్పోతాయని, ప్రైవేట్ రంగంతో పాటు బలమైన ప్రభుత్వ రంగం కూడా పనిచేయాలని కాంగ్రెస్ ఎల్లప్పుడూ విశ్వసించిందన్నారు. ఎక్స్‌లో తన లేఖను షేర్ చేస్తూ కాంగ్రెస్ హయాంలో దేశ పరిశ్రమలను నిర్మించడానికి ఐడిబిఐ స్థాపించబడిందని గుర్తు చేశారు. ఐడిబిఐ బ్యాంక్ వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ కోసం రెండవ విడత బిడ్డింగ్‌ను, విధానపరమైన సమస్యలుష వ్యత్యాసాలను పరిష్కరించడానికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) అధికారం కల్పించిన పెట్టుబడుల ఉపసంహరణ కార్యదర్శుల కోర్ (సిజిడి) నిర్దేశించిన విధానం ప్రకారం నిర్వహించినట్లు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపం) ప్రకటించిన మరుసటి రోజు తర్వాత రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.



కశ్మీర్‌లో టెర్రర్ ఫైనాన్సింగ్ నెట్‌వర్క్ గుట్టురట్టు

జైలులోని ఉగ్రవాదులతో లింక్ : 10 మంది అరెస్టు

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్ పోలీసులు శుక్రవారం ఓ భారీ ఉగ్రవాద ఆర్థిక నెట్‌వర్క్‌ను ఛేదించారు. ఉగ్ర కార్యకలాపాల కోసం నిధులు సేకరిస్తూ, వాటిని టెర్రరిస్టులకు చేరవేస్తున్న 10 మంది నిందితులను అరెస్టు చేశారు. షోపియాన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 'వివిధ ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌లలో జరిగిన అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలను గుర్తించాం. దీనితో ఆ ఉగ్రవాదుల ఫైనాన్సింగ్ నెట్‌వర్క్ గుట్టురట్టు అయ్యింది. ఉగ్రకార్యకాలాపాల కోసం సేకరించిన డబ్బు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుందోనే కోణంలో మేము దర్యాప్తు చేశాం. ఈ దర్యాప్తులో వేర్వేరు జైళ్లలో ఉన్న ఉగ్రవాదులతో, వారి అనుచరులతో ఈ నిందితులకు సంబంధాలు ఉన్నట్లు తేలింది. అరెస్టు అయిన వారిలో షోపియాన్‌కు చెందిన ఒవైస్ షఫీ నైకూ (సైద్‌పోరా బాలా), తజాముల్ అహ్మద్ షా (రావల్‌పోరా), మోయిజ్ ఇక్బాల్, ఇమ్దాద్ యూసుఫ్ గని (చిత్రగామ్ కలాన్), పుల్వామాకు చెందిన సాకిబ్ జహూల్ వాని, అమీరర్ అహ్మద్ గని, లియాఖత్ నజీర్ లోన్, ట్రెంచ్ నాడిగుండ్‌కు చెందిన ఫిరదౌస్ తోకర్, కథువా చెక్ హరియాకు చెందిన మహ్మద్ హనీఫ్, కాజు ఉన్నారు. వీరు సామాన్య ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి, నిషేధిత ఉగ్రవాద సంస్థలైన లష్కరే తోయిబా (ఎల్ఇటి), దాని అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్) కార్యకలాపాల కోసం అందిస్తున్నారు. ఇందుకోసం వారు రహస్యంగా ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌లను వాడుతున్నట్లు మా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ నిధులను ఉగ్రవాదులకు అవసరమైన వసతులు కల్పించడానికి, ముఖ్యంగా నెట్‌వర్క్‌లో ఉన్నవారికి స్మార్ట్‌ఫోన్‌లు కోనుగోలు చేయడానికి ఉపయోగించినట్లు తేలింది. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న ఇతరులను గుర్తించడానికి, మిగిలిన టెర్రర్ ఫైనాన్సింగ్ లింక్‌లను కనిపెట్టడానికి, ఈ నెట్వర్క్ ఎంత విస్తృతంగా వ్యాపించి ఉందో గుర్తించడానికి దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. విచారణ ముందుకు సాగే కొద్దీ మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉంది' అని పోలీసులు తెలిపారు

చివరి శ్వాస వరకూ ప్రజాసేవకే పునరంకితం

ప్రధాని మోదీ స్పష్టీకరణ

దేశం సంక్షోభంలో ఉన్నప్పుడు సంతోషిస్తారంటా ప్రతిపక్షాలపై విమర్శలు



భిల్డి : తన చివరి శ్వాస వరకు ప్రజా సేవలో పునరంకితమవుతానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశం సంక్షోభంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలు సంతోషిస్తున్నాయని, పశ్చిమాసియాలో జరుగుతున్న సంఘర్షణల నేపథ్యంలో ఎరువులు, వంట గ్యాస్ లభ్యతపై ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయని ఆయన విమర్శించారు. రైతులు, యువత, మహిళలు 'వికసిత భారత్' (అభివృద్ధి చెందిన భారతం) నిర్మాణానికి కృషి చేస్తున్నారని పేర్కొన్న మోదీ, దేశం సాధిస్తున్న పురోగతిని చూసి కొందరు అసహనానికి గురవుతున్నారన్నారు. గుజరాత్‌లోని బనస్కంతా జిల్లా భిల్డి పట్టణంలో 'భారత్ బోవిన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్' (బిబిబిఆర్‌సి)ని ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. అలాగే రూ. 14,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా, అర్హులైన రైతులకు ఏటా రూ. 6,000 ఆర్థిక సహాయం అందించే 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పథకం కింద 24వ విడత నిధులను కూడా ప్రధాని విడుదల చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ 'దేశం కష్టాల్లో ఉండాలని కోరుకునే వారు కొందరు ఉన్నారు. దేశం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారు నిజంగా ఆనందిస్తారు. దేశానికి ఏదైనా సంక్షోభం ఎదురైనప్పుడల్లా, వారు అందులో సంతోషాన్ని వెతుక్కుంటారు' అని విమర్శించారు. భారత ఇంధన భద్రతకు, ఎరువుల దిగుమతులకు కీలకమైన గల్ఫ్ ప్రాంతంలో జరుగుతున్న సంఘర్షణను ప్రస్తావిస్తూ, యుద్ధం వల్ల తలెత్తిన పరిస్థితులను ఎదుర్కోవడంలో దేశం మొత్తం ఏకమై ఉంటే, కొందరు మాత్రం పుకార్లు సృష్టిస్తూ ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నారని మోదీ పేర్కొన్నారు. ఎరువులు దొరకవని రైతుల మనసుల్లో భయాన్ని నాటారని, కృత్రిమంగా క్యూలను సృష్టించి, ప్రజల్లో ఆందోళన కలిగించారు అని మోదీ ఆరోపించారు. రైతులను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ, యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు, వాటి తయారీకి అవసరమైన రసాయనాల వ్యయం భారీగా పెరిగాయని, అయితే ఆ అదనపు భారం రైతులపై పడకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించిందని తెలిపారు. 'ప్రపంచ మార్కెట్‌లో ఒక బస్తా యూరియా ధర రూ. 3,000 వరకు ఉంది, కానీ భారతీయ రైతులకు అది రూ. 300 కంటే తక్కువ ధరకే అందుతోంది. ఆ బస్తా మీకు (రైతులకు) కేవలం రూ. 300కే అందేలా, ఆ భారాన్ని మొత్తం ప్రభుత్వమే భరించింది' అని ఆయన చెప్పారు. ప్రపంచ మార్కెట్‌లో ఒక బస్తా డైఅమ్మోనియం ఫాస్ఫేట్ (డిఎపి) ఎరువు ధర రూ. 5,000 దాటినప్పటికీ, భారతీయ రైతులకు అది రూ. 1,350కే అందుతోందని ఆయన పేర్కొన్నారు. గత కొన్ని ఏళ్లుగా వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా దేశవ్యాప్తంగా రైతులు రూ. 50 లక్షల కోట్లకు పైగా ప్రయోజనం పొందారని లేదా ఆ మొత్తాన్ని ఆదా చేసుకోగలిగారని మోదీ చెప్పారు. తన ప్రభుత్వం రైతుల సంక్షేమానికి, సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని ఆయన స్పష్టం చేశారు.

పిఎం కిసాన్ నిధులు విడుదల

పిఎం కిసాన్ పథకం 24వ విడత కింద శనివారం సుమారు 10 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 18,000 కోట్లకు పైగా నగదును జమ చేశామని ఆయన తెలిపారు. ఐదు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తూ, 2019 ప్రారంభంలో 'పిఎం కిసాన్' పథకం ప్రారంభమైనప్పటి నుండి చిన్న రైతులకు సుమారు రూ. 4.5 లక్షల కోట్లు నేరుగా బదిలీ చేయబడ్డాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో ఎరువుల ధరలు పెరిగినప్పుడు, రైతులను ఆ భారం నుండి రక్షించేందుకు తన ప్రభుత్వం సుమారు రూ. 16 లక్షల కోట్లు ఖర్చు చేసిందని మోదీ చెప్పారు. గత 12 ఏళ్లలో గోధుమలు, వరి పండించే రైతులకు కనీస మద్దతు ధర విధానం ద్వారా రూ. 24 లక్షల కోట్లు అందాయని ఆయన తెలిపారు. 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన' కింద, గత 10–12 ఏళ్లలో రైతులకు పరిహారంగా రూ. 2 లక్షల కోట్లకు పైగా అందాయని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. 'పిఎం కుసుమ్' పథకం సాగునీటి ఖర్చులను తగ్గించడంలో సహాయపడిందని, దీని కింద దాదాపు 12 లక్షల సోలార్ వాటర్ పంపులను ఏర్పాటు చేశామని మోదీ చెప్పారు. దీనివల్ల రైతులు డీజిల్ ఖర్చులను ఆదా చేసుకోవడమే కాకుండా, విద్యుత్ ఉత్పత్తికి కూడా తోడ్పడుతున్నారని ఆయన తెలిపారు. కేవలం ఈ ఐదు ప్రభుత్వ పథకాల ద్వారానే, దేశంలోని రైతులకు సుమారు రూ. 50 లక్షల కోట్లకు సమానమైన ప్రయోజనం చేకూరిందని, ఇది చాలా భారీ మొత్తమని, రైతుల ఆదాయాన్ని పెంచడానికి దోహదపడిందన్నారు.

'రూ. 500 కోట్ల' ఆడియో క్లిప్ కలకలం

నిజాన్ని అణిచేందుకు బిజెపి, శివసేన కుట్ర

మరాఠా రిజర్వేషన్ల కార్యకర్త మనోజ్ జారంగే ఆరోపణ



జాల్నా : మహారాష్ట్రలో అధికార బిజెపి, శివసేనపై మరాఠా రిజర్వేషన్ల కార్యకర్త మనోజ్ జారంగే మండిపడ్డారు. 'రూ. 500 కోట్ల' ఆడియో క్లిప్ వెనుక ఉన్న నిజాన్ని అణచివేయడానికి ఆ రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఆ రికార్డింగ్ నిజమైనదని, దీనిపై సీనియర్ ఐఎఎస్ అధికారులచే స్వతంత్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. జాల్నా జిలాల్లోని అంకుష్‌నగర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఆడియో క్లిప్‌లో ప్రమేయం ఉన్నవారిని కాపాడటానికి దానిని నకిలీదిగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని జారంగే తన ఆరోపణను పునరుద్ఘాటించారు. గత వారం, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుమారుడైన శివసేన ఎంపి శ్రీకాంత్ షిండే ద్వారా రిజర్వేషన్ల కార్యకర్తకు రూ. 500 కోట్లు చెల్లించడం గురించి బిజెపి నాయకుల మధ్య జర్చలు జరిగిటన్లు ఆడియో క్లిప్‌ను జారంగే విడుదల చేశారు. తన గొంతు నొక్కడానికి, మరాఠా రిజర్వేషన్ల ఉద్యమాన్ని బలహీనపరచడానికి కుట్ర జరుగుతోందని ఆ కార్యకర్త ఆరోపించారు. వివాదాస్పద ఆడియో క్లిప్‌పై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ఈ క్లిప్‌పై లోతైన విచారణ జరిపేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటి)ని ఏర్పాటు చేశారు. 'కొన్ని రోజుల తర్వాత, వారు ఆ క్లిప్‌ను తప్పు అని నిరూపించడానికి ప్రయత్నిస్తారు. వారు నిజాన్ని జీర్ణించుకోలేక నాపై తప్పుడు కథనాన్ని ప్రచారం చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో సంబంధం ఉన్న వ్యక్తులు నన్ను అనుసరిస్తూ, నాకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారు' అని ఆయన ఆరోపించారు. శివసేన నాయకుడు రామ్‌దాస్ కదమ్‌కు అసలైన, పూర్తి రికార్డింగ్ ఎలా లభించిందని ప్రశ్నిస్తూ, ఆ క్లిప్‌ను ఆయనకు ఎవరు ఇచ్చారని, దానిలోని కొంత భాగాన్ని మాత్రమే ప్రజలకు ఎందుకు విడుదల చేశారని జారంగే ప్రశ్నించారు. ఈ విషయంలో బిజెపి, శివసేనలకు ప్రమేయం లేకపోతే, వారు ముందుకు వచ్చి నిజాన్ని బయటపెట్టాలి అని ఆయన అన్నారు. తన ప్రతిష్టను దెబ్బతీయడానికి, మరాఠా రిజర్వేషన్ ఉద్యమానికి నష్టం కలిగించడానికి ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ, సీనియర్ ఐఎఎస్ అధికారులు లేదా న్యాయమూర్తితో కూడిన ఒక సమర్థ సంస్థ ద్వారా విచారణ జరపాలని ఆ కార్యకర్త డిమాండ్ చేశారు.

లాలూ, రబ్రీదేవి, తేజస్విపై అభియోగాల ఖరారు కేసు నవంబరు 19కి వాయిదా

ఐఆర్‌సిటిసి హోటల్స్ కుంభకోణంలో లాలూ కుటుంబంపై ఆరోపణలు

న్యూఢిల్లీ : జాతీయ రాజకీయాలలో కీలక పాత్ర పోషించిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంపై కేసుల ఉచ్చు ఇంకా వీడనంటోంది. ఐఆర్‌సిటిసి హోటల్ కుంభకోణం ఆరోపణలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నమోదు చేసిన కేసులో మాజీ కేంద్ర రైల్వే శాఖ మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన సతీమణి రబ్రీదేవి, కుమారుడు తేజస్వి యాదవ్, ఇతరులపై మనీలాండరింగ్ అభియోగాలను అధికారికంగా నమోదు చేయడాన్ని శుక్రవారం ఢిల్లీ కోర్టు నవంబరు 19వ తేదీకి వాయిదా వేసింది. వాయిదా కోరుతూ దాఖలైన పిటిషన్లను ప్రాసిక్యూషన్ వ్యతిరేకించలేదని గమనించిన ప్రత్యేక న్యాయమూర్తి ప్రశాంత్‌కుమార్ ఈ విచారణను నవంబరు 19కి వాయిదా వేశారు. అయితే, ఉన్నత న్యాయస్థానం యొక్క ఏదైనా ఉత్వర్వు ద్వారా మినహాయింపు పొంది, స్టే ఉత్తర్వులను జారీ చేయడం మినహా, మిగిలిన నిందితులు అందరూ తదుపరి విచారణ తేదీన తప్పనిసరిగా హాజరుకావాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఇడి పేర్కొన్న 16మంది నిందితులలో పూర్వపు కోర్టు సెప్టెంబరు 10న ఏడుగురిని నిర్దోషులుగా విడుదల చేసి, తొమ్మిది మందిపై అభియోగాలు నమోదుచేయాలని ఆదేశించింది. నిందితుడిపై బలమైన అనుమానం ఉందని, అతని న్యాయవాది వాదించినట్లుగా లాలూప్రసాద్‌పై రాజకీయ కక్షతో ఈ ఫిర్యాదు చేశారని, దర్యాప్తు తీరు, సమయం, విధానం సూచించడం లేదని కోర్టు పేర్కొంది. గత అక్టోబరులో జరిగిన ఆరోపిత కుంభకోణానికి సంబంధించిన సిబిఐ కేసులో పూర్వపు కోర్టు ఆర్‌జెడి అధినేతతో పాటు మరో 11మందిపై అవినీతి ఆరోపణలు నమోదు చేసింది. 2005 నుంచి 2014వరకు అప్పటి కేంద్ర రైల్వే శాఖ మంత్రి లాలూప్రసాద్ యాదవ్ పర్యవేక్షణలో రాంచీ, పురిలోని రేడియో హోటళ్ల లీజ్‌ను సుజాత హోటల్స్‌కు అప్పగించేందుకు రైల్వే అధికారులు ఒక టెండర్‌ను తారుమారు చేశారని ఇడి ఆరోపించింది. ప్రతిఫలంగా, సుజాత హోటల్స్ డైరెక్టర్లు అయిన వినయ్ కొచ్చర్, విజయ్ కొచ్చర్, లాలూ ప్రసాద్ యాదవ్‌కు సన్నిహితుడైన ప్రేమ్‌చంద్ గుప్తా, సరళా గుప్తా నియంత్రణలో ఉన్న డిఎంసిపిఎల్ అనే కంపెనీకి తమ విలువైన భూమిని తక్కువ ధరకు బదిలీ చేశారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది. ఇడి ప్రకారం...సరళా గుప్తా, ఇతరులు ఆ తర్వాత ఈ కంపెనీ షేర్లను లాలూ ప్రసాద్‌యాదవ్ సతీమణి రబ్రీదేవి, కుమారుడు తేజస్వీయాదవ్‌లకు చాలా తక్కువ ధరలకు బదిలీ చేశారు. దాదాపు ఉచితంగా లభించిన భూమిని నియంత్రించిన కొత్త సంస్థ పేరు లారా ప్రాజెక్ట్స్ ఎల్ఎల్‌పి.



ర్యాలీని వాయిదా వేయండి

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి సిటిఐ చైర్మన్ లేఖ

ర్యాలీ వల్ల రూ. 12 వేల కోట్ల వ్యాపారం దెబ్బతింటుందని ఆందోళన

న్యూఢిల్లీ: ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న ఇండియా కూటమి తలపెట్టిన 'చలో ఢిల్లీ' ర్యాలీని వాయిదా వేయాలని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సిటిఐ) కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి లేఖ రాసింది. దేశ రాజధానిలోని 20 ప్రధాన మార్కెట్లలో వ్యాపారానికి అంతరాయం ఏర్పడి, రూ. 10,000–12,000 కోట్ల విలువైన వ్యాపారం దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ, ర్యాలీని దీపావళి తర్వాత వరకు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా సోనియా గాంధీకి రెండు సూచనలు చేసింది... ర్యాలీని నవంబర్ 10–11 లేదా ఆ తర్వాత వరకు వాయిదా వేయడం, లేదా వేదికను రామ్‌లీలా మైదాన్ నుండి బురారీ గ్రౌండ్‌కు మార్చడం వంటి చర్యలకు తీసుకోవాలని కోరింది. బురారీ గ్రౌండ్ వద్ద సుమారు 15,000 వాహనాలకు పార్కింగ్ స్థలం ఉందని ఆ సంఘం పేర్కొంది. ర్యాలీ సమయాన్ని పునఃపరిశీలించమని కోరుతూ తమ సంస్థ గతంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి మూడు లేఖలు రాసిందని, అయితే ఇప్పుడు తమ విజ్ఞప్తితో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీని సంప్రదించిందని గోయల్ తెలిపారు. 10 లక్షల మంది రావచ్చని అంచనా వేస్తున్న ఈ ర్యాలీ, పండుగల ఉధృత సీజన్‌లో సెంట్రల్, ఓల్డ్ ఢిల్లీలోని హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో రూ. 10,000–12,000 కోట్ల విలువైన వ్యాపారాన్ని ప్రభావితం చేయగలదని సోనియా గాంధీకి రాసిన లేఖలో వ్యాపారుల సంఘం పేర్కొంది. అయితే తాము ర్యాలీని వ్యతిరేకించడం లేదని, దాని సమయం గురించి ఆందోళన చెందుతున్నామని సిటిఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ అన్నారు. ఎందుకంటే ధంతేరస్ నవంబర్ 6న, దీపావళి నవంబర్ 8న వస్తున్నాయన్నారు. 'దీపావళి సన్నాహాలకు నవంబర్ 1 చాలా కీలకమైన రోజు. ఒకవేళ 10 లక్షల మంది, 15,000–20,000 వాహనాలు సెంట్రల్ ఢిల్లీలోకి ప్రవేశిస్తే, 20 ప్రధాన మార్కెట్లలో వ్యాపారం స్తంభించిపోవచ్చు' అని ఆయన అన్నారు. జెఎల్ఎన్ మార్గ్, బహదూర్ షా జఫర్ మార్గ్, నేతాజీ సుభాష్ మార్గ్‌తో సహా పలు ప్రధాన రహదారులపైకి వాహనాలు వ్యాపించే అవకాశం ఉందని, దీనివల్ల మధ్య, పాత ఢిల్లీలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడవచ్చని పేర్కొన్నారు. 'అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీలలో సెంట్రల్ ఢిల్లీలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడితే, ధంతేరస్ సరుకులు మార్కెట్లకు ఎలా చేరుతాయోనని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు' అని ఆయన అన్నారు.

సిబిఐ అధికారుల పేరుతో... రూ.78 లక్షలకు టోకరా

ఉత్తరప్రదేశ్: పదవీ విరమణ పొందిన అకౌంట్స్ అధికారిని మోసం చేసి సైబర్ నేరగాళ్లు రూ.78 లక్షలను దొంగిలించారు. అతనిని దాదాపు నెల పాటు డిజిటల్ అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు.నిందితులు సిబిఐ, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులుగా నటిస్తూ బాధితుడిని బెదిరించారు. సైనిక అధికారులతో రహస్య సమాచారాన్ని పంచుకున్నారంటూ ఆయనపై ఆరోపించినట్లు వెల్లడించారు. బాధితుడు రాజ్‌కుమార్ శ్రీవాస్తవ (సుభాష్‌నగర్ నివాసి)కు సెప్టెంబర్ 22న వాట్సాప్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి తనను తాను సిబిఐ అధికారినని పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత మరో వ్యక్తి కూడా ఫోన్ చేసి తాను మరో విచారణ అధికారినని చెప్పాడు.నిందితులు అరెస్టు చేస్తామని, మనీలాండరింగ్ కేసులు నమోదు చేస్తామని బెదిరించారు. చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోవాలంటే వివిధ బ్యాంకు ఖాతాలకు డబ్బులు బదిలీ చేయాలని ఒత్తిడి చేశారు. దీనిలో శ్రీవాస్తవ తన పంజాబ్ నేషనల్ బ్యాంకు ఖాతా నుంచి రూ.50 లక్షలు, ఇండియన్ బ్యాంకు ఖాతా నుంచి రూ.18 లక్షలు బదిలీ చేశారు. మరో రూ.10 లక్షలు పంపినట్లు గుర్తించారు.

మహిళా సంఘాల నిరసన విరమణ

అన్ని డిమాండ్లు అంగీకరించి ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు వారం గడవు కోరిన ప్రభుత్వం : వాంగ్‌చుక్



లేహ్/జమ్ము : కేంద్రపాలిత ప్రాంత అధికారం యంత్రాంగం తీసుకువచ్చిన మద్యం విధానానికి వ్యతిరేకంగా లధాఖ్‌లోని మహిళా సంఘాలు చేపట్టిన నిరసనను విరమించుకున్నాయని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తెలిపారు. తమ డిమాండ్లన్నింటికీ ప్రభుత్వం అంగీకరించి, ఒప్పందాన్ని అధికారికంగా ఖరారు చేయడానికి వారం రోజుల సమయం కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన మద్యం విధానాన్ని పూర్తిగా వెనక్కి తీసుకోవాలని, లధాఖ్‌ను సంపూర్ణ మద్యపాన కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, గత వారం లధాఖ్‌లో మహిళల నేతృత్వంలో నిరసనలు ప్రారంభమయ్యాయి. కేంద్రపాలిత ప్రాంత అధికార యంత్రాంగం అన్ని డిమాండ్లకు అంగీకరించి, ఒప్పందాన్ని ఖరారు చేయడానికి వారం రోజుల సమయం కోరిన తర్వాత, లధాఖ్ మహిళా నాయకులు మద్యంపై తమ నిరసనను విరమించుకున్నారు. వ్యవస్థపై వారికున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని గౌరవిస్తారని ఆశిద్దాం'అని వాంగ్‌చుక్ గురువారం ఎక్స్‌లో పేర్కొన్నారు. కేంద్రపాలిత ప్రాంత అధికార యంత్రాంగం నుండి లిఖితపూర్వక హామీ లభించడంతో, అక్టోబర్ 29 నుండి నవంబర్ 5 వరకు తలపెట్టిన తమ ధర్నాను ఈ నాలుగు సంఘాలు గురువారం విరమించుకున్నాయి. లధాఖ్ బౌద్ధ సంఘం మహిళా విభాగం, అంజుమన్–ఎ–ఇమామియా మహిళా విభాగం, అంజుమన్ మొయిన్–ఉల్ఇస్లాం మహిళా విభాగం, క్రైస్తవ సమాజ మహిళా విభాగం ఈ మద్యం విధానాన్ని వ్యతిరేకించాయి.

SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

S.No	VEHICLE NO	Customer Name	MAKE & MODEL	YEAR
1	TS24T 2124	Azeem Mohammad	TATA ACE	2017
2	TG24A 3616	Ajmeera Srinibabu	KUBOTA MU 4501	2024
3	TS03EM 1089	Naresh Bhukya	MAHINDRA 575 DI	2015
4	TS26C 9082	Madharapu Santhosh	JOHN DEERE 5310 HARVESTER	2020
5	TS24B 7480	Mahesh Vankudothu	SWARAJ 843 XM	2018
6	TG24A 0689	Bontha Ravinder	SWARAJ 744 XM	2024
7	TS24D 9143	Naresh Gajula	BALENO ZETA 1.3L DIESEL 5 SEATER	2020
8	TS28E 3054	Mounika Jatoth	JOHN DEERE 5310 HARVESTER	2018
9	TS36G 0823	Raju Satla	JOHN DEERE 5310 HARVESTER	2020

AUCTION DATE : 31-10-2026

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
H.No:4-61/A/1, 1st floor, Above More Super Market, Beside Jayalaxmi Center Narsampet 506132 Cell : 9000230006 & 9652764787

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
31-10-2026
www.prajapaksham.in

దేశ సమగ్రత, సమైక్యతకు పనిచేసిన ధీశాలి ఇందిరాగాంధీ





ప్రజాపక్షం/హైదరాబాద్: దేశ సమగ్రత, సమైక్యత, పటిష్టత కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన ధీశాలి, మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కొనియాడారు. తన రక్తంలోని ప్రతి బొట్టు దేశ బలోపేతానికి ఉపయోగపడాలని ప్రకటించిన గొప్ప దేశభక్తురాలు ఇందిరాగాంధీ అని సిఎం స్మరించుకున్నారు. ఆమె ఆశయాలు, ప్రజా సంక్షేమ విధానాలు నేటికీ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని సిఎం తెలిపారు. ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె దేశానికి చేసిన సేవలను ముఖ్యమంత్రి ఒక సందేశంలో గుర్తు చేసుకున్నారు. దేశం ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా ధైర్యంగా నిర్ణయాలు తీసుకున్న నాయకురాలని సిఎం కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రతకు ముప్పు వాటిల్లకుండా తన ప్రాణాలనే పణంగా పెట్టి పనిచేశారని కొనియాడారు. పదవుల కంటే దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చిన నాయకత్వం ఆమెదని పేర్కొన్నారు. బ్యాంకుల జాతీయీకరణ, రాజ భరణాల రద్దు, 20 సూత్రాల కార్యక్రమం వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో దేశ ఆర్థిక, సామాజిక రంగాల్లో ఇందిరాగాంధీ కీలక మార్పులకు శ్రీకారం చుట్టారని సిఎం తెలిపారు. ముఖ్యంగా పేదలు, బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందించాలనే లక్ష్యంతో ఆమె అమలు చేసిన కార్యక్రమాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని సిఎం అన్నారు. సామాన్యులకు ఆర్థిక భద్రత కల్పించడం, పేదలకు అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించడం ఇందిరాగాంధీ పాలనలో ముఖ్యమైన అంశాలని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇందిరాగాంధీ చూపిన సంక్షేమ పాలన, సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతి మార్గంలోనే తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

భూటాన్‌లో ఆకస్మిక వరదలు..
పశ్చిమ బెంగాల్, అసోంకు హెచ్చరికలు




థింపూ (భూటాన్) : వాయువ్య భూటాన్‌లోని గాసా జిల్లాలో ఉన్న షింటాపు సరస్సు వద్ద హిమనీనద సరస్సు కట్ట తెగిపోవడంతో భారీగా వరద నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తోంది. దీనితో పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లోని భూటాన్ సరిహద్దు ప్రాంతాలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. ఈ వరదల కారణంగా గాసా జిల్లాలోని మోచూ నది ఒడ్డున ఉన్న ప్రముఖ సహజ వేడి నీటి బుగ్గల ప్రాంతమైన గాసా షాచు పూర్తిగా దెబ్బతింది. అయితే ముందస్తుగానే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. మోచూ నది పుట్టుక ప్రాంతంలో ఉన్న షింటాపు సరస్సు భూటాన్‌లో ప్రమాదకరంగా పరిగణిస్తున్న 17 హిమనీనద సరస్సుల్లో ఒకటి. గతంలో 2021 ఆగస్టు 26న కూడా మో చూ నదిలో భారీగా వరద నీరు ప్రవహించడంతో గాసా షాచు ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. ఆ సమయంలో నది తన ప్రవాహ మార్గాన్ని మార్చుకుని వేడి నీటి బుగ్గల ప్రాంతం వైపు ప్రవహించింది. ప్రస్తుతం వరద నీరు పునాఖా ప్రాంతంలోని కబేసా గెవోగ్ పరిధిలో ఉన్న శ్రీగాంగ్ ప్రాంతాన్ని దాటింది. ఈ ప్రాంతం పునాఖా జోంగ్‌కు సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇలావుంటే, వరదలపై పశ్చిమ బెంగాల్, అసోం ప్రభుత్వాలను భూటాన్ ప్రభుత్వం అప్రమత్తం చేసింది. భూటాన్ సరిహద్దుకు సమీపంలోని జిల్లాలకు ఆకస్మిక వరదల ముప్పు ఉందని హెచ్చరించింది. అసోంలోని ధుబ్రి, పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ కొండ ప్రాంతాలు, అలీపుర్దువార్, జల్పాయిగురి జిల్లాలు ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలుగా గుర్తించారు. పశ్చిమ బెంగాల్‌లోని కూచ్బెహార్ జిల్లాలో సంకోష్ నది ఒడ్డున నివసించే ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఉత్తర భూటాన్‌లో పుట్టే ఈ నది, మోచూ, ఫో చూ వంటి ఎగువ ప్రాంత నదుల సంగమంతో ఏర్పడి, చివరకు అసోంలో బ్రహ్మపుత్ర నదిలో కలుస్తుంది. భూటాన్‌లోని పునాఖా ప్రాంతంలో గుమాగెవోగ్ పరిధిలో ఉన్న దోచుఖాజోమ్లింగ్తాంగ్ రిట్సా ప్రాంతంలో ఈ ఏడాది ప్రారంభంలో ఏర్పాటు చేసిన సౌరశక్తి ఆధారిత సాగునీటి పంపింగ్ వ్యవస్థ కూడా వరదలకు సాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. మో చూ నదిలో గత రాత్రి వచ్చిన ఆకస్మిక వరదల కారణంగా ఈ సౌర సాగునీటి ప్రాజెక్టు దెబ్బతిన్నట్లు అధికారిక ప్రకటనలో వివరించారు. స్థానిక నాయకుడి సమాచారం ప్రకారం, ప్రస్తుతం ఈ వ్యవస్థ పనిచేయడం లేదు. అయితే నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు ఇంకా అంచనా వేయాల్సి ఉంది. అంతేకాకుండా, వరద నీటితో కొట్టుకొచ్చిన మట్టి, రాళ్లు, ఇతర వ్యర్థాలు జోమ్లింగ్‌తాంగ్ ప్రాంతంలోని పునాఖాగాసా జాతీయ రహదారిలోని కొంత భాగాన్ని కప్పేశాయి. దీంతో రహదారి రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది.

భారత జల సంఘం హెచ్చరికలు

భారత కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి) వరద అంచనా పర్యవేక్షణ విభాగం పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్దువార్, అసోంలోని ధుబ్రి జిల్లాలకు ప్రత్యేక హెచ్చరికలు జారీ చేసింది. రానున్న కొన్ని గంటల్లో ఈ రెండు జిల్లాల్లో నదుల నీటిమట్టాలు అకస్మాత్తుగా పెరిగే అవకాశం ఉందని కేంద్రం హెచ్చరించింది. భూటాన్‌లోని పునాత్సాంగ్చు ఎగువ ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించినట్లు సమాచారం అందిందని, భారతదేశంలో ఈ నది సంకోష్ పేరుతో ప్రవహిస్తుందని కేంద్ర జల సంఘం తెలిపింది. 'ఎగువ ప్రాంతాల్లో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్దువార్, అసోంలోని ధుబ్రి జిల్లాల్లో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. వరద నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తూ ఆరు నుంచి ఎనిమిది గంటల్లో భారత సరిహద్దుకు చేరుకోవచ్చు. దీనివల్ల ఈ రెండు జిల్లాలపై ప్రభావం పడవచ్చు' అని కేంద్రం జారీ చేసిన ప్రత్యేక హెచ్చరికలో పేర్కొంది. ఈ రెండు జిల్లాల్లోని స్థానిక అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కేంద్ర జల సంఘం సూచించింది.

ఇజ్రాయెల్ తదుపరి ప్రధాని ఎవరు?


• ప్రభుత్వ ఏర్పాటు విఫలమైతే వచ్చే ఏడాది మళ్లీ ఎన్నికలు



టెల్ అవీవ్: ఇజ్రాయెల్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. కొత్త పార్లమెంట్ కూర్పు స్పష్టమైనప్పటికీ, తదుపరి ప్రధానమంత్రి ఎవరనేది ఇంకా తేలలేదు. 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంట్ (నెస్సెట్)లో నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ కూటమికి 53 స్థానాలు, ప్రతిపక్ష కూటమికి 48 స్థానాలు లభించాయి. మిగిలిన 19 స్థానాలను అరబ్ పార్టీలైన రామ్ (11), జాయింట్ లిస్ట్ (8) గెలుచుకున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు కనీసంగా 61 మంది సభ్యుల మద్దతు అవసరం. మంగళవారం జరిగిన ఎన్నికల్లో 77.9 శాతం పోలింగ్ నమోదైంది. దశాబ్దాల కాలంలో ఇదే అత్యధిక పోలింగ్‌గా కేంద్ర ఎన్నికల కమిటీ వెల్లడించింది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సాధారణ మెజారిటీ కోసం మద్దతు కూడగట్టేందుకు రాజకీయ పార్టీలు కీలక చర్చలు ప్రారంభించనున్నాయి. ప్రస్తుత ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన ప్రధాన ప్రత్యర్థి, మాజీ సైనికాధికారి గాడి ఐసెన్కోట్ నేతృత్వంలోని కూటములేవీ సాధారణ మెజారిటీ కూడా సాధించలేకపోయాయి. దీనితో, చారిత్రాత్మకంగా 19 స్థానాలు గెలుచుకున్న అరబ్ పార్టీల మద్దతు ప్రభుత్వ ఏర్పాటులో కీలకం కానుంది. ఈ తరుణంలో, అనేకానేక కూర్పులు, సాధ్యాసాధ్యాల చర్చ జోరందుకుంది. అరబ్ పార్టీలతో కలిసి ఐసెన్కోట్ 67 స్థానాల బలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. అయితే ఇజ్రాయెల్ యూదుల గుర్తింపుకు ఇది ముప్పు అంటూ నెతన్యాహు ఇప్పటికే విమర్శిస్తున్నారు. దీంతో ఐసెన్కోట్‌కు రాజకీయంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. మరోవైపు, నెతన్యాహు ఐసెన్కోట్‌తో కలిసి ఐక్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించవచ్చు. అయితే 2023 అక్టోబర్ 7న హమాస్ దాడిని అడ్డుకోవడంలో భద్రతా వైఫల్యాలకు నెతన్యాహునే బాధ్యుడిగా పేర్కొంటూ ఆయనతో కలిసి పనిచేయబోమని ఐసెన్కోట్ గతంలో ప్రకటించారు. నెతన్యాహు అవినీతి కేసు కూడా ఈ చర్చలకు అడ్డంకిగా మారవచ్చు. ఇంకోవైపు, నెతన్యాహు ప్రతిపక్షంలోని కొందరు నాయకులను తనవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే ఆయనతో విభేదాలున్న నాయకులు ఇందుకు అంగీకరించడం కష్టమే. ఏ కూటమికీ మెజారిటీ లభించకపోతే వచ్చే ఏడాది ప్రారంభంలో మళ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. అప్పటివరకు నెతన్యాహు ప్రభుత్వం ఆపద్ధర్మ ప్రభుత్వంగా కొనసాగుతుంది. 2019లోనూ ఇలాంటి ప్రతిష్టంభన ఏర్పడి మూడున్నరేళ్లలో ఇజ్రాయెల్ ఐదుసార్లు ఎన్నికలను ఎదుర్కొంది. ఇలావుంటే, ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, ఓటర్లను ప్రలోభపెట్టారని, బెదిరింపులు, హింస, ఒకటి కంటే ఎక్కువసార్లు ఓటు వేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని నెతన్యాహు పార్టీ ఆరోపించింది. అయితే ఎన్నికలు చట్టబద్ధంగా, పారదర్శకంగా జరిగాయని కేంద్ర ఎన్నికల కమిటీ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ డీన్ లివ్నే స్పష్టం చేశారు. వ్యవస్థాగతంగా ఎన్నికల అక్రమాలు జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. విదేశీ జోక్యంపై జరుగుతున్న దర్యాప్తు కూడా ఎన్నికల ఫలితాలను మార్చబోదని పేర్కొన్నారు.

ఒలెష్కీ చేరుకున్న రష్యా, ఉక్రేన్ అధికారులు

• మానవతా సహాయక చర్యల నేపథ్యం



ఖెర్సన్ (ఉక్రేన్) : అరుదైన కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో మానవతా సహాయక చర్యలు చేపట్టేందుకు రష్యా, ఉక్రేన్ అధికారులు శుక్రవారం యుద్ధంతో తీవ్రంగా దెబ్బతిన్న ఒలెష్కీ నగరం చేరుకున్నారు. స్థానిక రహదారుల్లో మందుపాతరలు, పేలుడు పదార్థాలను తొలగించిన అనంతరం సహాయక చర్యలు ప్రారంభించినట్లు ఈ ఆపరేషన్ ప్రధాన సమన్వయకర్తలు రష్యాకు చెందిన యానా లాంత్రటోవా, ఉక్రేన్‌కు చెందిన డిమిత్రో లుబినెట్స్ ప్రకటించారు. నగరాన్ని విడిచిపెట్టి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలనుకునే ప్రజలు బస్సుల్లో బయలుదేరుతున్నారని యానా లాంత్రటోవా రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ టాస్ విడుదల చేసిన వీడియోలో తెలిపారు. నగరంలోనే ఉండిపోవాలనుకునే వారికి అవసరమైన ఆహారం, ఇతర మానవతా సహాయాన్ని అందించనున్నట్లు వెల్లడించారు.

'సమగ్రాభివృద్ధి ప్రణాళిక'

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించి, నెలవారీ పురోగతిని నమోదు చేయాల్సి ఉంటుంది. 'తెలంగాణ రైజింగ్2047'లో భాగంగా నిర్దేశించుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యానికి అనుగుణంగా, గ్రామీణ వ్యవసాయ,ఆర్థిక వ్యవస్థ (రేర్)ను పటిష్టం చేయడమే ధ్యేయంగా ఈ ప్రణాళికను అమల్లోకి తీసుకొచ్చినట్టు మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.

పర్యవేక్షణకు ప్రత్యేక డ్యాష్‌బోర్డ్, వెబ్‌సైట్..

కేంద్ర పంచాయతీరాజ్ శాఖకు చెందిన జిపిడిపి , వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) కింద రూపొందించే పనులన్నింటినీ జిపిఎస్‌పీతో అనుసంధానం చేస్తారు. అన్ని శాఖల సమన్వయంతో పనులు జరిగేలా చూస్తారు. పారదర్శక పాలన కోసం ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేక వెబ్‌సైట్, అభివృద్ధి పనుల నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక డ్యాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేయనున్నారు.

తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు...

గ్రామ పంచాయతీ అడిగిన వివరాలను అందించకపోయినా, కావాలని తప్పుడు సమాచారాన్ని సమర్పించినా సంబంధిత ఉద్యోగులు, అధికారులపై తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం2018 లోని సెక్షన్ 135 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నిబంధనల్లో స్పష్టం చేసింది. ప్రతీ నెలా ఇంటింటి సమాచారాన్ని సేకరించి రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు, ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు కంప్యూటరీకరించాలి. ఎంపిఒ, పంచాయతీరాజ్ ఎఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, సెర్ప్ ఏపిఎం, ఉపాధి హామీ ఎపివోలు సమాచార నమోదును పరిశీలించి, తుది నివేదికపై సంతకాలు చేయాలి. మొత్తం ప్రక్రియకు ఎంపిడిఓ పూర్తి బాధ్యత వహిస్తారు.

క్రమశిక్షణకు ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఈ సందర్భంగా పార్టీ అంతర్గత క్రమశిక్షణను మరింత కఠినతరం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. 2012లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిన్‌పింగ్ తన పాలనలో విధేయతకు, అవినీతి వ్యతిరేక చర్యలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే పార్టీలో క్రమశిక్షణ ఉల్లంఘనలు ఇంకా కొనసాగుతున్నాయని పార్టీ అధికారులు శుక్రవారం అంగీకరించారు. 'దుష్ప్రవర్తన, క్రమశిక్షణ ఉల్లంఘనలకు సంబంధించిన సమస్యలు నిరంతరం కొనసాగుతున్నాయి. అవి వ్యవస్థలో లోతుగా పాతుకుపోయి, మళ్లీ మళ్లీ చోటుచేసుకుంటున్నాయి. వాటిని పరిష్కరించడానికి దీర్ఘకాలం పాటు ఏమాత్రం వెనుకడుగు వేయని నిబద్ధత అవసరం' అని కేంద్ర క్రమశిక్షణ తనిఖీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ జాంగ్ ఫుహై తెలిపారు. ప్లీనరీ సమావేశ నిర్ణయాలపై వివరించేందుకు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జిన్‌పింగ్ పార్టీ నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన 18వ జాతీయ పార్టీ కాంగ్రెస్ నుంచి ఇప్పటివరకు క్రమశిక్షణ, పర్యవేక్షణ సంస్థలు 81 లక్షల కేసులను నమోదు చేసి, 79 లక్షల మందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నాయని జాంగ్ వెల్లడించారు. వీరిలో పార్టీ కేంద్ర నాయకత్వం నేరుగా పర్యవేక్షించే 963 మంది సీనియర్ అధికారులు కూడా ఉన్నారు.

అవినీతికి పాల్పడిన అధికారులపై శిక్షలు కొనసాగుతాయని, అవి మరింత కఠినంగా ఉంటాయని పార్టీ అధికారులు స్పష్టం చేశారు. 'అవినీతికి పాల్పడిన అధికారులను కఠినంగా శిక్షించడం ద్వారా నిజాయితీగా పనిచేసే అధికారులను ప్రోత్సహించడమే కాకుండా వారికి రక్షణ కల్పించినట్లవుతుంది' అని పార్టీ కేంద్ర సంస్థాగత విభాగం డిప్యూటీ హెడ్ హువాంగ్ జియాన్హా వ్యాఖ్యానించారు. ఆచరణలో కొంతమంది పార్టీ సభ్యులు, అధికారులు వివిధ కారణాలతో తమ బాధ్యతలను నిర్వర్తించడం లేదని లేదా వాటిని అమలు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కొందరిలో పనిచేయాలనే ఆసక్తి, ప్రేరణ లేకపోగా, మరికొందరు ఇబ్బందుల్లో పడతామనే భయంతో నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారని వివరించారు. ఇంకొందరికి సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన నైపుణ్యాలు లేవని అన్నారు. హాంకాంగ్ సిటీ యూనివర్సిటీలో పబ్లిక్ అండ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ విభాగం ప్రొఫెసర్ డాంగ్షు లియు అభిప్రాయం ప్రకారం, సీనియర్ అధికారులను పార్టీ నుంచి బహిష్కరించడం అనేది ముఖ్యంగా సైనిక వ్యవస్థపై నియంత్రణను మరింత బలోపేతం చేయడానికి జిన్‌పింగ్ చేస్తున్న ప్రయత్నాలను ప్రతిబింబిస్తోంది. గతంలో కూడా విధేయతపై అనుమానాలు లేదా తీవ్రమైన అవినీతి ఆరోపణల కారణంగా జిన్‌పింగ్ పలువురు అధికారులను తొలగించారు. పాలనాపరమైన అంశాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, క్రమశిక్షణ, అవనీతి రహిత వ్యవస్థల కోసం జిన్‌పింగ్ కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే నిబంధనలను మరింత కఠినతరం చేశారని పరిశీలకులు అంటున్నారు.

రూ.66 మించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లోని బేగంబజార్, నాంపల్లి, మహారాజ్‌గంజ్ వంటి ప్రధాన బియ్యం మార్కెట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మార్కెట్లో ధరలు స్థిరపడే వరకు తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజల అవసరాలకు సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయని, కొరత వస్తుందనే భయంతో అవసరానికి మించి కొనుగోలు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సన్న బియ్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం వ్యాపారం చేసే వారితో చర్చలు కొనసాగిస్తూనే, అక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

దేశవ్యాప్త సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నించడం అన్యాయమన్నారు.

రూ.30 వేల కోట్ల ఆస్తులు రూ.8,800 కోట్లకే మదింపు

ఐడిబిఐకి దేశవ్యాప్తంగా 2,100 శాఖలు, 3 వేల ఏటిఎంలతో పాటు భారీ స్థిరాస్తులు ఉన్నాయని అనిల్ కుమార్ తెలిపారు. హైదరాబాద్ లోనే సుమారు 50 ఎకరాల భూమి, అంతర్జాతీయ శిక్షణ సంస్థ, 200 అపార్ట్‌మెంట్లు ఉన్నాయని చెప్పారు. సతారాలో 100 ఎకరాల శిక్షణ సంస్థ, ముంబైలో ప్రధాన కార్యాలయంతో పాటు దేశవ్యాప్తంగా సిబ్బంది కోసం సుమారు 2,250 అపార్ట్‌మెంట్లు ఉన్నాయని వివరించారు. ఈ స్థిరాస్తుల మార్కెట్ విలువ సుమారు రూ.30 వేల కోట్లు ఉంటుందని, అయితే విక్రయ మదింపులో కేవలం రూ.8,800 కోట్ల బుక్ వాల్యూనే పరిగణనలోకి తీసుకున్నారని ఆరోపించారు. బ్యాంకు షేరు విలువను తొలుత రూ.110గా నిర్ణయించి, అనంతరం రూ.95కు తగ్గించారని, చివరకు కెనడా దేశానికి చెందిన ఫెయిర్ ఫాక్స్ సంస్థతో రూ.75.99కు ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. స్థిరాస్తులు, బ్యాంకు మొత్తం విలువను పరిగణనలోకి తీసుకుంటే సుమారు రూ.55 వేల కోట్ల మేర నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీకి ఉన్న వాటాల్లో 60.72 శాతాన్ని ఫెయిర్ ఫాక్స్ సంస్థకు రూ.8,800 కోట్లకు విక్రయించేందుకు నిర్ణయించారని పేర్కొన్నారు.

లాభాల్లోకి వచ్చిన బ్యాంకును ఎందుకు అమ్మాలి?

2018 19లో రూ.15,116 కోట్ల నష్టాల్లో ఉన్న ఐడిబిఐ బ్యాంకు ఉద్యోగుల కృషితో తిరిగి లాభాల బాట పట్టిందని తెలిపారు. 2025 26లో రూ.9,513 కోట్ల లాభాన్ని సాధించిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే సుమారు రూ.4,400 కోట్ల లాభాన్ని ఆర్జించిందని వివరించారు. బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.6.27 లక్షల కోట్లుగా ఉందని, డిపాజిట్లు రూ.3.56 లక్షల కోట్లు, అడ్వాన్సులు రూ.2.71 లక్షల కోట్లుగా ఉన్నాయని చెప్పారు. బ్యాంకులో సుమారు 20 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో 9,500 మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలతో పాటు దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. ప్రైవేటీకరణ అనంతరం ఉద్యోగ భద్రత, వేతనాలు, పెన్షన్ ప్రయోజనాలు, రిజర్వేషన్ల పరిస్థితిపై కేంద్రం స్పష్టమైన హామీ ఇవ్వలేదని విమర్శించారు. నవంబర్ 2, 3 తేదీల్లో జరిగే సమ్మెకు ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్(యుఎఫ్‌బియు)తో పాటు కాంగ్రెస్, వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించారని, ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే నిరాహార దీక్షలో ఉద్యోగులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐబిఓఎ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ కె. మురళి, కార్యదర్శి సీతారామ్, ఎపి, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షుడు సోమసుందర్, కమిటీ సభ్యుడు విఠల్ రావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. దాదాపు రూ. 50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెల్లడించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు తెలంగాణ ప్రజల తరఫున సిఎం కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్‌లోని ఆ భూములను రక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు సిఎం చెప్పారు. వనరుల సమీకరణ కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఈ భూముల విక్రయం, తద్వారా వచ్చే నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై అధ్యయనం చేస్తుందని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రధానంగా దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి, నిరుపేదలకు విద్యను అందించడానికి, ఇందిరమ్మ ఇండ్లు, నీటిపారుదల ప్రాజెక్టులు, ఇతర ప్రయోజనాల కోసం ఖర్చు చేస్తామని సిఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం సాధించుకున్న భూములను ఇలాగే వదిలేస్తే అవి అన్యాక్రాంతమయ్యే ప్రమాదం పొంచి ఉన్నందున ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని సిఎం వెల్లడించారు. ప్రభుత్వం రక్షించిన భూముల్లో అటవీ శాఖకు చెందిన భూములను ఆ శాఖకు, అలాగే రెవెన్యూ శాఖకు చెందిన భూములను రెవెన్యూకు అప్పగిస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్ చుట్టూ, అలాగే రాష్ట్రంలోని విలువైన భూములను కొల్లగొట్టాలన్న ప్రయత్నాలు జరిగాయన్నారు. కాలనీల ముసుగులో రంగారెడ్డి మియాపూర్ 100, 101 కలిసి 550 ఎకరాల సర్కారు పోరంబోకు భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు, పెట్టుబడిదారులు కబ్జా చేయాలని చూశారని సిఎం ఆరోపించారు. గత మూడేళ్లుగా నిరంతరం న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతూ, ఈ భూములను రక్షించాలని న్యాయస్థానంలో ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించి రూ. 50 వేల కోట్ల ఆస్తులను కాపాడగలిగామన్నారు. ధరణి ముసుగులో, రెవెన్యూ రికార్డులను తారుమారు చేయడం, ప్రభుత్వ భూములను భూకబ్జాదారులు ఆక్రమించుకునే విధంగా అధికారులపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా కొల్లగొట్టడానికి ప్రయత్నాలు జరిగాయని సిఎం అన్నారు. ''మాజీ మంత్రి హరీష్ రావు మామ హనుమంత రావు కబ్జా పెట్టిన భూములు సర్వే చేయకుండా అధికారులను అడ్డుకుంటున్నారు. కోర్టు కు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. భూముల ఆక్రమణపై బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అనేక తప్పుడు ఆరోపణలు చేశారు. శాసనసభలో చర్చించి చర్యలకు దిగితే తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారు. మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే ఎందుకు బిఆర్ఎస్ నాయకులు స్పందించడంలేదు. కనీసం రెవెన్యూ అధికారులను ఎందుకు బిఆర్ఎస్ నాయకులు అభినందించడం లేదు. పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై ఉమ్మడి రాష్ట్రంలో కేసులు వేసిన కెసిఆర్, హరీష్‌రావు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు వాటిని స్వాధీనం చేసుకోలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరి పై కేసులు వేశారో వారితో కెసిఆర్, హరీశ్ రావు లాలూచీ పడ్డారు. మియాపూర్ భూములపై ఇప్పటికైనా వారు కుట్రలు మానాలి. రెండు గ్రామాల మధ్య వివాదాన్ని కెసిఆర్ తనకు అనుకూలంగా మలచుకున్నారు. అక్కడి ఆక్రమణలను తేల్చి శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ నిర్మిస్తాం. కెసిఆర్, కెటిఆర్ ఇప్పటికైనా బుద్ధి మార్చుకుని, ఆక్రమణలు చేయడం మానుకోవాలి. వారి ఆక్రమణలకు వ్యతిరేకంగా కోర్టులు తీర్పులు ఇస్తున్నాయి'' అని సిఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు.

న్యాయపోరాటంతో భూముల ఆక్రమణను అడ్డుకున్నాం

''ఐఎంజి భూములను కొట్టేయాలని ప్రయత్నం జరిగితే న్యాయపోరాటంతో అడ్డుకోగలిగాం. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలు, మామిడిపల్లిలో 450 ఎకరాల భూములపై న్యాయస్థానంలో సమర్థవంతమైన పోరాటం ద్వారా సాధించాం. వేల కోట్ల విలువైన భూములను హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో బలమైన వాదనలు వినిపించడం ద్వారా కాపాడగలిగాం. హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ కలాల్‌లో సర్వే నెం.201లో 140 ఎకరాల భూమిని కాపాడాం. బలమైన వాదనల కారణంగా రాష్ట్రానికి, అటవీ శాఖకు అనుకూలంగా తీర్పు వచ్చింది'' అని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ''శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లో సర్వే నెం.59లోని 36 ఎకరాల, దాదాపు రూ.3,600 కోట్ల విలువైన భూమిని కొందరు కబ్జా చేయాలని చూస్తుండగా, ప్రభుత్వం అడ్డుకుని న్యాయస్థానంలో పోరాటం చేసింది. సెప్టెంబర్ 3, 2025న హైకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలమైన తీర్పు వెలువరించింది. హైకోర్టు తీర్పుతో ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. గండిపేట మండలం మంచిరేవులలో సర్వే నంబర్ 393లో 143 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నించగా, న్యాయస్థానంలో పోరాడి దాదాపు రూ.10 కోట్ల విలువైన భూమిని రక్షించాం. మంచిరేవుల అత్యంత కీలకమైన ప్రాంతం. మూసీ రివర్ ఫ్రంట్‌ను ఆనుకుని, గ్రేహౌండ్స్ ప్రాంతంలో ఉన్న ఈ భూమిలో 50 ఎకరాలను యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కోసం కేటాయించాం. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రూ. 400 కోట్ల విలువైన 106 ఎకరాల అటవీ భూమిని ఒక రాజకీయ నాయకుడికి నజరానాగా అప్పగిస్తే, సుప్రీంకోర్టులో పోరాడి ఆ భూమిని కాపాడామని సిఎం చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 600 ఎకరాల అటవీ భూమిని ప్రైవేటు వ్యక్తులు కొల్లగొట్టాలని ప్రయత్నిస్తే న్యాయస్థానాల్లో పోరాటం చేయడం ద్వారా ప్రభుత్వం కాపాడగలిగింది'' అని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు.

నేటికి వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీకి రాకుండా అడ్డుకోవడానికి హోం మంత్రి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. 'మా పార్టీ కార్యకర్తలను, వేలాది మంది సామాన్య ప్రజలను అడ్డుకుంటున్నారు. రామ్‌లీలా మైదాన్‌లో ఏం జరుగుతుందో, ఎంతమంది వస్తారో, ఎంతమందిని అడ్డుకుంటారో మీరే చూడండి. అప్పుడు దేశంలో ఏం జరుగుతుందో మీకు అర్థమవుతుంది. లక్షలాది మంది ప్రజల ఓటు హక్కును కాలరాస్తూ, వారి ఓట్లను దొంగిలిస్తున్న తీరు పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం, వేదన ఉన్నాయి. అదానీ, అంబానీ, మోదీ, షా, భగవత్ వంటి వారికి మేలు చేసేందుకే ఇదంతా జరుగుతోంది' అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇవి పలు నిరసనలు కావు, ఇది ఒకే నిరసన అని అన్నారు. ప్రతిపక్షమంతా ఢిల్లీలో ఏకమైంది, నిరసన తెలపాలనుకునే ఎవరైనా, ఇక్కడికి రావడానికి స్వాగతిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా, ఇండియా జన్‌బంధన్ ఆధ్వర్యంలో జ్ఞానేశ్ కుమార్‌పై నిర్వహించ తలపెట్టిన 'ప్రజా అభిశంసన' కార్యక్రమాన్ని అక్టోబర్ 31వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటలకు వాయిదా వేసినట్లు తెలిపారు. ఆ తరువాతఆదివారం 'చలో ఢిల్లీ' రామ్‌లీలా మార్చ్ జరగనుందన్నారు. 'ప్రధాని–హోం మంత్రి ద్వయం ఆదేశాల మేరకు భారత రాజ్యాంగాన్ని ఇంత బరితెగించి, నిర్లజ్జగా ఉల్లంఘించి, విధ్వంసం సృష్టించిన జ్ఞానేశ్ కుమార్ నిష్క్రమణకు కౌంట్‌డౌన్ వేగవంతమవుతోందని రమేశ్ అన్నారు. టిఎంసికి చెందిన డెరెక్ ఒబ్రెయిన్ మాట్లాడుతూ ఇండియా కూటమి అంతా కలిసికట్టుగా ఉందన్నారు. 'పౌర సమాజం, విద్యార్థులు, యువత, కార్మికులు, గృహిణులు మనమందరం ఇందులో కలిసి ఉన్నాము. రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ ప్రతినిధి ఒకరు ఏమి చెప్పారో విన్నారు. నేను మమతా బెనర్జీ, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (ఎటిసిపి) తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాను. శివసేన, జెఎంఎం, ఆర్ఎస్‌పి, సిపిఐ, ఆర్‌జెడి, సిపిఐ ఎం(ఎల్), ఇతరులు కూడా ఉన్నారు. ఇది మాకు రాజకీయంగా ఒక సానుకూల అంశం. మనమందరం ఇందులో కలిసి ఉన్నాము, కలిసి గెలుస్తాము' అని ఒబ్రయిన్ అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఎంపి ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ బిజెపి గొప్పలు చెప్పుకుంటున్న విజయం ఎన్నికల అవకతవకలు, నిర్వహణ తప్ప మరేమీ కాదని ప్రజలు గ్రహించారని అన్నారు. ఇవిఎంల నుండి ఓటర్ల జాబితాల వరకు, ప్రతీదీ తారుమారు చేయబడిందని ఆయన ఆరోపించారు. కాగా, ఖర్గే, రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు జైరామ్ రమేశ్, కె.సి. వేణుగోపాల్, టిఎంసికి చెందిన ఒబ్రయిన్, మహువా మోయిత్రా, ఎస్‌పికి చెందిన యాదవ్, శివసేన (యుబిటి)కి చెందిన అరవింద్ సావంత్, సిపిఐకి చెందిన పి. సంతోష్ కుమార్, సిపిఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్, ఆర్‌జెడికి చెందిన సంజయ్ యాదవ్, ఆర్ఎస్‌పికి చెందిన ఎన్.కె. ప్రేమ్‌చంద్రన్ తదితరులు సమావేశమై, నిరసన ప్రదర్శన కోసం ఇండియా కూటమి చేస్తున్న సన్నాహాలపై చర్చించారు.

మింటో రోడ్– కన్నాట్ ప్లేస్ కూడలి నుండి ర్యాలీ ప్రారంభం

'ఓటు దొంగతనం', ఓటర్ల జాబితాలో అవకతవకలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఒత్తిడి చేసేందుకు ఇండియా కూటమి నవంబర్ 1వ తేదీన రామ్‌లీలా మైదాన్‌లో 'మెగా ర్యాలీ' నిర్వహించనుంది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మింటో రోడ్– కన్నాట్ ప్లేస్ కూడలి నుండి ఇండియా కూటమి ర్యాలీ ప్రారంభమై రామ్‌లీలా మైదాన్‌లో ముగుస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో జరిగిన 'ఆస్క్ మీ' సెషన్‌లో ఆయన ఈ సమాచారం ఇచ్చారు.

సంపద సృష్టికర్తలు

(మొదటి పేజీ తరువాయి)

ఐఐఐటి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు నగర అభివృద్ధికి బలమైన పునాదులుగా నిలిచాయని గుర్తు చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.84,790 కోట్లతో భారీ కార్యాచరణను రూపొందించిందన్నారు. ఇందులో ఇప్పటికే సుమారు రూ.55 వేల కోట్ల పనులకు సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ చేపట్టడంతో పాటు పలు పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. రానున్న రోజుల్లో నగరంలోని ప్రతి ప్రాంతంలో అభివృద్ధి పనులు, నిర్మాణ కార్యక్రమాలు కనిపిస్తాయన్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.52,706 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు రూ.15,849 కోట్లు కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా తొలిదశలో సుమారు రూ.7,500 కోట్ల పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. మూసీలోకి మురుగునీరు చేరకుండా నగరంలోని 21 ప్రధాన నాలాల వద్ద ఒకేసారి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి, టెండర్ల ప్రక్రియ చేపట్టినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఎస్‌టిపిల సంఖ్యను 38కు పెంచే ఆలోచన ఉందన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు తోడుగా భారత్ ఫ్యూచర్ సిటీ మరో కీలక అభివృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకోనుందన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు సుమారు రూ.93 వేల కోట్లతో రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామన్నారు.

నాలుగో టి–20లో భారత్ ఓటమి

రఫ్ఫాడించిన జకోబ్ డఫీ

న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా జోరుకు బ్రేక్ పడింది. వరుసగా మూడు మ్యాచ్లు గెలిచి ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకున్న భారత్కు నాలుగో టి–20లో చుక్కెదురైంది. శుక్రవారం వెల్లింగ్టన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్లో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 87 పరుగుల తేడాతో భారత్ను చిత్తు చేసింది. చెత్త బౌలింగ్, పేలవ బ్యాటింగ్ టీమిండియా పతనాన్ని శాసించాయి. ఈ విజయంతో ఐదు టి–20ల సిరీస్లో న్యూజిలాండ్ ఖాతా తెరిచి 3–1తో క్లీన్ స్వీప్ను తప్పించుకుంది. ఈ మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 259 పరుగుల భారీ స్కోర్ చేసింది. గ్లేన్ ఫిలిప్స్(49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్స్లతో 107) అజేయ శతకంతో చెలరేగగా.. మైఖేల్ బ్రేస్వెల్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్లతో 65) విధ్వంసకర హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్(3/48) మూడు వికెట్లు తీయగా.. ప్రిన్స్ యాదవ్(1/49), అక్షర్ పటేల్(1/43), అర్షదీప్ సింగ్(1/38), నితీష్ కుమార్ రెడ్డి(1/64) చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 172 పరుగులే చేసి ఓటమిపాలైంది. తిలక్ వర్మ(35 బంతుల్లో ఫోర్, 3 సిక్స్లతో 35), నమన్ ధీర్(13 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్లతో 28), అభిషేక్ శర్మ(15 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్తో 27) టాప్ స్కోరర్లుగా నిలిచారు. న్యూజిలాండ్ బౌలర్లలో



జాకోబ్ డఫీ(4/19) నాలుగు వికెట్లు తీయగా.. మిచెల్సాంట్నర్(2/17), మాథ్యూఫిషర్ (2/40) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆడమ్ మిల్నేకు ఒక వికెట్ దక్కింది. 260 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో టీమిండియాకు శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ రెండో బంతికే సంజూ శాంసన్(4) క్యాచ్ ఔట్గా పెవిలియన్ చేరాడు. జాకోబ్ డఫీ వేసిన అదే ఓవర్లో ఇషాన్ కిషన్(0) డకౌట్గా వెనుదిరిగాడు. దాంతో భారత్ 4 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో అభిషేక్ శర్మ, శ్రేయస్ అయ్యర్ దూకుడుగా ఆడారు. అయితే అభిషేక్ శర్మను ఫిషర్ క్యాచ్ ఔట్గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే శ్రేయస్ అయ్యర్(22)ను మిల్నే క్లీన్ బౌల్ చేయడంతో పవర్ ప్లేలోనే భారత్ 4 వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసింది. రెండు సిక్సులతో దూకుడుగా ఆడిన నితీష్ కుమార్రెడ్డి(21)ని మిచెల్ సాంట్నర్ క్యాచ్ ఔట్గా పెవిలియన్ చేర్చాడు. అదే ఓవర్లో అక్షర్ పటేల్(7)ను సాంట్నర్ రిటర్న్ క్యాచ్గా ఔట్ చేశాడు. దాంతో 89 పరుగులకే భారత్ 6 వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, నమన్ ధీర్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా నమన్ ధీర్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. అయితే స్మిత్ అద్భుతమైన రిలే క్యాచ్తో నమన్ ధీర్ వెనుదిరిగాడు. ఆ వెంటనే అర్షీప్ సింగ్(0) గోల్డెన్ డకౌట్ కాగా.. ప్రిన్స్ యాదవ్తో తిలక్ వర్మ ఆచితూచి ఆడాడు. కానీ అతన్ని ఫిషర్ క్యాచ్ ఔట్గా పెవిలియన్ చేర్చాడు. ఆలౌట్ కాకుండా ప్రిన్స్ యాదవ్ చివరివరకు ఆడి భారత ఇన్నింగ్స్ను ముగించాడు.

ఆ తప్పిదమే మా ఓటమి కారణం ...బౌలింగ్ వైఫల్యంతోనే ఓటమిపాలయ్యామని టీమిండియా టి–20 కెప్టెన్ శ్రేయస్అయ్యర్ అన్నాడు. ముఖ్యంగా గ్లేన్ ఫిలిప్స్ అసాధారణ బ్యాటింగ్తో తమ విజయవకాశాలను దెబ్బతీశాడని చెప్పాడు. మ్యాచ్ అనంతరం తమ ఓటమిపై స్పందించిన శ్రేయస్ అయ్యర్.. గ్లేన్పై ప్రశంసల జల్లు కురిపించాడు. మా బౌలర్లు కొంతవరకు కట్టడి చేయడానికి ప్రయత్నించినా..లాభం లేకపోయింది. గ్లేన్ ఫిలిప్స్ అసాధారణ బ్యాటింగ్ చెలరేగాడు. మా తప్పిదాలను సమీక్షించుకుంటాం. ఆఖరి టి–20కి ఒకే ఒక్క రోజు సమయం ఉంది. అయినప్పటికీ మా కుర్రాళ్లు తొలి మూడు మ్యాచ్లు ఆడిన తీరు అమోఘం. ఈ పర్యటన వారికి మంచి అనుభవం. భవిష్యత్తులో ఇక్కడికి వచ్చినప్పుడు ఎలా ఆడాలనే విషయంపై వారికి మరింత క్లారిటీ వస్తుంది. ఆఖరి మ్యాచ్లో మరింత సానుకూలంగా బరిలోకి దిగేందుకు ప్రయత్నిస్తాం.'అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు.

ఆసియా చాంపియన్స్ హాకీలో భారత్ రెండో విజయం

సొంతగడ్డపై ఆసియా చాంపియన్స్ హాకీ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్గా బరిలోకి దిగిన భారత్.. టోర్నీలో వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. తొలి పోరులో బంగ్లాదేశ్పై ఏకపక్ష విజయం సాధించిన భారత్ జలంధర్లో గురువారం జరిగిన మ్యాచ్లో 5–2తో చైనాను చిత్తుచేసింది. నాలుగు క్వార్టర్స్లోనూ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన హర్మన్ప్రీత్ సింగ్ సేన.. ప్రత్యర్థికి కోలుకునే అవకాశమే ఇవ్వకుండా ఆడింది. భారత్ తరపున సుఖ్జీత్ సింగ్ (12, 34 నిమిషా ల్లో), హర్మన్ప్రీత్ సింగ్ (27, 31నిమిషాల్లో) చెరో రెండు గోల్స్ చేయగా జుగ్రాజ్ సింగ్ (47 నిమిషంలో) ఒక గోల్ చేశాడు. చైనా నుంచి యాంగ్ పెంగ్ (25నిమిషంలో), చెన్ చొంగ్కాంగ్ (36నిమిషంలో) గోల్ కొట్టారు. తొలి క్వార్టర్లోనే చైనా డిఫెన్స్ను ఛేదిస్తూ అద్భుతమైన ఫీల్ గోల్తో సుఖ్జీత్ గోల్స్ ఖాతా తెరి




చాడు. రెండో క్వార్టర్లో పట్టుదలగా ఆడిన చైనా.. భారత రక్షణ శ్రేణిపై ఒత్తిడి పెంచుతూ 25వ నిమిషంలో గోల్కొట్టింది. అయితే నిమిషం వ్యవధిలోనే లభించిన పెనాల్టీ కార్నర్ను హర్మన్ గోల్గా మలిచి ఆధిక్యాన్ని 2–1కు పెంచాడు. అదే ఊపులో 3నిమిషాల్లోనే ఆతి థ్య జట్టు రెండు గోల్స్ కొట్టింది. ఆ తర్వాత చైనా గోల్ చేసినా జుగ్రాజ్ చివరి క్వార్టర్లో చేసిన గోల్తో చైనా కుదేలైంది. శుక్రవారం జరిగే తమ తర్వాతి మ్యాచ్లో జపాన్తో భారత్ ఆడనుంది.

సైన్స్


ఒకే రూపాన్ని ఉపయోగించే జీవం!

రసాయన శాస్త్ర ఈ ఏడాది నోబెల్ పురస్కారం జీవరసాయన శాస్త్రంలో చాలా కాలంగా ఉన్న ఒక ఆసక్తికరమైన ప్రశ్నపై దృష్టి సారించింది. అద్దంలో కనిపించే ఎడమ, కుడి ప్రతిరూపాల్లాంటి అణువుల్లో జీవం ఎందుకు సాధారణంగా ఒక రూపాన్నే ఎక్కువగా ఉపయోగిస్తుంది? అనే అంశంపై పరిశోధన జరిగింది. ఇలాంటి అణువులను చైరల్ మాలిక్యూల్స్ అంటారు. అవి రసాయనికంగా ఒకే రకమైన అణువులతో ఏర్పడినా, వాటి త్రిమితీయ అమరిక పరస్పరం అద్దం ప్రతిబింబాల్లా ఉంటుంది. మన ఎడమ, కుడి చేతులు ఒకదానికొకటి ప్రతిరూపాలుగా ఉన్నప్పటికీ ఒకదానిపై మరొకటి పూర్తిగా సరిపోక పోవడం దీనికి సులభమైన ఉదాహరణ. అమినో ఆమ్లాలు, చక్కెరలు వంటి జీవానికి కీలకమైన అణువుల్లో ఈ లక్షణం అత్యంత ముఖ్యమైనది. జీవ వ్యవస్థలు సాధారణంగా ఒక నిర్దిష్ట చేతి ఆకారాన్ని ఎందుకు ఎంచుకున్నాయనే ప్రశ్నకు సమాధానం జీవం ఆవిర్భావ వ్యవస్థలో భిన్నమైన ప్రభావాలు చూపగలవు. అందువల్ల కొత్త ఔషధాలను రూపొందించడంలో అణువుల త్రిమితీయ నిర్మాణాన్ని అర్థం చేసుకోవడం గురించి కూడా కొత్త అవగాహన ఇవ్వవచ్చు. ఈ పరిశోధన ఔషధ తయారీలోనూ ప్రాధాన్యం సంతరించుకుంది. ఒక అణువుకు సంబంధించిన రెండు ప్రతిరూపాలు జీవ వ్యవస్థలో భిన్నమైన ప్రభావాలు చూపగలవు. అందువల్ల కొత్త ఔషధాలను రూపొందించడంలో అణువుల త్రిమితీయ నిర్మాణాన్ని అర్థం చేసుకోవడం కీలకం.




క్వాంటమ్ కంప్యూటింగ్కు ఎనిమిది శాస్త్రీయ లక్ష్యాలు

అమెరికా ఇంధన శాఖ క్వాంటమ్ కంప్యూటింగ్ ద్వారా పరిష్కరించాల్సిన ఎనిమిది కీలక శాస్త్రీయ సమస్యలను ప్రకటించింది. భవిష్యత్తులో శాస్త్రీయ పరిశోధనలకు నిజంగా ఉపయోగపడే, కంప్యూటింగ్ లోపాలను తట్టుకోగల క్వాంటమ్ వ్యవస్థల అభివృద్ధికి ఇవి మార్గదర్శకంగా నిలవనున్నాయి. సాధారణ కంప్యూటర్లు సమాచారాన్ని బిట్ల రూపంలో నిల్వ చేస్తాయి. క్వాంటమ్ కంప్యూటర్లు క్యూబిట్లను ఉపయోగిస్తాయి. క్వాంటమ్ భౌతికశాస్త్రంలోని సూపర్పొజిషన్, ఎంటాంగిల్మెంట్ వంటి లక్షణాల వల్ల కొన్ని ప్రత్యేక గణనలను సంప్రదాయ కంప్యూటర్లతో పోలిస్తే భిన్నంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. అయితే క్యూబిట్లు పరిసరాల ప్రభావానికి సున్నితంగా ఉండటం, గణనల్లో లోపాలు పెరగడం ప్రధాన సవాళ్లు. అమెరికా ఇంధన శాఖ ప్రకటించిన 'క్వాంటమ్ జెనెసిస్' ప్రాధాన్య అనువర్తనాలు, క్వాంటమ్ కంప్యూటర్లు పరిష్కరించగల ఎనిమిది శాస్త్రీయ సమస్యలపై దృష్టి పెడతాయి. దీని ఉద్దేశం కేవలం ఎక్కువ క్యూబిట్లు ఉన్న యంత్రాలను తయారు చేయడం కాదు. ప్రస్తుత కంప్యూటింగ్ పద్ధతులతో సాధించడం కష్టమైన శాస్త్రీయ ఫలితాలను సాధించగల వ్యవస్థలను అభివృద్ధి చేయడం. హార్డ్వేర్, సాఫ్ట్వేర్, సంబంధిత శాస్త్రీయ పరిశోధనలను సమన్వయం చేయడం కూడా ఈ కార్యక్రమంలో భాగం. క్వాంటమ్ కంప్యూటింగ్ భవిష్యత్తులో కొత్త పదార్థాల లక్షణాలను అంచనా వేయడం, రసాయన ప్రతిచర్యలను సమూనా రూపంలో అధ్యయనం చేయడం, సంక్లిష్ట భౌతిక వ్యవస్థలను విశ్లేషించడం వంటి పనులకు ఉపయోగపడవచ్చు. ఔషధాల అభివృద్ధి, శక్తి నిల్వ సాంకేతికతల పరిశోధనలోనూ దీని సామర్థ్యాన్ని పరీక్షిస్తున్నారు.



అంధత్వానికి జన్యు చికిత్స

రెటినైటిస్ పిగ్మెంటోసా అనే జన్యుపరమైన కంటి వ్యాధితో తీవ్రమైన చూపు కోల్పోయిన కొంతమంది రోగుల్లో జన్యు చికిత్స ద్వారా కాంతిని గుర్తించే సామర్థ్యం మెరుగుపడినట్లు తాజా పరిశోధన వెల్లడించింది. ఈ చికిత్సను ఆప్టోజెనెటిక్ థెరపీ అంటారు. పరిశోధకులు ఒక వైరస్ను వాహకంగా ఉపయోగించి కంటిలోని గ్యాంగ్లియన్ కణాలకు కాంతిని స్పందించే ప్రోటీన్లను తయారు చేసే జన్యు సమాచారాన్ని అందించారు. తాజా అధ్యయనంలో పది మంది రోగులకు చికిత్స అందించగా, ఆరుగురిలో కాంతి పట్ల స్పందనలో వైద్యపరంగా గమనించదగిన మెరుగుదల కనిపించింది. చికిత్స తర్వాత రోగులు ప్రత్యేకమైన కాంతి ఉద్దీపన కళ్లద్దాలను ధరించారు. అవి చుట్టుపక్కల వస్తువుల నుంచి పచ్చే దృశ్య సమాచారాన్ని కాంతి సంకేతాలుగా మార్చి కంటికి అందిస్తాయి. అయితే ఇది సాధారణ చూపును పూర్తిగా తిరిగి ఇవ్వదు. ముఖాలను గుర్తించడం లేదా అధిక రిజల్యూషన్తో చదవడం వంటి సామర్థ్యాలు ఇంకా సాధ్యం కాలేదు. అయినప్పటికీ, తీవ్ర జన్యుపరమైన అంధత్వానికి చికిత్స అభివృద్ధిలో ఇది ముఖ్యమైన ముందడుగు. భవిష్యత్తులో మెరుగైన జన్యు చికిత్స, మెరుగైన కళ్లద్దాలు, శిక్షణా విధానాలతో ఫలితాలు మరింత మెరుగుపడవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.



ఆర్టిసి విలీన ప్రక్రియ ప్రారంభించాలి

ప్రభుత్వానికి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న డిమాండ్

ప్రజాపక్షం/కరీంనగర్ : ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. టిజిఎస్ ఆర్టిసిలో రాష్ట్రవ్యాప్త గుర్తింపు సంఘంగా ఎంప్లాయీస్ యూనియన్ గెలుపొందిన సందర్భంగా కరీంనగర్ రీజియన్ విజయోత్సవ సభ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్లో శుక్రవారం నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరై ఈదురు వెంకన్న మాట్లాడుతూ ఆర్టిసి సంస్థలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసమే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ను ఆదరించారని, రాష్ట్ర గుర్తింపు సంఘంగా ఐదు వేల మెజారిటీతో గెలిపించినందుకు ఆర్టిసి కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల నమ్మకాన్ని వమ్ముకాకుండా హక్కుల రక్షణకు, సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ యూనియన్ పోరాడుతుందన్నారు. ఆర్టిసిలో కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఉన్నటువంటి డ్యూటీలను సరిచేయాలని, కార్మిక, ఉద్యోగ భద్రత సాధించడం కోసం, రిటైర్డు కార్మికులకు రావాల్సిన బకాయిలు ఇప్పించడం కోసం, పనివిధానం కోసం, కార్మిక హక్కుల రక్షణ కోసం యాజమాన్యంతో పాటు ప్రభుత్వంపై ఎంప్లాయీస్ యూనియన్ పోరాటం చేస్తుందని వివరించారు. కార్మిక హక్కులను కాపాడేందుకు ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం కార్మిక పక్ష పాతిగా అండగా ఉందన్నారు. కార్మికులకు ఎనిమిది గంటల పనివిధానం అమలు చేయాలని, కార్మికులపై పెంచిన పనిభారాలు తగ్గించాలని, మహిళా కార్మికులకు రాత్రి 8 గంటలలోపు విధులు ముగించేలా చర్యలు చేపట్టేలా కృషి చేస్తామన్నారు. గ్యారేజీ కార్మికులకు లేటెస్ట్ పవర్ టూల్స్ అందించాలని, సంస్థలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన ఖాళీలను భర్తీచేయాలని, రిటైర్డ్ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులపై అధికారుల వేధింపులు మానుకోవాలని, కార్మికుల పట్ల అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూ ఆర్టిసి కార్మికులకు ఎఐటియుసి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. యూనియన్ కరీంనగర్ రీజియన్ గౌరవాధ్యక్షుడు కంది అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిసి కార్మికుల హక్కుల కోసం ఎంప్లాయిస్ యూనియన్ ముందుండి పోరాడుతుందన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి డి.సంజీవ్ మాట్లాడుతూ ఆర్టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి యాజమాన్యం ముందుకు రావాలన్నారు. గతంలో మాదిరిగా కార్మికులను వేధిస్తే సహించేది లేదని, కార్మికులకు పెంచిన పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ రీజియన్ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్.ప్రకాష్, కొమురయ్య, రాష్ట్ర కార్యదర్శి కాళిదాసు, సికింద్రాబాద్ రీజియన్ అధ్యక్షుడు ప్రవీణ్కుమార్ బాలు, కరీంనగర్ రీజియన్లోని అన్ని డిపోల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మహిళా నాయకులు సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విజయోత్సవ సభ సందర్భంగా నగరంలో భారీర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఈదురు వెంకన్న పూలమాల వేశారు. కరీంనగర్ 1,2 డిపోలలో ఎంప్లాయీస్ యూనియన్ జెండాలు ఈదురు వెంకన్న ఆవిష్కరించారు. సభకు బి.కాళీదాస్ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో రీజనల్ సెక్రటరి కె.కొమురయ్య, బి.మహేష్, ఎల్.ప్రకాష్, గ్యారేజి సెక్రెటరీ లక్ష్మణ్, రజితతో పాటు ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



'ఓటు' భవిష్యత్తును మార్చే శక్తి



పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి : పల్లా నర్సింహారెడ్డి

ప్రజాపక్షం/దేవరకొండ : ఓటు కేవలం హక్కు మాత్రమే కాదని, మన భవిష్యత్తును నిర్ణయించే శక్తి అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. పట్టభద్రుల గొంతుక శాసన మండలిలో బలంగా వినిపించాలంటే ప్రతి అర్హుడైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత అవసరమని పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ–ఖమ్మం–వరంగల్ నియోజకవర్గ గ్రాడ్యూయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం దేవరకొండ పల్లా పర్వత్రెడ్డి భవన్లో హెల్ప్ డెస్క్ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పల్లా నర్సింహారెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్రెడ్డిలు హాజరై ఫారం18 ప్రతులను పట్టభద్రులకు అందించి ప్రారంభించారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుల పాత్ర చాలా కీలకమని, సమాజంలో మార్పు రావాలంటే విద్యావంతులు రాజకీయ ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. 2023 డిసెంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్క గ్రాడ్యూయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామస్వామి, ఎఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వినయ్, శివకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శంశోద్దిన్, సిపిఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు జ్యోతిబసు, రామాంజనేయులు, మహేష్, జమిల్, బాబు, బాలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల రక్షణకు ఉద్యమాలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్

ప్రజాపక్షం/ఆదిలాబాద్ : భారత రాజ్యాంగాన్ని రక్షించండి–ప్రజలను కాపాడండిదేశాన్ని కాపాడండి అనే ప్రధాన నినాదంతో శనివారం దేశవ్యాప్తంగా చేపడుతున్న నిరసన, చైతన్య కార్యక్రమాన్ని ఆదిలాబాద్ జిల్లాలో విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్కేపెల్లి గంగయ్యలతో కలిసి శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, శ్రామికుల హక్కుల రక్షణకు పోరాటాలు చేయాలని కార్మికలోకానికి విజ్ఞప్తి చేశారు. 1920 అక్టోబర్ 31న లాలా లజపతిరాయ్ అధ్యక్షతన ఆవిర్భవించిన ఎఐటియుసి నాటి నుంచి నేటి వరకు కార్మికుల, శ్రామికుల హక్కుల కోసం ఉద్యమాలు చేస్తోందని గుర్తుచేశారు. కార్మికులు సాధించుకున్న హక్కులను రద్దు చేస్తూ 4 లేబర్ కోడ్లను తీసుకురావడం, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడాన్ని నిరసించాలని కోరారు. ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని, కార్మిక అడ్డాలలో, పారిశ్రామిక కేంద్రాలలో కార్మిక జెండాలు ఎగురవేయాలని కార్మికలోకానికి పిలుపునిచ్చారు.



కార్మిక పోరాట దిక్సూచి ఎఐటియుసి

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్పాషా

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : భారత కార్మిక వర్గ పోరాటాలకు అసలైన దిక్సూచి ఎఐటియుసి మాత్రమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె.సాబీర్ పాషా స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక పెద్దబజార్లోని హమాలీ అడ్డాలో శుక్రవారం జరిగిన హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 106 ఏళ్ల సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన ఘనత ఎఐటియుసికి మాత్రమే దక్కుతుందన్నారు. దేశంలోని కార్మికులు రక్తంధారపోసి సాధించుకున్న హక్కులను కేంద్రం లోని పాలకులు కాలరాస్తున్నారని మండిపడ్డారు. కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలతో అసంఘటిత సంఘటిత రంగ కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను రద్దు చేస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడం దుర్మార్గమన్నారు. అక్టోబర్ 31న జరగనున్న ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనే లక్ష్యంగా కదలాలన్నారు. పాలకుల అణిచివేత చర్యలను తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాలన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటాలు నిర్మిస్తామని ఆయన శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్మిక ఐక్యతే ఆయుధంగా ముందుకు సాగి చట్టాలను కాపాడుకోవాలన్నారు. హమాలీల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. పాలకుల విధానాలపై రాబోయే రోజుల్లో సమరశీల పోరాటాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా జరపాలని కార్మికలోకానికి పిలుపునిచ్చారు. కార్మిక అడ్డాలలో కార్మిక జెండాలు ఎగుర వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, తరాల రాజు, నీలం మొగిలి, వెలిశాల మోహన్రావు, కత్తెర శ్రీనివాస్, అశోక్, సర్పంచ్ రామనాధం తదితరులు పాల్గొన్నారు.

కార్మిక జెండాలు ఎగుర వేయాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమను దోచుకునే కొత్త కార్మిక చట్టాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం ధర్మబిక్షం భవన్లో జరిగిన ఎఐటియుసి ఏరియా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు కార్మిక లోకం సిద్ధం కావాలన్నారు. 107 సంవత్సరాల చరిత్ర కలిగి దేశంలోని ఏకైక పెద్ద కార్మిక సంఘం ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. జిల్లా వ్యాప్తంగా కార్మిక అడ్డాలలో, పారిశ్రామిక కేంద్రాలలో వాడవాడల కార్మిక జెండాలు ఎగుర వేయాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. శనివారం ధర్మబిక్షం భవన్లో ఎఐటియుసి జెండా ఆవిష్కరణకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి ప్రాంతీయఅధ్యక్షులు దంతాల రాంబాబు, చామల అశోక్కుమార్ పాల్గొన్నారు.



నవంబర్ 5న సింగరేణి ఉద్యోగులకు దీపావళి బోనస్ చెల్లింపు

- ఒక్కో కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,10,250 దీపావళి బోనస్‌గా చెల్లింపు
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశంతో బోనస్ చెల్లింపునకు యాజమాన్యం చర్యలు
- దాదాపు 38 వేల మంది కార్మికులకు అందనున్న బోనస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇటీవల లాభాల వాటా బోనస్ (దసరా బోనస్)ను అందుకున్న సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మరో తీపి కబురుగా నవంబర్ 5వ తేదీన దీపావళి బోనస్‌ను చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సింగరేణి ఉద్యోగులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ బోనస్ (దీపావళి బోనస్) ను నవంబర్ 5వ తేదీన చెల్లించాల్సిందిగా సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. దీపావళి బోనస్‌గా రూ.419 కోట్లను చెల్లించనున్నట్లు, ఒక్కో కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,10,250 చొప్పున దీపావళి బోనస్ చెల్లించడం జరుగుతుందని వివరించారు. రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న సింగరేణి సంస్థ అభివృద్ధి విస్తరణకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. లాభాల వాటా కింద ఈ నెలలో దాదాపు రూ.600 కోట్లను చెల్లించగా, తాజాగా రూ.419 కోట్ల దీపావళి బోనస్ చెల్లించబోతున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలపై సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సంబంధిత పర్సనల్, ఫైనాన్స్ అధికారులతో మాట్లాడి నవంబర్ 5న దీపావళి బోనస్‌ను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధంగా తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఎన్ సిడబ్ల్యుఎ ఉద్యోగులకు వర్తింపు

దీపావళి బోనస్ కింద సగటున ఒక్కొక్క కార్మికుడికి ఈసారి రూ.1,10,250లు అందనున్నాయి. ఈ బోనస్ కేవలం ఎన్‌సిడబ్ల్యుఎ (ఎన్‌సిడబ్ల్యు) ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఇది అధికారులకు వర్తించదు. గత ఆర్థిక సంవత్సరంలో భూగర్భ గనుల విభాగంలో 190 పని దినాలు, ఓపెన్ కాస్ట్, సర్ఫేస్ విభాగాల్లో 240 పని దినాలు పూర్తి చేసిన కార్మికులకు పూర్తిస్థాయిలో బోనస్ అందుతుంది అంతకంటే తక్కువ పని దినాల హాజరు కలవారికి వారు పని చేసిన కాలానికి నిష్పత్తి ప్రకారం బోనస్‌ను లెక్క కట్టి చెల్లించనున్నారు. ఈ బోనస్ పొందడానికి కనీస అర్హతగా గత ఆర్థిక సంవత్సరంలో ఏ కార్మికుడైనా కనీసం 30 రోజులు పని చేసి ఉండాలని నిర్ణయించారు. మొత్తం మీద చూస్తే సుమారు 38,000 మంది ఉద్యోగులకు ఈ బోనస్ వర్తించనుంది. నెల రోజుల వ్యవధిలోనే దసరా, దీపావళి బోనస్‌ల రూపంలో సగటున దాదాపు రూ.2,65,000 లను కార్మికులు అందుకోనున్నారు. సింగరేణి యాజమాన్యం ఈ రెండు బోనస్‌లతో సుమారు రూ.1,020 కోట్లను కార్మికులకు చెల్లించిందని సింగరేణి యాజమాన్యం వివరించింది.

హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతాం

- పెట్టుబడులతో పాటు ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు ప్రాధాన్యం.. యువతకు నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు
- జిల్లాల విద్యార్థులకూ ఐటి రంగంలో సమాన అవకాశాలు కల్పించాలి: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, ప్రజలు మెరుగైన జీవన ప్రమాణాలతో జీవించేలా హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మెరుగైన మౌలిక సదుపాయాలు, వేగవంతమైన పరిపాలన, నిరంతర విద్యుత్ సరఫరా, పర్యావరణహిత అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ సమీపం లోని పోచారం ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో విస్తరణలో భాగంగా నిర్మించిన నూతన కార్యాలయ భవనాన్ని ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ఇన్ఫోసిస్ ప్రస్థానం, అంతర్జాతీయ కార్యకలాపాలు, పోచారం క్యాంపస్ ప్రత్యేకతలు, నూతన భవనంలోని ఆధునిక సదుపాయాలను వివరించారు. అనంతరం వారు నూతన కార్యాలయాలను పరిశీలించారు.హైదరాబాద్‌లో ఇప్పటికే 48 వేల మందికి పైగా ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇన్ఫోసిస్.. పది లక్షల చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో కొత్త భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్ర ఐటీ రంగ అభివృద్ధికి దోహదపడుతుందని భట్టి విక్రమార్క అన్నారు. ఈ విస్తరణ హైదరాబాద్‌పై అంతర్జాతీయ సంస్థలకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ఐటి రంగం వేలాది కుటుంబాల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి దోహదపడిందని, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువతకు కృత్రిమ మేధస్సు సహా ఆధునిక రంగాల్లో నైపుణ్య శిక్షణ, ప్రాక్టికల్ అనుభవం, ఉద్యోగావకాశాలు కల్పించాలని సూచించారు. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు జిల్లాల్లోని కళాశాలల విద్యార్థులకు కూడా ఐటీ రంగంలో సమాన అవకాశాలు కల్పించాలని ఇన్ఫోసిస్ ప్రతినిధులను కోరారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో 'వారానికి 5 రోజుల పనిదినాలు' అమలు చేయండి

- ఉద్యోగుల జెఎసి

ప్రజాపక్షం/హైదరాబాద్: ఎల్ నినో నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తరహాలోనే రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యా లయాల్లో కూడా 'వారానికి ఐదు రోజుల పనిదినాల' విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పింఛనర్ల జెఎసి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజుకు వినతిపత్రం సమర్పించారు. 'ఎల్ నినో' ప్రభావం వల్ల అంతర్జాతీయంగా ఏర్పడుతున్న నీరు, విద్యుత్, ఇంధన సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో వనరులను పొదుపుగా వాడుకోవాలని ఇటీవల ముఖ్యమంత్రి కూడా పిలుపునిచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా పెట్రోలియం ఉత్పత్తుల వాడకాన్ని తగ్గించి, ఉద్యోగులు కూడా ప్రజా రవాణాను వినియోగించుకునేలా ప్రోత్సహించడం వంటి చర్యలు చేపడుతోందని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలోనూ ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేస్తే విద్యుత్, తాగునీరు, ఇంధనం పెద్ద ఎత్తున ఆదా కావడంతో పాటు రోడ్లపై వాహనాల కాలుష్యం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న 6 రోజుల పనివేళల విధానంలో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు, రెండవ శనివారం మినహాయిస్తే వారానికి దాదాపు 39 గంటల పనివేళలు ఉంటాయని, దీనికి బదులుగా 5 రోజుల పనిదినాలను ప్రవేశపెట్టి, రోజుకు ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సమయాన్ని సవరిస్తే వారానికి 37:30 గంటల పని జరుగుతుందని వివరించారు. ఉద్యోగులు అదనంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని, ఈ విధానం ద్వారా ప్రభుత్వ ఖజానాపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడకపోగా, ప్రభుత్వానికే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, ఉద్యోగుల పనితీరు, ఉత్పాదకత కూడా పెరుగుతాయని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్రంలో తక్షణమే వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని ప్రవేశపెట్టేలా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో భారీ మోసం

- ఖాతాదారుల ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి రూ.3.58 కోట్లు మాయం!
- ఇద్దరు ఖాతాదారుల ఎఫ్‌డిలను ముందస్తుగా మూసివేసి నగదు మళ్లింపు
- ఐసిఐసిఐ, ఎస్‌బిఐ ఖాతాలకు బదిలీ అయిన సొమ్ము



ప్రజాపక్షం/హైదరాబాద్: బ్యాంకులో భద్రంగా ఉంటాయన్న నమ్మకంతో దాచుకున్న ఖాతాదారుల సొమ్ముకే ఎసరు పెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో ఇద్దరు ఖాతాదారులకు చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను ముందస్తుగా మూసివేసి, ఆ మొత్తాలను తనకు సంబంధించిన ఇతర బ్యాంకు ఖాతాలకు మళ్లించినట్లు ఓ మాజీ ఉద్యోగిపై ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో ఏకంగా రూ.3.58 కోట్ల మేర నిధులు దుర్వినియోగమైనట్లు బ్యాంకు ప్రాథమిక విచారణలో గుర్తించింది. దీనిపై బ్యాంకు బంజారాహిల్స్ శాఖ మేనేజర్ నరేశ్ పెరికేటి ఫిర్యాదు చేయడంతో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులకు అందిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. సుమిత్రాదేవి ధనుక, ఆమె భర్త దేవీ ప్రసాద్ ధనుకలు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో పొదుపు ఖాతాలతో పాటు వ్యక్తిగత, ఉమ్మడి ఫిక్స్‌డ్ డిపాజిట్లు కలిగి ఉన్నారు. తమ ఖాతాల్లో ఉండాల్సిన కొన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లు కనిపించడం లేదంటూ సుమిత్రాదేవి గత సెప్టెంబర్ 28న బ్యాంకుకు ఫిర్యాదు చేశారు. దీంతో బ్యాంకు అధికారులు ప్రాథమికంగా రికార్డులను పరిశీలించగా, సంబంధిత ఖాతాలను గతంలో నిర్వహించిన మాజీ ఉద్యోగి అక్కెరపు ప్రసాద్ రావు పాత్రపై అనుమానాలు వ్యక్తమయ్యాయి.బ్యాంకు రికార్డుల పరిశీలనలో నాలుగు ప్రధాన లావాదేవీలు వెలుగులోకి వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 2023 మార్చి 16న రూ.55 లక్షలతో జాయింట్ ఖాతాలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయగా, అదే ఏడాది ఏప్రిల్ 3న దానిని ముందస్తుగా మూసివేశారు. అనంతరం ఆ మొత్తాన్ని అదే రోజు చెక్కు ద్వారా ఐసిఐసిఐ బ్యాంకులోని ఓ ఖాతాకు బదిలీ చేశారు. ఆ లావాదేవీకి సంబంధించిన వివరాల్లో 'మిస్టర్ రావు' అనే ప్రస్తావన ఉన్నట్లు బ్యాంకు తెలిపింది.మరో ఘటనలో 2024 సెప్టెంబర్ 5న జాయింట్ ఖాతా నుంచి రూ.25 లక్షలను సుమిత్రాదేవి వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేసి, అక్కడి నుంచి ఎస్‌బిఐలో ప్రసాద్ రావుకు సంబంధించిన ఖాతాకు మళ్లించినట్లు గుర్తించారు. అలాగే 2023 ఆగస్టు 30న రూ.80 లక్షలతో చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను 2024 డిసెంబర్ 2న ముందస్తుగా మూసివేసి, ఆ మొత్తాన్ని తొలుత సుమిత్రాదేవి వ్యక్తిగత ఖాతాకు, అక్కడి నుంచి అదే రోజు ఎస్‌బిఐ ఖాతాకు బదిలీ చేసినట్లు ఫిర్యాదులో వివరించారు. ఇక రూ.2 కోట్లతో 2024 జూన్ 19న చేసిన మరో ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను 2025 నవంబర్ 3న మూసివేయగా, మరుసటి రోజు రూ.1.98 కోట్లను ఎస్‌బిఐలోని సంబంధిత ఖాతాకు బదిలీ చేసినట్లు బ్యాంకు రికార్డులు వెల్లడించినట్లు పేర్కొన్నారు. ఈ నాలుగు లావాదేవీల్లో మొత్తం రూ.3.58 కోట్ల మేర నిధులు మళ్లించినట్లు బ్యాంకు ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ వ్యవహారంలో ఖాతాదారులకు, బ్యాంకుకు ఆర్థిక నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో ఆరోపించారు. లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు రికార్డులు, చెక్కులు, యూటీఆర్ నంబర్లు, ఇతర ఆధారాలను పరిశీలించి నిధులు ఎవరెవరికి చేరాయి? ఈ వ్యవహారంలో మరెవరైనా పాత్రధారులున్నారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది.ఎస్ఐ ఏపూరి భరత్‌కుమార్‌కు అప్పగించారు.

గడువు పొడిగింపును సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచన
- తెలంగాణ సహా ఆరు రాష్ట్రాల్లో సర్ గడువు పొడిగించిన ఇసిఐ

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్2026) కార్యక్రమానికి సంబంధించి భారత ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌కు ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి మెమో జారీ చేశారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, సవరణలు, చిరునామా మార్పులు లేదా ఇతర క్లెయిమ్స్, అభ్యంతరాలు ఉన్న వారు పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, సవరించిన షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియకు గతంలో నిర్ణయించిన నవంబర్ 5 గడువును నవంబర్ 26 వరకు పొడిగించారు. దీంతో ఓటర్లకు తమ పేర్ల నమోదు, సవరణలు, తొలగింపులు లేదా ఇతర అభ్యంతరాలను సమర్పించేందుకు మరో 21 రోజుల అదనపు అవకాశం లభించింది. అలాగే తుది ఓటరు జాబితా ప్రచురణ తేదీని కూడా సవరించారు. ముందుగా నవంబర్ 9న విడుదల చేయాలని నిర్ణయించిన తుది ఓటరు జాబితాను ఇప్పుడు నవంబర్ 30న ప్రచురించనున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అక్టోబర్ 1, 2026ను అర్హత తేదీగా పరిగణనలోకి తీసుకుని చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ మార్పులు అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. సవరించిన షెడ్యూల్‌పై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణతో పాటు ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, హర్యానా మహారాష్ట్ర, నాగాలాండ్ వంటి ఆరు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గడువును పొడిగించింది. ఆయా రాష్ట్రాల, ప్రధాన ఎన్నికల అధికారుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్న ఎన్నికల సంఘం కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది. తాజా షెడ్యూల్ ప్రకారం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర, నాగాలాండ్ రాష్ట్రాల్లో ఓటర్ల తుది జాబితాను నవంబరు 30న ప్రచురిస్తారు. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌పై తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఢిల్లీకి మాత్రం ఈ గడువును డిసెంబర్ 12 వరకు పొడిగించారు. డిసెంబర్ 12 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఓటర్ల తుది జాబితాను డిసెంబర్ 22న విడుదల చేస్తారు.

హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ టిఆర్ఎస్ అభ్యర్థిగా ఆకాశ్ కొల్లూరు

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎమ్మెల్సీ తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖరారు చేశారు. ఈ నియోజకవర్గ పరిశీలకునిగా, కో ఆర్డినేటర్‌గా డాక్టర్ చిట్నేని రఘును నియమిస్తూ ఆమె శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల వరంగల్‌–ఖమ్మం–నల్లగొండ స్థానం నుంచి నలమాస శ్రీకాంత్ గౌడ్ పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు స్ట్రాటజీ, వార్ రూమ్ ఇన్‌ఛార్జిగా ప్రముఖ న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లను నియమించారు. అలాగే రెండు నియోజకవర్గాలకు ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించారు.



కెనరా బ్యాంక్ రైల్ నిలయంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ ఎల్.శ్రీదేవి, దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయ పెన్షన్ ఖాతాల విభాగం అసిస్టెంట్ ఫైనాన్షియల్ అడ్వైజర్ కె. సురేష్‌బాబు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జి.వి. రావు కలిసి బ్యాంకు చీఫ్ మేనేజర్, సిబ్బందికి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లకు సంబంధించిన పోస్టర్లను అందజేశారు.

'సామాజిక భద్రతా పింఛన్'లో ఇన్‌స్టెంట్ పెన్షన్

- భర్త మరణిస్తే తక్షణమే భార్యకు అమలు
- వయోపరిమితి లేకపోతే 'వితంతు' పింఛన్
- మార్గదర్శకాలు జారీ చేసిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: సామాజిక భద్రత పింఛన్ లబ్ధిదారుడు మరణిస్తే తక్షణమే ఆయన భార్యకు 'ఇన్‌స్టెంట్ పెన్షన్' అందేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఇన్‌స్టెంట్ పెన్షన్ సదుపాయాన్ని మరిన్ని కేటగిరీలకు విస్తరిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం ద్వారా దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్‌ఐవీ బాధితులు, ఫైలేరియా బాధితుల కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. కాగా ఇప్పటి వరకు వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే ఆయన భార్యకు ఇన్‌స్టెంట్ పెన్షన్ మంజూరు చేసే సదుపాయం అమలులో ఉన్నది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ సదుపాయాన్ని ఇతర పింఛన్ కేటగిరీలకు కూడా విస్తరించింది. దీనికి సంబంధించి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. జీవిత భాగస్వామిని కోల్పోయిన మహిళ ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ విధానాన్ని రూపొందించిందని మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. మరణించిన పురుష పింఛన్‌దారుడి భార్య వయస్సు 57 సంవత్సరాల కంటే తక్కువగా ఉంటే వితంతు పింఛన్, 57 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయనున్నారు. ఇందుకు గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శికి, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలి, ఈ దరఖాస్తుతో పాటు భార్య ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన పింఛన్‌దారుని ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులు పత్రాలను పరిశీలించి, చెయూత పోర్టల్లో ఆ వివరాలను నమోదు చేసి, అర్హత ధ్రువీకరించుకున్న తర్వాత పెన్షన్‌ను మంజూరు చేయనున్నారు.

బహిరంగంగా అమ్ముకుంటానని సిఎం ప్రకటించడం సిగ్గుచేటు

- బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పోరాడి కాపాడిన విలువైన మియాపూర్ ప్రభుత్వ భూమిని తాము అమ్ముకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బహిరంగంగా ప్రకటించడం సిగ్గుచేటని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు అన్నారు. మియాపూర్ భూమికి సంబంధించిన ప్రతి పిటిషన్, ప్రతి అఫిడవిట్, సమగ్ర ఆధారాలను సుప్రీంకోర్టు ముందు పెట్టిందే నాటి బిఆర్ఎస్ ప్రభుత్వమని, బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిరంతర పోరాటం వల్లనే మియాపూర్ భూములు పరిరక్షించబడ్డాయని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మియాపూర్ విలువైన భూమి ప్రభుత్వం చేజారిపోకూడదని నాటి సిఎం కెసిఆర్ దృఢ నిశ్చయంతో వ్యవహరించారని, 2015లోనే దేశంలోనే అత్యుత్తమ న్యాయవాదుల్లో ఒకరైన సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్‌ను ప్రత్యేకంగా నియమించారని తెలిపారు. మియాపూర్ తీర్పునకు అసలు పునాది 'ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్' కేసు తీర్పు అని, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌కు సంబంధించిన ఆ కేసు 2023 జూన్ 15న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజయం సాధించిందని వివరించారు. ఆ తీర్పులోని చట్టపరమైన అంశాలే ప్రస్తుత మియాపూర్ భూముల తుది తీర్పునకు బలమైన ఆధారమయ్యాయని హరీశ్‌రావు తెలిపారు.

ఇండీ కూటమితో ప్రజాస్వామ్య వ్యవస్థలు అవహేళన : రాంచందర్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజాస్వామ్య వ్యవస్థలను అవమానించడమే కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి నైజమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2010లో లాలూ ప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్ నిర్వహించిన మాక్ పార్లమెంట్‌ను అప్పటి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ 'మాకరీ ఆఫ్ డెమోక్రసీ'గా అభివర్ణించారన్నారు. అదే తరహా కార్యక్రమాలను ఇప్పుడు కాంగ్రెస్ నిర్వహించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. మూసీ సుందరీకరణకు బిజెపి వ్యతిరేకం కాదని, అయితే నిర్వాసితులకు సరైన పునరావాసం కల్పించకుండా ఇళ్లు కూల్చడాన్ని సహించబోమన్నారు. నవంబర్ 2న హైదరాబాద్‌లో నిర్వహించే బిజెపి మహాపాదయాత్రలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొంటారని తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన పలువురు రిటైర్డ్ అధికారులు, ఎం.పి.ధర్మపురి అర్వింద్ ఆధ్వర్యంలో బిజెపిలో చేరారు. వారికి రాంచందర్ రావు పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

మియాపూర్ భూముల వేలం వేయొద్దు

మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూములపై సుప్రీంకోర్టు తీర్పు ను స్వాగతిస్తున్నామని, అయితే తీర్పు వెలువడిన వెంటనే భూములను వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం దివాళాకోరుతనానికి నిదర్శనమని రాంచందర్ రావు విమర్శించారు. ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం మాదిరిగా విక్రయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమన్నారు.

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం



హైదరాబాద్ : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం హైదరాబాద్ నగరంపై పడింది. మధ్యాహ్నం వరకు మామూలుగానే ఉన్నా, సాయంత్రం 5 గంటల నుంచి దట్టమైన మబ్బులు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో నగరమంతటా వర్షం కురిసింది. చాలారోజుల తరువాత కురిసిన ఈ వర్షం నగరవాసులను ఇబ్బందులు పెట్టింది. గాలివానకు విద్యుత్ నిలిచిపోవడంతో పాటు రహదారులపై నీరు చేరి వాహనదారులకు నరకం చూపించింది. భాగ్యనగరంలో సాధారణంగానే సాయంత్ర వేళ ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు వదిలే సమయం కావడంతో మామూలుగానే రోడ్లు కిక్కిరిసి ఉంటాయి. దానికి తోడు ఈదురుగాలులు, వర్షం తోడవటంతో వాహనదారుల కష్టాలు రెట్టింపయ్యాయి. ముందుగా కాప్రా పరిధిలో మొదలైన వర్షం క్షణాల్లోనే నగరమంతటా విస్తరించింది. భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో చాలా ప్రాంతాల్లో నగరవాసులను భయాందోళనలకు గురి చేసింది. బహదూర్‌పురాలో అత్యధికంగా 8.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. మాదాపూర్‌లో 7.13 సెం.మీ, జూబ్లీహిల్స్‌లో6.03 మిల్లీమీటర్లు, చార్మినార్‌లో 5.58 సెం.మీ, కూకట్‌పల్లిలో 5.53 సెం.మీ వర్షపాతం నమోదైంది. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా కురిసిన వర్షానికి జనాలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఐటీ హబ్ అయిన మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం వల్ల రహదారులపైకి నీరు చేరడంతో వాహనాలు చాలా నెమ్మదిగా కదిలాయి. రహదారులపై నిలిచిన వాననీటితో ఆయా మార్గాల్లో ప్రయాణించే ఉద్యోగులు, మాదాపూర్ హైటెక్ సిటీ కెపిహెచ్‌బి మార్గంలో మైండ్‌స్పేస్, ఐకియా పరిసర ప్రాంతాల్లో రద్దీ పెరిగి ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. మాదాపూర్ సిటీ వైన్స్ సమీపంలోని ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరింది. రోడ్డుపై నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు, ముందుకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. చాదర్‌ఘాట్, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ ఉప్పల్, బండ్లగూడ నాగోల్ రూట్లలో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది.

'సిఎం ప్రజావాణి' చొరవతో స్వదేశానికి చేరుకున్న కార్మికుడు



ప్రజాపక్షం/హైదరాబాద్: 'సిఎం ప్రజావాణి' ద్వారా తెలంగాణ రాష్ట్రానికి మరో ప్రవాసి కార్మికుడు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం, బినోలా గ్రామానికి చెందిన బుద్ధ పెంటాజీ ఉపాధి నిమిత్తం దుబాయ్‌లోని అరోమా ఇంటర్‌నేషనల్ బిల్డింగ్ కాంట్రాక్టింగ్ సంస్థలో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నారు. సరైన శిక్షణ, అనుభవం లేకుండా కఠినమైన పనులు చేయాల్సి రావడంతో పాటు, అధిక పని గంటల కారణంగా ఆయన తీవ్ర అనారోగ్య సమస్యలు, నీరసం, అధిక చెమటతో బాధపడుతూ ఉద్యోగం కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది. స్వదేశానికి తిరిగి రావడానికి రూ.90వేలు కూడా లేకపోవడంతో ఆయన కుటుంబం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలో ఆయన భార్య బుద్ధ పుష్ప ఇటీవల 'సిఎం ప్రజావాణి' ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి ని ఆశ్రయించి, తన భర్తను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని కోరారు. విజయలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకుని, తెలంగాణ ఎన్ఆర్ఐ విభాగం, దుబాయ్‌లోని భారత కాన్సులేట్ సహకారంతో అవసరమైన చర్యలు చేపట్టారు. దీంతో ఆయన ఈ నెల 23న సురక్షితంగా హైదరాబాద్‌కు చేరుకున్నారు. తమ సమస్యను పరిష్కరించి తన భర్తను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సిఎం ప్రజావాణి స్టేట్ ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి, అధికారులకు, ఎన్ఆర్ఐ విభాగానికి, బుద్ధ పుష్ప, పెంటాజీ కృతజ్ఞతలు తెలిపారు.

అరకిలోమీటరు వెంటాడి దొంగను పట్టుకున్న ఎక్సైజ్ కానిస్టేబుల్

- బంగారు నగలు, నగదు, సెల్‌ఫోన్లతో బ్యాగు చోరీ..
- చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్న మల్కయ్య

ప్రజాపక్షం/హైదరాబాద్: బస్సులో ప్రయాణికుల బ్యాగు, సెల్‌ఫోన్లు చోరీ చేసి పారిపోతున్న ఓ దొంగను ఎక్సైజ్ కానిస్టేబుల్ అరకిలోమీటరు మేర వెంబడించి పట్టుకున్నాడు. విధి నిర్వహణ కోసం బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి దొంగను పట్టుకోవడంతో ప్రయాణికుల నుంచి ప్రశంసలు అందుకున్నాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్ డి. మల్కయ్య చూపిన చొరవను ఎక్సైజ్ అధికారులు అభినందించారు. వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి బస్టాండ్‌లో ఓ ప్రయాణికుడి బ్యాగును, బస్సులోని సెల్‌ఫోన్లను దొంగిలించిన వ్యక్తి కంది స్టేజీ వద్ద బస్సు దిగి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో నిందితుడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన బస్సు కండక్టర్ ప్రయాణికులను అప్రమత్తం చేశాడు. అదే సమయంలో సంగారెడ్డి నుంచి హైదరాబాద్‌లోని నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు విధుల నిమిత్తం బస్సులో వస్తున్న కానిస్టేబుల్ డి. మల్కయ్య ఈ విషయాన్ని గమనించాడు. కండక్టర్ అనుమానంతో బస్సు దిగి నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అతడు పరుగులు తీశాడు. దీంతో మల్కయ్య ఏమాత్రం వెనక్కి తగ్గకుండా అరకిలోమీటరు మేర వెంబడించి నిందితుడిని పట్టుకున్నాడు.

విచారణలో నిందితుడు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి ప్రాంతానికి చెందిన బి. వెంకటేశ్వర్లుగా గుర్తించారు. అతడి వద్ద నుంచి చోరీకి గురైన బ్యాగు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బ్యాగులో బంగారు నగలు, నగదు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం నిందితుడిని, చోరీ సొత్తును అదే బస్సులో తీసుకొచ్చి కండక్టర్, డ్రైవర్ సహకారంతో పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.సమయస్ఫూర్తితో వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న కానిస్టేబుల్ మల్కయ్యను బస్సులోని ప్రయాణికులతో పాటు హైదరాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిరణ్ అభినందించారు.

సచివాలయంపై ఉగ్ర ముప్పు వస్తే.. ఎదుర్కొనేందుకు సన్నద్ధం!



ఒకేసారి రంగంలోకి దిగిన ఆక్టోపస్, పోలీసు, అగ్నిమాపక, బాంబు నిర్వీర్య బృందాలు

130 మంది సిబ్బందితో ఆపరేషనల్ మాక్‌డ్రిల్..

అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంపై కసరత్తు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ సచివాలయంపై ఉగ్రవాద ముప్పు లేదా ఇతర భద్రతాపరమైన అత్యవసర పరిస్థితులు తలెత్తితే తక్షణమే ఎలా స్పందించాలి? వివిధ భద్రతా విభాగాలు ఏ విధంగా సమన్వయంతో పనిచేయాలి? స్పందనా సమయాన్ని ఎలా తగ్గించాలి? అనే అంశాలపై భద్రతా బలగాలు క్షేత్రస్థాయిలో కసరత్తు నిర్వహించాయి. ఆక్టోపస్ బృందం ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయంలో 130 మంది సిబ్బందితో ఆపరేషనల్ మాక్‌డ్రిల్ చేపట్టారు. ఆక్టోపస్ ఎకో స్వాట్ బృందం డీఎస్పి బి. మరియ దాసు నాయకత్వంలో నిర్వహించిన ఈ విన్యాసంలో లా అండ్ ఆర్డర్ పోలీసులు, అగ్నిమాపక శాఖ, సచివాలయ భద్రతా విభాగం (సిఎస్‌జి), తెలంగాణ ప్రత్యేక పోలీసు దళం (టిజిఎస్‌పిఎఫ్), ట్రాఫిక్ పోలీసులు, వైద్య సిబ్బంది, బాంబు నిర్వీర్య బృందాలు పాల్గొన్నాయి. ఆయా విభాగాలు తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వహిస్తూ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే విధానాలను ప్రదర్శించాయి.ఈ మాక్‌డ్రిల్‌లో ఆక్టోపస్ నుంచి 45 మంది, టీజీఎస్‌పీఎఫ్ నుంచి 36 మంది, సీఎస్‌జీ నుంచి 18 మంది, లా అండ్ ఆర్డర్ పోలీసుల నుంచి 10 మంది, ట్రాఫిక్ పోలీసుల నుంచి 10 మంది, అగ్నిమాపక శాఖ నుంచి 8 మంది, వైద్య బృందం నుంచి ఆరుగురు, బాంబు నిర్వీర్య బృందం, అసాల్ట్ డాగ్ విభాగం నుంచి నలుగురు పాల్గొన్నారు. ఆక్టోపస్ అడిషనల్ ఎస్‌పి, అసాల్ట్ కమాండర్ రఘునందన్‌రావు, టిజిఎస్‌పిఎఫ్ సచివాలయ సిఎస్‌ఒ పి. దేవిదాస్, సచివాలయ ఎసిపి శంకర్, ఆక్టోపస్ డిఎస్‌పి రామకృష్ణ, ట్రాఫిక్ ఎసిపి మోహన్‌రావు, టిజిఎస్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు పవన్‌కుమార్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. సచివాలయ భద్రతను మరింత పటిష్టం చేయడం, విపత్కర పరిస్థితుల్లో వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచడం, తక్షణ స్పందన సామర్థ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ఇలాంటి విన్యాసాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సి అండ్ డి రీసైక్లింగ్ ‘ధర’లో జ్యాప్యమేలా ?

రీసైకిల్ ఉత్పత్తులు సిద్ధం..

ధరల ఖరారులో జాప్యం

అమల్లోకి రాని జి.ఓ అధికారుల కమిటీ తాత్సారం

గుట్టలుగా పేరుకుపోతున్న రీసైక్లింగ్ ఉత్పత్తులు

నాన్చుడు ధోరణితో ప్లాంట్లకు తీవ్ర నష్టం



ప్రజాపక్షం/హైదరాబాద్: నిర్మాణ వ్యర్థాలను సంపదగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల (కన్‌స్ట్రక్షన్ అండ్ డెమాలిషన్ వేస్ట్ సి అండ్ డి) సమస్యకు పరిష్కారంగా ఏర్పాటు చేసిన రీసైక్లింగ్ ప్లాంట్లు ఉత్పత్తులు తయారు చేస్తున్నా.. వాటి వినియోగం మాత్రం ముందుకు సాగడం లేదు. వ్యర్థాలను శుద్ధి చేసి తయారు చేస్తున్న ఇటుకలు, రోబోశాండ్ పేవర్ బ్లాకులు, టైల్స్, కెర్బ్ స్టోన్స్ వంటి నిర్మాణ సామగ్రి ధరలను ఖరారు చేయడంలో ఈఎన్‌సి స్థాయి అధికారుల కమిటీ జాప్యం చేస్తుండటంతో ప్లాంట్లలో ఉత్పత్తులు నిల్వలు పేరుకుపోతున్నాయి. ఒకవైపు రీసైకిల్ చేసిన నిర్మాణ సామగ్రిని తప్పనిసరిగా వినియోగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా, మరోవైపు వాటి ధరల నిర్ణయం మాత్రం పూర్తి కాకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోంది.

జి.ఓ జారీ.. అమలు మాత్రం నత్తనడక

సి అండ్ డి వ్యర్థాల నిర్వహణను పటిష్టం చేయడంతో పాటు రీసైకిల్ ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ నెంబర్ 626ను జారీ చేసింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని జిహెచ్ఎంసి, సిఎంసి, ఎంఎంసి మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఈ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించింది. ప్రభుత్వ నిర్మాణ పనుల్లో కనీసం 10 శాతం నిర్మాణ సామగ్రిని సి అండ్ డి వ్యర్థాల రీసైక్లింగ్ ద్వారా తయారైన ఉత్పత్తుల నుంచే వినియోగించాలని స్పష్టం చేసింది. రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధి పనుల్లోనూ వీటిని ఉపయోగించాలని సూచించింది. అయితే అందుబాటులో లేని పరిస్థితుల్లో రీసైక్లింగ్ కేంద్రాల నుంచి ధ్రువీకరణ పొందే అవకాశం కల్పించింది. అయితే ఆదేశాలు జారీ చేసినా, వాటిని అమలు చేయాల్సిన స్థాయిలో మాత్రం జాప్యం కొనసాగుతోంది. ముఖ్యంగా రీసైకిల్ ఉత్పత్తుల ధరల నిర్ణయం పూర్తికాకపోవడంతో ప్రభుత్వ విభాగాలు కొనుగోళ్లపై ముందడుగు వేయలేకపోతున్నాయి.

ధరలపై స్పష్టత లేక నిలిచిన కొనుగోళ్లు

రీసైకిల్ చేసిన నిర్మాణ సామగ్రిని ఏ ధరకు కొనుగోలు చేయాలి? సాధారణ మార్కెట్‌లో లభించే సామగ్రితో పోలిస్తే వీటి ధరల విధానం ఎలా ఉండాలి? నాణ్యత ప్రమాణాలు, రవాణా ఖర్చులు, సరఫరా వ్యవస్థ ఎలా ఉండాలి? అనే అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. ఈఎన్‌సి స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ ధరల నిర్ణయంపై కసరత్తు చేస్తున్నప్పటికీ, అది పూర్తికాకపోవడంతో రీసైక్లింగ్ సంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉత్పత్తి సిద్ధంగా ఉన్నా కొనుగోలుదారులు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

రోజుకు 2 వేల టన్నుల వ్యర్థాల ఉత్పత్తి

హైదరాబాద్ మహానగరంలో రోజుకు సుమారు 2 వేల మెట్రిక్ టన్నుల నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్లు జిహెచ్ఎంసి అంచనా వేసింది. వీటిని శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసేందుకు జీడిమెట్ల, ఫతుల్లాగూడ ప్రాంతాల్లో రీసైక్లింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. రాంకీ సంస్థ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ ప్లాంట్లలో నిర్మాణ వ్యర్థాలను వేరు చేసి, క్రషింగ్, స్క్రీనింగ్, వాషింగ్ ప్రక్రియల ద్వారా తిరిగి వినియోగించగల నిర్మాణ సామగ్రిగా మారుస్తున్నారు. ఇటుకలు, రోబోశాండ్ పేవర్ బ్లాకులు, టైల్స్, కెర్బ్ స్టోన్స్ వంటి ఉత్పత్తులు తయారవుతున్నాయి. ఎంఎంసి పరిధిలోని ఫతుల్లాగూడలో సోమ శ్రీనివాస్ ఏర్పాటు చేసిన ప్లాంట్‌లోనూ ఇదే విధంగా వ్యర్థాలను శుద్ధి చేసి నిర్మాణ సామగ్రిని తయారు చేస్తున్నారు. అయితే కొనుగోళ్లు లేకపోవడంతో ఉత్పత్తులు నిల్వలుగా పేరుకుపోతున్నాయి.

2,250 టన్నుల ప్రాసెసింగ్ సామర్థ్యం

జిహెచ్ఎంసి సమాచారం ప్రకారం జీడిమెట్ల, ఫతుల్లాగూడ ప్లాంట్లలో రోజుకు 1,000 టన్నుల వరకు వ్యర్థాలను ప్రాసెస్ చేసే సామర్థ్యం ఉంది. అనంతరం షామీర్‌పేట, శంషాబాద్ ప్రాంతాల్లో మరో రెండు ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఈ) నివేదిక ప్రకారం నగర పరిధిలోని ఈ నాలుగు ప్లాంట్ల మొత్తం ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు 2,250 టన్నులకు చేరింది. ఇప్పటివరకు ఈ ప్లాంట్లలో సుమారు 21.93 లక్షల మెట్రిక్ టన్నుల నిర్మాణ వ్యర్థాలను సేకరించినట్లు తెలిసింది.

వ్యర్థాల నుంచి సంపద.. వినియోగమే సవాల్

నిర్మాణ వ్యర్థాల సమస్యకు పరిష్కారంగా జీడిమెట్లలో ప్రభుత్వ భూమిని కేటాయించి రాంకీ సంస్థకు ప్లాంట్ ఏర్పాటు అవకాశం కల్పించారు. ఫతుల్లాగూడలో ప్రైవేటు రంగానికి చెందిన సోమ శ్రీనివాస్ కూడా రీసైక్లింగ్ రంగంలోకి వచ్చారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో వ్యర్థాల నుంచి విలువైన నిర్మాణ సామగ్రి తయారీకి మార్గం ఏర్పడినా.. వాటిని మార్కెట్‌లోకి తీసుకురావడమే ప్రధాన సవాల్‌గా మారింది. ధరలు ఖరారు కాకపోవడంతో ప్రభుత్వ శాఖలు, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగాలు కొనుగోళ్లపై నిర్ణయం తీసుకోలేకపోతున్నాయి. రీసైకిల్ ఉత్పత్తుల వినియోగాన్ని తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో, ధరల నిర్ణయం త్వరగా పూర్తిచేసి సరఫరా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని నిర్మాణ రంగ వర్గాలు కోరుతున్నాయి.

తెలంగాణలో ప్రత్యమ్నాయ శక్తిగా జనసేనను తీర్చిదిద్దుతాం

తెలంగాణ అస్థిత్వానికి నిదర్శనం ‘జనసేన అలయ్ బలయ్’

ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యమ్నాయ రాజకీయ శక్తిగా జనసేన పార్టీని తీర్చిదిద్దుతామని, దానికోసం జనసేన పార్టీ శ్రేణులు, ప్రజల మద్దతు కావాలని తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల జనసేన అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు స్పష్టం చేశారు. హైద్రాబాదులోని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన జనసేన తెలంగాణ ‘అలయ్ బలయ్’ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలంగాణ అస్థిత్వానికి నిదర్శనం ‘జనసేన అలయ్ బలయ్’ ఆత్మీయ సమ్మేళనమని వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రులు తక్షణమే తమ ఓటును నమోదు చేయించుకోవాలని, పట్టభద్రులు జనసేన పార్టీ అభ్యర్థిగా తనకు ఒక్క అవకాశం ఇవ్వాల్సిందిగా కోరారు. నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్త దాకా ప్రతిఒక్కరి మధ్య ఆత్మీయ అనుబంధాన్ని, పరస్పర విశ్వాసాన్ని, సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి గ్రామ స్థాయి వరకు సంస్థాగత సమన్వయాన్ని పెంపొందించడం, అభిప్రాయాలకు, సూచనలకు, సేవలకు సముచిత ప్రాధాన్యం కల్పించడం, పార్టీ శ్రేణుల మధ్య ప్రత్యక్ష సంబంధాలు, పరస్పర విశ్వాసాన్ని బలోపేతం చేయడం, తెలంగాణ ఆకాంక్షలు, యువత భవిష్యత్తు, విద్య, ఉపాధి, ప్రజారోగ్యం, వంటి అంశాలపై ఉమ్మడి అవగాహన పెంపొందించడం, సామాజిక న్యాయం, ప్రజాసమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి, బాధ్యతాయుతమైన ప్రజాసేవా సంస్కృతిని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యాలుగా ’జనసేన తెలంగాణ అలయ్ బలయ్’ నిర్వహించినట్లు తెలిపారు. అందరినీ ఒకే కుటుంబంగా ముందుకు నడిపించడం, మనసులను కలపడం, అపోహలను తొలగించడం, నాయకత్వాన్ని కార్యకర్తలకు మరింత చేరువ చేయడమే ‘జనసేన తెలంగాణ అలయ్ బలయ్’ సమ్మేళనం ప్రధాన ఉద్దేశమని పునరుద్ఘాటించారు.

దత్తత పేరుతో సైబర్ మోసం..
రూ.1.10 లక్షలు స్వాహా

ప్రజాపక్షం/హైదరాబాద్: చిన్నారిని దత్తత తీసుకోవాలన్న ఆశను ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో అనాథాశ్రమం పేరుతో ప్రకటన పెట్టి, దత్తత ప్రక్రియకు సంబంధించిన రుసుములంటూ బాధితుడి నుంచి ఆయన భార్య బ్యాంకు ఖాతాల ద్వారా మొత్తం రూ.1,10,751 కాజేశారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.రాచకొండ పరిధిలోని బాలాపూర్ పోలీసులకు అందిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. షహీన్‌నగర్, ఉస్మాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ రఫీ (54) ఈ నెల 21న ఇన్‌స్టాగ్రామ్‌లో ‘అనాథాశ్రామ్ చైల్డ్‌డాప్’ పేరుతో ఉన్న ఖాతాలో చిన్నారిని దత్తత ఇచ్చేందుకు సంబంధించిన ప్రకటనను చూశారు. అందులో ఉన్న ఫోన్ నంబర్‌కు సంప్రదించగా, పంకజ్ సింగ్ వడోరియా అనే వ్యక్తి తాను అనాథాశ్రామ్ సంస్థకు చెందినవాడినని పరిచయం చేసుకున్నాడు. చిన్నారిని దత్తత తీసుకునే ప్రక్రియను వివరించి, బుకింగ్, దత్తత ఖర్చుల పేరుతో డబ్బులు పంపాలని సూచించాడు. ఇందు కోసం క్యూఆర్ కోడ్‌ను పంపడంతో బాధితుడు నమ్మి తన బ్యాంకు ఖాతాతో పాటు భార్య ఖాతా నుంచి విడతలవారీగా డబ్బులు బదిలీ చేశాడు.అంతటితో ఆగకుండా నిందితుడు బాధితుడి బ్యాంకు ఖాతాల వివరాలు, ఆధార్, పాన్ కార్డు వివరాలను సైతం తీసుకున్నాడు. అనంతరం బ్యాంకు ఖాతాలు నిలిచిపోయాయని చెబుతూ, ఖాతాలకు అనుసంధానమైన ఫోన్ నంబర్లను తాను సూచించిన నంబర్లతో మార్చుకోవాలని చెప్పాడు. అలా చేస్తేనే దత్తత ప్రక్రియ ముందుకు సాగుతుందని నమ్మించాడు. అతడి మాటలు విశ్వసించిన బాధితుడు సూచించిన విధంగా వ్యవహరించాడు. ఆ తర్వాత తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ నేర విభాగానికి ఫిర్యాదు చేశాడు.ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు మొత్తం 14 లావాదేవీల ద్వారా రూ.1,10,751 నష్టపోయినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదు ఆధారంగా బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 660/2026గా కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘రుద్రవనం పిఎస్’ పెద్ద విజయం సాధిస్తుంది

ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హరీష్ శంకర్



ఎల్లో ఫ్లవర్స్, శ్రీ చక్ర మూవీస్ బ్యానర్ల మీద రమేష్ పుప్పాల, సూర్యకాంతి నిర్మాతలుగా శశిధర్ మున్నంగి తెరకెక్కించిన న్యూసిరీస్ ‘రుద్రవనం పీఎస్’. ఈ సిరీస్‌ను జీ5లో అక్టోబర్ 30 నుంచి స్ట్రీమింగ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో హరీష్ శంకర్ మాట్లాడుతూ .. ‘‘మా నిర్మాత రమేష్ పుప్పాలని మళ్లీ ఇలా చూడటం ఆనందంగా ఉంది. ‘మిరపకాయ్’ టైంలో రమేష్ నన్నెంతో ఎంకరేజ్ చేశారు. రాజా రవీంద్ర సహకారం ఎప్పటికీ మర్చిపోలేను. వివేక్ కూచిభోట్ల నా ఫ్యామిలీ మెంబర్లాంటి వారు. వివేక్ శ్రీమతి సూర్యకాంతి ఈ సిరీస్‌తో నిర్మాతగా రానున్నారు. డైరెక్టర్ శశి ఈ సిరీస్‌తో గొప్ప విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను. ‘రుద్రవనం పిఎస్’ కంటెంట్ నేను చూశాను. ఊహించిన దాని కంటే పెద్ద విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను’ అని అన్నారు. వివేక్ కూచిబొట్ల మాట్లాడుతూ ‘‘మాకు ఈ అవకాశం ఇచ్చిన జీ5 టీంకు థాంక్స్. నరేష్ అగస్త్య మాకు ఎంతో సహకరించారు. ‘రుద్రవనం పిఎస్’ మంచి సిరీస్ అవుతుందని నమ్ముతున్నాను’ అని అన్నారు. నిర్మాత సూర్యక్రాంతి మాట్లాడుతూ .. ‘‘రుద్రవనం పిఎస్’లోని ప్రతీ ఎపిసోడ్ అద్భుతంగా ఉంటుంది. ఎక్కడా బోర్ కొట్టించకుండా ఉంటుంది. జీ5 టీం ఇచ్చిన సపోర్ట్‌ను మేం ఎప్పుడూ మర్చిపోలేం. మా కోసం వచ్చిన హరీష్ శంకర్ గారికి థాంక్స్. మాకు సపోర్ట్ చేస్తున్న మీడియా, సోషల్ మీడియాకు ధన్యవాదాలు. అక్టోబర్ 30 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కాబోతోంది. అందరూ చూడండి అని అన్నారు. నరేష్ అగస్త్య, దర్శకుడు శశిధర్ మున్నంగి , నిర్మాత రమేష్ , శ్రావణి రెడ్డి , రాజా రవీంద్ర నటి సుగాలి సిలోని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

‘జతగూడె’ పాట విడుదల



నమిత్ మల్హోత్రా ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న ‘రామాయణం’ నుంచి మరో అందమైన పాట ‘జతగూడె’ విడుదలైంది. శ్రీరాముడు, సీతమ్మ కళ్యాణం అద్భుతమైన విజువల్స్‌తో ఆవిష్కరిస్తూ, వారి కళ్యాణంలోని మధురమైన క్షణాలను ఈ పాటలో చూపించారు. ఈ పాటకు ఏ.ఆర్. రెహమాన్ అద్భుతమైన సంగీతం సమకూర్చారు. రాకేందు మౌళి తెలుగు సాహిత్యాన్ని అందించారు. శిరీష భాగవతుల మనసు ఆకట్టుకునేలా ఆలపించారు. శ్రీరాముడు, సీతమ్మ వివాహ వేడుకలకు సంబంధించిన దృశ్యాలు ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పవిత్రమైన వివాహ వేడుకలు, అయోధ్యను దాటి సాగిన ప్రయాణం.. ఇలా శ్రీరాముడు, సీతమ్మ జీవితంలోని వివిధ ఘట్టాలను ఈ పాటలో చూపించారు. ఈ పాట ప్రతి ఒక్కరీ ఆకట్టుకుంటుంది. శ్రీరాముడిగా రణ్బీర్ కపూర్, సీతమ్మగా సాయిపల్లవి నటిస్తున్న ఈ పాట ప్రస్తుతం వరల్ ఆఫ్ రామాయణ, టీసిరీస్ యూట్యూబ్ ఛానల్లలో అందుబాటులో ఉంది. అన్ని మ్యూజిక్ స్ట్రీమింగ్ పాట్‌ఫామ్‌లలోనూ విడుదలైంది. ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన ఇతిహాసాల్లో ఒకటైన రామాయణాన్ని వెండితెరపై భారీ స్థాయిలో ఆవిష్కరిస్తున్న ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణ్బీర్ కపూర్, సీతమ్మగా సాయిపల్లవి, రావణుడిగా రాకింగ్ స్టార్ యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ఎనిమిది ఆస్కార్ అవార్డులు అందుకున్న డిఎన్ఇజి, యశ్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్‌తో కలిసి నిర్మిస్తోంది. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ ఎపిక్‌లో మొదటి భాగం 2026 నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. భారతదేశంలో హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం విడుదలవుతుంది. ఈ సినిమాను ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ విడుదల చేయనున్నారు. ఈ చిత్రం ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఎస్‌విసి ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. భారతదేశం మినహా ప్రపంచవ్యాప్తంగా సోనీ పిక్చర్స్ ఈ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేస్తుండగా, హిందీ మార్కెట్‌లో ధర్మ ప్రొడక్షన్స్ డిస్ట్రిబ్యూషన్ బాధ్యతలు చేపడుతోంది.


‘రాధే రాధే’ ఫస్ట్ సింగిల్ రిలీజ్

రీల్



దుల్కర్ సల్మాన్ హీరోగా, క్రియేటివ్ డైరెక్టర్ పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న డిఫరెంట్ ఎమోషనల్ డ్రామా ‘ఆకాశంలో ఒక తార’. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతుండగా, శ్రుతి హాసన్, రుహాని శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే గ్లింప్స్, టీజర్, పోస్టర్లతో ఆసక్తిని పెంచిన మేకర్స్. తాజాగా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభిస్తూ ఫస్ట్ సింగిల్ ‘రాధే రాధే’ను విడుదల చేశారు. సాధారణంగా గుజరాత్‌కు వెళ్లడానికి రెండు ప్రధాన కారణాలు ఉంటాయి. ఒకటి ద్వారకను సందర్శించడం, రెండోది బొగ్గు గనుల్లో పనిచేయడం. దుల్కర్ సల్మాన్, బిజిలీ పాత్రలో నటిస్తున్న రుహాని శర్మ మధ్య జరిగే సంభాషణ ద్వారా ఈ ఆసక్తికరమైన విషయాన్ని పాట ప్రోమోలో పరిచయం చేశారు. ఇప్పుడు విడుదలైన పూర్తి పాటలో దుల్కర్ సల్మాన్ పాత్ర బొగ్గు గనుల్లో పనిచేయడం కోసం గుజరాత్కు వెళ్లినట్లు తెలుస్తోంది. మనసును తాకే మెలోడీలను అందించడంలో జివి ప్రకాశ్ కుమార్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. గీత రచయిత శ్రీమణి, కథానాయకుడి మౌనం, కష్టాలు, శ్రమ, మొక్కవోని సంకల్పాన్ని ఆయన తన సాహిత్యంలో ఎంతో సున్నితంగా ఆవిష్కరించారు. ఇంతటి కష్టమైన ప్రయాణం వెనుక ప్రేమ ఉందనే విషయం పాటపై మరింత ఆసక్తిని పెంచుతూ, భావోద్వేగానికి గురిచేస్తోంది. ఈ చిత్రానికి సుజిత్ సారంగ్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జివి ప్రకాశ్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్వేత సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైనర్.‘ఆకాశంలో ఒక తార’ చిత్రం నవంబర్ 20న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ‘పాకెట్ రాకెట్స్’



నిహారిక కొణిదెల పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, మాక్సిమం సిటీ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న నూతన చిత్రం ‘పాకెట్ రాకెట్స్’. ఈ సినిమాకు రుద్ర అత్రి దర్శకత్వం వహించనున్నారు. యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ మూవీలో త్రినాథ్ వర్మ (కమిటీ కుర్రోళ్ళు ఫేమ్) , నిర్మల్ (డెబ్యూ) హీరోలుగా శ్రియా కొంతం (శుభం ఫేమ్) హీరోయిన్‌గా నటిస్తున్నారు. జేడీ చక్రవర్తి ముఖ్యపాత్రలో కనిపించనున్నారు. గ్యాంబ్లింగ్ చుట్టూ తిరిగే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌ను, కాన్సెప్ట్ పోస్టర్‌ను రివీల్ చేశారు. విదేశాల్లో చదువుకోవాలని అనుకునే ఓ కుర్రాడు, ఆ కలను సాకారం చేసుకునేందుకు గ్యాంబ్లింగ్లోకి దిగడం, ఆ తర్వాత ఆ కుర్రాడి జీవితంలో ఎదురైన పరిస్థితుల్ని ‘పాకెట్ రాకెట్స్’లో ఎంతో ఆసక్తికరంగా చూపించబోతోన్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తి అయ్యింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు మొదలయ్యాయి. త్వరలో టీజర్, రిలీజ్ డేట్ అనౌన్స్ చేయనున్నారు.ఈ చిత్రానికి ఎదురోలు రాజు కెమెరామెన్‌గా, అన్వల్ అలీ ఎడిటర్‌గా వర్క్ చేయనున్నారు. ఈ మూవీకి గ్యానీ సంగీతాన్ని అందించనున్నారు.

‘హుషార్ -2’లో నాది గొప్ప పాత్ర

టీజర్ లాంచ్‌లో ఆర్. నారాయణమూర్తి



హెచ్చే ఫిల్మ్స్, కలియుగ వారధ క్రియేషన్స్ బ్యానర్ల మీద రాహుల్ వర్మ, కె. వీణా రాణి, కె. హనుమంత్ రాజు సంయుక్తంగా నిర్మించిన చిత్రం ‘హుషారు 2’. ఈ మూవీకి శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో రాహుల్ రామకృష్ణ, అశోక్ గల్లా, రవి ఆంటోనీ, దినేష్ తేజ్, శశిధర్, రాజై రోవన్, అభిజ్ఞ, శ్రీకాంత్ కన్ని, బాబీ రాచకొండ ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీ టీజర్‌ను మంగళవారం నాడు రిలీజ్ చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌కు పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ ‘హుషారు 2’లో నాకు గొప్ప పాత్రను ఇచ్చారు. చాలా ఏళ్ల తర్వాత మంచి పాత్రను పోషించాను. ‘హుషారు’లో ఎంత నవ్వించారో.. అంతకు మించి నవ్విస్తూనే, ఆలోచించేలా చేస్తారు. నిరుదోగ్య సమస్యను ఎంతో గొప్పగా చూపించారు. పని హక్కుని కోల్పోతోన్నాం. శ్రమకు తగ్గ ప్రతిఫలం అనేది లేదు. నలిగిపోతోన్న యువతకి స్వతంత్రంగా, స్వేచ్ఛగా, ఆత్మాభిమానంతో బతకాలనే గొప్ప సందేశాన్ని ఇచ్చారు. ఇలాంటి గొప్ప చిత్రాన్ని ప్రజలు ఆదరిస్తారని ఆశిస్తున్నాను. ‘హుషారు 2’ సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది. దర్శకుడు హర్ష ఎక్కడా కూడా రాజీ పడడు. రవిరాజా పినిశెట్టి తర్వాత నాకు హర్షలో ఆ క్వాలిటీ కనిపించింది. కెమెరామెన్ ఎంతో ఓర్పుగా ఉన్నాడు. సినిమా నచ్చితే ప్రజలు ఎవరినైనా సార్‌లోను చేస్తారు. అలా ఈ మూవీని జనాలకు నచ్చేలా హర్ష తీశారు. ‘హుషారు 2’ మూవీని జనాల వద్దకు తీసుకు వెళ్లాలని మీడియాకి విజ్ఞప్తి చేస్తున్నాను అని అన్నారు. అశోక్ గల్లా , రాహుల్ రామకృష్ణ, దర్శకుడు శ్రీ హర్ష కొనుగంటి , నిర్మాత రాహుల్ వర్మ , విధి యాదవ్ దినేష్ తేజ్ , ఆర్ట్ డైరెక్టర్ శ్రీకాంత్ రామిశెట్టి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



‘డ్యాడ్స్ లిటిల్ ఫ్రెండ్’ టీజర్ లాంచ్

వెన్నెల సిల్వర్ స్క్రీన్ బ్యానర్ మీద దీపక్ నిర్మాణంలో శరత్ తెరకెక్కించిన చిత్రం ‘డ్యాడ్స్ లిటిల్ ఫ్రెండ్’. ఈ సినిమాలో రజత్ రాఘవ్, కాజల్, హాసిని సుధీర్ హీరో హీరోయిన్లు గా బెబి పరిణిత రుద్రరాజు ముఖ్య పాత్రలో రూపొందించిన ఈ మూవీకి సంబంధించిన టీజర్‌ను గురువారం నాడు రిలీజ్ చేశారు. ఈ టీజర్ లాంచ్‌కు స్టార్ రైటర్ విజయేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో..వి. విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ‘‘పరిణితతో సినిమాని తీసేందుకే దర్శకుడు, నిర్మాత పుట్టారనిపిస్తోంది. పరిణితకు ఈ తెలుగు సినిమా చరిత్రలో ఓ పేజీ ఉండబోతోంది. శరత్ గారు సినిమాని అద్భుతంగా తీసి ఉంటారని ఆశిస్తున్నాను. రజత్‌కు ఈ చిత్రంతో పేరు, డబ్బు అన్నీ వస్తాయని కాంక్షిస్తున్నాను. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. హీరో రజత్ రాఘవ్దర్శకుడు శరత్, నిర్మాత డి దీపక్, హాసిని సుధీర్, నటుడు రాకేష్, బేబీ పరిణిత, మాస్టర్ బన్నీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

12
ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
31-10-2026
www.prajapaksham.in

ప్రజాపక్షం
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

నిరసన గళాన్ని అణచలేరు

1న దద్దరిల్లబోతున్న ఢిల్లీ: డి.రాజా

చెన్నై: దేశ రాజధాని ఢిల్లీ మరోమారు 'ఇండియా' నిరసనలతో హోరెత్తబోతోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. దేశ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, అధికారాలను మోదీ ప్రభుత్వం హరించలేదని స్పష్టం చేశారు. నిరసనలపై ఆంక్షలు విధిస్తుండటం, ఆందోళనలపై ఉక్కుపాదం మోపుతుండటాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే హక్కు ప్రజలకు రాజ్యాంగం కల్పించిందని, దానిని హరించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేదని, నిరసన గళాన్ని ఆంక్షలతో అణచివేయలేరన్నారు. నవంబరు 1న దేశ రాజధాని ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన అధ్వర్యంలో భారీ ర్యాలీ, బహిరంగ సభకు రంగం సిద్ధమైన క్రమంలో డి.రాజా ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన తమిళనాడు రాజధాని చెన్నైలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీ కార్యక్రమం ఏ ఒక్క పార్టీకి పరిమితం కాదని, ఇండియా ఐక్య సంఘటన ఉమ్మడి కార్యాచరణతో దీనిని సమష్టిగా చేపడుతోందని వెల్లడించారు. ర్యాలీ, సభను జయప్రదం చేసేందుకు భాగస్వామ్య పార్టీలన్నీ తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే చారిత్రక వేదిక జంతర్ మంతర్‌పై ఆంక్షలను ఆక్షేపించారు. నిరసన వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రతి స్థానాన్ని ఎలా నిషేధిస్తారు? ప్రజలు ఎక్కడకు వెళ్లాలి? ప్రభుత్వాలు అనుసరించే విధానాలపై తమకున్న వ్యతిరేకత, అసమ్మతిని వ్యక్తం చేసేందుకు దేశ ప్రజలకు హక్కు ఉన్నది' అని డి.రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ప్రజలు తమ అసమ్మతిని, నిరసనను వ్యక్తం చేసేందుకు జంతర్ మంతర్‌ను తిరిగి అందుబాటులోకి తేవాలని సూచించారు. 'ఇలా ప్రతి స్థలాన్ని నిషేధిస్తే ప్రజలు తమ సమస్యలపై ఎక్కడ మాట్లాడాలి? ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకతను ఎక్కడ వ్యక్తం చేయాలి'? అంటూ వరుస ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే హక్కును రాజ్యాంగం ప్రజలకు కల్పించిందని, ఆ హక్కులను, అధికారాలను మోదీ ప్రభుత్వం లాక్కోలేదని డి.రాజా స్పష్టంచేశారు. నవంబరు 1వ తేదీన తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇండియా ఐక్య సంఘటన సమష్టిగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్‌తో పాటు భాగస్వామ్య పక్షాలన్నీ కూడా జన సమీకరణలో నిమగ్నమయ్యాయని, చత్తీస్‌గఢ్, బీహార్ వంటి రాష్ట్రాల నుంచి కార్యకులను సమీకరిస్తున్నట్లు డి.రాజా వెల్లడించారు. ఎస్ఐఆర్, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, రాజ్యాంగ సంస్థల స్వతంత్రత, కేంద్ర ప్రభుత్వ విధానాలపై జవాబుదారీతనం తదితర అంశాలపై ఇండియా అధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. నవంబర్ 1న జరిగే ర్యాలీ కోసం ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, దాదాపు పది లక్షల మంది పాల్గొనే అంచనా ఉందని అన్నారు. అదే సమయంలో తమిళనాడులోని అధికార విదుతలై చిరుతైగళ్ కట్చి (విసికె') పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్ కూడా 'ఇండియా' ర్యాలీకి మద్దతు ప్రకటించారు. తమిళనాడు, కేరళం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి కార్యకర్తలు పాల్గొంటారని చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన తెలిపారు.



నూతన రైలు మార్గాల మంజూరుకు అనుమతులు ఇవ్వండి

హైస్పీడ్ రైళ్ల మార్గాల పనులు వేగవంతం చేయండి
కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నూతన రైలు మార్గాల మంజూరుకు అనుమతులు ఇవ్వాలని సిఎం కోరారు. హైదరాబాద్ పుణె, హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్ చెన్నై కారిడార్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని సిఎం తెలిపారు. ఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించలేదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అలైల్‌మెంట్ ఆమోదించిన తర్వాత భూ సేకరణను ప్రారంభిస్తామని సిఎం స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా అలైల్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ రైలు భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కీలక రైలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రితో సిఎం చర్చించారు. వికారాబాద్ – కృష్ణా కొత్త రైలు మార్గాన్ని (130 కి.మీ.) వెంటనే మంజూరు చేయాలని సిఎం కోరారు. వికారాబాద్ జిల్లా పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని, దీంతో ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి సిఎం తెలియజేశారు. హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కి.మీ మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) పక్కనే రీజినల్ రింగ్ రైలును అలైల్‌మెంట్ చేయాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సిఎం కోరారు. రీజినల్ రింగు రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. డోర్నకల్ గద్వాల్, కల్వకుర్తి – మాచర్ల, కాచిగూడ – జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు – ఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్ – లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.) మార్గాలను వెంటనే మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీప అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409 ఎకరాల భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని సిఎం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపిలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

'ఇండియా' ర్యాలీకి రాంలీలా సిద్ధం

ఏర్పాట్లు పరిశీలించిన సిపిఐ బృందం

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం డిమాండ్ చేస్తూ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నవంబరు ఒకటో తేదీన ఇండియా ఐక్య సంఘటన తలపెట్టిన ర్యాలీ కోసం ఢిల్లీలోని రాంలీలా మైదానం సిద్ధమైంది. ఓటు చోరీకి వ్యతిరేకంగా తమ పోరాటం ఆగబోదని, ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని, జ్ఞానేశ్ కుమార్ దిగిపోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, వామపక్షాలు సహా 'ఇండియా' భాగస్వామ్య పక్షాలు సమష్టిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఇదే క్రమంలో సిపిఐ కార్యదర్శులు పి.సందోశ్ కుమార్, గిరీశ్ శర్మ, సంజయ్ కుమార్‌తో పాటు ఢిల్లీ కార్యదర్శి దినేశ్ వర్షినే శుక్రవారం రాంలీ లా మైదానాన్ని సందర్శించారు. అక్కడ పె ద్ద ఎత్తున జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఐఎన్‌సికి సహకారం అందించారు. దేశ నలుమూలల నుంచి వచ్చే సిపిఐ కేడర్ కోస ం చేసిన ఏర్పాట్లను కూడా సిపిఐ నాయకులు పరిశీలించారు.



ఐటి దాడులు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆసుపత్రి నిర్వహణ, ఆదాయ వ్యయాలు, నగదు లావాదేవీలు, పన్ను చెల్లింపులకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆసుపత్రి యాజమాన్యం, కీలక డైరెక్టర్ల ఆర్థిక మూలాలు, నిధుల లావాదేవీలపై ఐటీ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం.స్వాధీనం చేసుకున్న డిజిటల్ ఆధారాలు, పత్రాలను విశ్లేషించిన అనంతరం మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. అయితే సోదాల్లో పన్ను ఎగవేత జరిగినట్లు ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ కాలేదు. తనిఖీలకు సంబంధించి ఐటీ శాఖ నుంచి పూర్తి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఒమేగా హాస్పిటల్స్ యాజమాన్యం స్పందన కూడా తెలియాల్సి ఉంది.

దేశవ్యాప్తంగా జనగణన

(మొదటి పేజీ తరువాయి)

(సెల్ఫ్ ఎన్యూమరేషన్) అవకాశం కల్పిస్తారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన ఇది. దీనిని రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటిది గృహాల జాబితా తయారీ, గృహ గణన, రెండోది జనాభా లెక్కింపు. ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగాల్సిన ఈ ప్రక్రియ ఈసారి జాప్యం జరిగింది. వాస్తవానికి జగగణన 2021లోనే జరగాల్సి ఉండగా, కొవిడ 19 మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఈ భారీ జనాభా గణన ప్రక్రియ కోసం కేంద్ర మంత్రివర్గం రూ.11,718 కోట్లు కేటాయించింది. వాస్తవానికి, గతంలోనే మణిపూర్‌లో 2027 జనాభా గణనకు సంబంధించి గృహాల జాబితా తయారీ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఆర్‌జిఐ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. భారతదేశంలో చివరిసారిగా 2011లో జనాభా గణన జరిగింది. అప్పుడు దేశ జనాభా 121 కోట్లుగా నమోదైంది; ఇందులో 62.32 కోట్ల మంది పురుషులు, 58.75 కోట్ల మంది మహిళలు ఉన్నారు. ఆ సమయంలో దేశంలో 24.95 కోట్ల కుటుంబాలు ఉన్నాయి.

















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com